RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



భారత్ శక్తి®
తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:235 హైదరాబాద్, శుక్రవారం, 18 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

# జపాన్‌లో సీఎం రేవంత్ పెట్టుబడుల వేట..

## మారుబెనీతో వెయ్యి కోట్ల ఒప్పందం

: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంది. జపాన్ కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసింది.

టోక్యోలో మారుబెనీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై ఇరువురు చర్చించారు. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ప్రాజెక్టు చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు.

సదరు ఇండస్ట్రియల్ పార్క్‌లో జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. తద్వారా రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడును ఆకర్షించే అవకాశం ఉంది. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ , డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్



సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరఫున తగినంత సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతను మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ దై సకాకురా ప్రశంసించారు. తెలంగాణలో అవకాశాలను వినియోగించుకునేందుకు ముందు వరుసలో ఉంటామని చెప్పారు. కాగా, మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఫుడ్, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ , మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉందీ కంపెనీ.

## రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా, రాహుల్‌పై కేసులు

%హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బీజేపీ ఫాసిస్టు పాలన చేస్తోందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఇమేజ్‌ను చూసి ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియాలని తాము ధర్నా చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీసు ఎదుట ఇవాళ(గురువారం) టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని మీడియాతో మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ పేపర్‌కి రూ.90 కోట్లు రుణం ఇస్తే మనీలాండరింగ్ జరిగినట్లు ఎలా అవుతుందని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టారని మహేష్ కుమార్ గౌడ్



ఆరోపించారు. మనీలాండరింగ్ కేసు కక్ష్య సాధింపు చర్యలేనని విమర్శలు చేశారు. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగలేదని స్పష్టం చేశారు. మోదీ హవా తగ్గుతున్న క్రమంలో రాహుల్ గాంధీ ఇమేజ్‌ను బద్నాం చేసేందుకు అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. గాంధీ కుటుంబం ఏనాడూ కేసులకు భయపడింది లేదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నవారు బీజేపీ పార్టీలో ఒక్కరూ లేరని చెప్పారు. మోదీకి కనువిప్పు కలిగేలా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ఒక ఫైటర్ అని మహేష్ కుమార్ గౌడ్ అభివర్ణించారు.

దేశ ప్రజల గొంతుక రాహుల్ గాంధీ..

దేశ ప్రజల గొంతుక రాహుల్ గాంధీ అని మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. రాహుల్ సంకల్పం ముందు ఈ కుట్రలు, అక్రమ కేసులు బలాదూర్ అని చెప్పారు. కులగణనతో రాహుల్ గాంధీ మోదీకి రాజకీయ మరణ శాసనం రాశారని అన్నారు. బీహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ , సోనియా గాంధీపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఎన్నికలు రాగానే ప్రతి పక్షాలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వాడటం మోదీ - అమిత్ షాలకు బాగా అలవాటుగా మారిందని విమర్శలు చేశారు.



గుజరాత్‌లో ఏఐసీసీ సమావేశాలతో బీజేపీ నేతల్లో వణుకు మొదలైందని అన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు అసమానమైనవని మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు.

%సంగారెడ్డి జిల్లా: రాహుల్ గాంధీది క్షమించే గుణం.. మోదీ, అమిత్ షాలది కుట్ర గుణమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పోస్టాఫీస్ వద్ద ఇవాళ (గురువారం) జగ్గారెడ్డి ధర్నా చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఈడీ ఛార్జ్ షీటులో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీని అధికారంలోకి తెచ్చిన అద్వానీని ప్రధాన మంత్రిని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మన్మోహన్ సింగ్‌ను ప్రధాన మంత్రిని చేశారని గుర్తుచేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు మోదీ, అమిత్ షాలకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శించారు. స్వాతంత్ర్య సమరాన్ని ఉధృతం చేసేందుకు, ప్రజలను ఉద్యమానికి సమాయత్తం చేసేలా నేషనల్ హెరాల్డ్ ఎంతో కృషి చేసిందని జగ్గారెడ్డి గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ ప్రారంభించినప్పుడు మోదీ, అమిత్ షాలు పుట్టనేలేదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ నేతల పాత్ర అసలు లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



## 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: నగరంలోని పుప్పాలగూడ పరిసరాల్లో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పుప్పాలగూడ భూముల్లో ఐటీ హబ్ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, రెవెన్యూ, స్పెషల్ పోలీస్ సొసైటీలకు కేటాయించిన ఈ భూమిలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. "వివిధ సొసైటీలకు 200 ఎకరాల భూ కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. పక్కనే ఉన్న మరో 250 ఎకరాల టీజీఐఐసీ భూములు కలిపి ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం. ఈ ఐటీ నాలెడ్జ్ హబ్‌తో 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## గ్రూప్ 1 అభ్యర్థులకు హైకోర్టు షాక్..

%హైదరాబాద్, ఏప్రిల్ 17: తెలంగాణ గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికై.. నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు షాకింగ్ న్యూస్ ఇది. గ్రూప్ 1 పోస్టుల భర్తీ విషయంలో రాష్ట్ర హైకోర్టు సంచలనం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర హైకోర్టు బ్రేక్ వేసింది. విచారణ పూర్తయ్యే వరకు గ్రూప్ 1 నియామక పత్రాలు ఇవ్వొద్దని స్పష్టం చేసింది. అయితే, ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చునని హైకోర్టు తెలిపింది. దీంతో గ్రూప్ 1 పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది.




## సురానా ఇంట్లో భారీగా నగదు, పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

హైదరాబాద్: సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు రెండోసారి చేపట్టిన సోదాలు ముగిసాయి. సురానా ఇండస్ట్రీస్ ఎండి నరేంద్ర సురానా ఇంట్లో భారీగా నగదు .. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.




సురానా పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి అక్రమ లావాదేవులకు పాల్పడినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. బ్యాంకులో నుంచి తీసుకున్న రుణంతో షెల్ కంపెనీలకు నిధుల బదలాయింపు చేశారని, పెద్ద మొత్తంలో రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్టు అధికారులు నిర్ధారించారు. అనుబంధ కంపెనీలు సాయి సూర్య దెవలపర్స్ సతీష్ ఇంట్లో కూడా భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. సాయి సూర్య సురానా కార్యాలయాల్లో కోట్లలో నగదుతో పాటు పలు డాక్యుమెట్స్ స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితమే సాయి సూర్య డెవలపర్స్ సతీష్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వట్టి నాగులపల్లిలో సతీష్ వెంచర్ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారు. సైబరాబాద్ పోలీస్ కేసు ఆధారంగా సాయి సూర్య డెవలపర్స్‌పై ఈడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది.

కాగా వివిధ బ్యాంకులకు రూ.13 వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కేసులో రియల్‌ఎస్టేట్ సంస్థ సురానా గ్రూప్, దాని అనుబంధ సంస్థలు- సాయిసూర్య డెవలపర్స్, ఆర్యవన్ ఎనర్జీలపై చెన్నైవిభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ మోసాలపై ఐడీబీఐ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో 2019లోనే బెంగళూరు విభాగం సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీల్యాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. సురానా గ్రూప్ చైర్మన్, ఇతర డైరెక్టర్లు చెన్నైలో నివసిస్తున్నా.. వారికి హైదరాబాద్‌లో వ్యాపారాలున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని.. అనుబంధ సంస్థలకు అక్రమంగా మళ్లించినట్లు ఈడీ గుర్తించింది.

దీంతో.. హైదరాబాద్‌లోని సురానా గ్రూప్, సాయిసూర్య, ఆర్యవన్ ఎనర్జీ కార్యాలయాలు, వాటి డైరెక్టర్ల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో బోయినపల్లి డైమండ్ పాయింట్ సమీపంలోని అరిహంట్ కార్డు మాస్టర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని సురానా యజమానుల ఇంట్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. కీలకమైన పత్రాలు, భూముల డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు.. సురానా గ్రూప్ ఎండీ దేవేందర్ సురా నా ఇళు, కార్యాలయాలు, సాయిసూర్య, ఆర్యవన్ ఎనర్జీ కార్యాలయాల్లోనూ ఈడీ సోదాలు జరిగాయి. కాగా.. సాయిసూర్య డెవలపర్స్ ఎండీ సతీశ్‌చంద్ర గుప్తాపై ఇటీవలే పోలీసులకు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టిస్తామంటూ ప్రీలాంచ్‌పేరిట కోట్లను వసూలు చేసి, మోసగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.113.32 కోట్ల విలువైన స్థిరచరాస్తుల జప్తు..

గతంలో సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన రూ.113.32 కోట్ల విలువైన స్థిరచరాస్తులను తాత్కాలికంగా ఈడీ అధికారులు జప్తు చేశారు. తమ బంధువులు, సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీ ఉద్యోగులను డైరెక్టర్లుగా నియమించి దినేష్ చంద్ సురానా బ్యాంకులను మోసం చేశారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. సురానా గ్రూప్ కేమన్ ఐలాండ్‌తో పాటు బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్‌లలో డమ్మీ డైరెక్టర్లను నియామకం చేసి.. ఆయా కంపెనీల్లోకి బ్యాంకు రుణాలను సురానా మళ్లించారు. సింగపూర్‌లో నాలుగు కంపెనీలు స్థాపించి వస్తువుల ఎగుమతి చేసి ఆ డబ్బును సురానా భారతదేశంలో అందుకున్నారు. దారి మళ్లించిన నిధులలో కొంత భాగాన్ని వివిధ బినామీ, కంపెనీల పేర్లలో చరాస్తులు, స్థిరాస్తులను కొనుగోలు చేయడానికి ఉపయోగించినట్టు ఈడీ అధికారులు నిర్ధారించారు. సోదాలు ముగిసాయి.

భారత శక్తి
VOICE OF INDIAN

# బంగారం... లకారం

బంగారం ధరలు కొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. బుధవారం పది గ్రాముల పసిడి ధర రూ.98,000 మార్క్‌ను దాటింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.1,650 పెరిగి రూ.98,100 కి చేరుకుంది. మొత్తానికి పసిడి ధర లక్షకు చేరువ అవుతోంది. అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య యు ద్ధం పెరుగుతుండడంతో ప్రపంచ వ్యాప్తం గా బంగారం సురక్షితమై పెట్టుబడిగా భావించి ఇన్వెస్ట్ చేస్తున్నారు. పెరుగుతున్న బంగారం ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో గోల్డ్ రేటు సరికొత్త రికార్డులను నమోదు చేస్తుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. బంగారం ధర ఇదే రీతిలో పెరుగుతూ పోతే రాబోయే ఐదారు నెలల్లో రూ.లక్షన్నరకు చేరడం ఖాయమని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.బంగారం ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలు, అమెరికా, చైనా మధ్య అంతకంతకూ పెరుగుతున్న టారిఫ్ యుద్ధం కారణంగా గోల్డ్ రేట్లు పెరుగుతున్నాయి. అధిక సుంకాలు, వస్తువులు, ఖనిజాల ఎగమతులపై ఆంక్షల ఫలితంగా అమెరికాలో టెక్ కంపెనీల షేర్లు, ప్రధాన సూచీలు నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా డాలర్ సూచీ 100 కంటే దిగువకు చేరడంతో సురక్షితమని భావించి బంగారం, వెండిపైకి పెట్టుబడులు తరలి వస్తున్నాయి. మరోవైపు అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గిస్తారనే అంచనాలూ బంగారం ధర పెరిగేందుకు దోహదం పడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం, నాడు 99.9 శాతం స్వచ్ఛత 10 గ్రా ముల బంగారం ధర రూ.96,450 కి చేరుకుంది. అయితే ఈ నెల 11న ఒక్క రోజే పసిడి ధర దాదాపు రూ.6,250 పెరిగింది. బుధవారం పది గ్రాముల పసిడి ధర మరుసటి రోజు రూ.1,650 పెరిగి రూ. 97,650కి చేరుకుంది. ఎంసిఎక్స్ మార్కెట్ల లో జూన్ డెలివరీకి గోల్డ్ ఫ్యూచర్ రూ. 1,984 (2.12 శాతం) పెరిగి రూ. 95,435కి చేరుకుంది. ఎల్‌కెపి సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ విపి అనలిస్ట్ జతీన్ త్రివేది మాట్లాడుతూ, మరోసారి బం గారం ధర గణనీయమైన వృద్ధిని సాధించిం ది.సురక్షితమైన పెట్టుబడిగా భావించడంతో కామెక్స్ గోల్డ్ 3,300 డాలర్లను దాటిందని అన్నారు. మరోవైపు కిలో వెండి ధర రూ.1900 పెరిగి రూ.99,400 కి చేరుకుంది. మంగళవారం నాడు కిలో వెం డి ధర రూ.97,500 గా ఉంది. జనవరి 1 నుంచి చూస్తే బంగారం దాదాపు రూ. 18,710 (23.56 శాతం) పెరిగింది. జనవరిలో ఈ బంగారం పది గ్రాముల ధర రూ.79,390 గా ఉంది. అదే సమయంలో వెండి ధర కూడా రూ.10,558 పెరిగి కిలో కు రూ.86,017 నుంచి రూ.99,000కి చేరుకుంది. ఈ సంవత్సరం చివరి నాటికి బంగారం ధర రూ.1.10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అ మెరికా, చైనా మధ్య పెరుగుతున్న వాణి జ్య యుద్ధం, మాంద్యం భయాల కారణంగా ఈ సంవత్సరం బంగారం ఔన్సుకు 3,700 డాలర్లకు చేరుకోవచ్చు. విదేశీ పెట్టుబడి బ్యాంకు గోల్డ్‌న్ శాచ్స్ ఈ అంచనాను విడుదల చేసింది. అంతర్జాతీయ ధరల ప్రకారం లెక్కిస్తే, భారతదేశంలో 10 గ్రా. బంగారం ధర రూ.1.10 లక్షల వరకు పెరగవచ్చు.పెట్టుబడిదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్, ద్రవ్యోల్బణ ఆందోళనలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచ మాంద్యం వచ్చే ప్రమాదం పెరగడం వంటి కారణాల వల్ల ఇప్పటికే బంగారం కొత్త రికార్డు స్థాయికి చేరుకుంది. ఇటీవలి ధరల హెచ్చుతగ్గులు, స్థూల ఆర్థిక సంకేతాలు బంగారం ధర బుల్లిష్ ట్రెండ్‌కు దారితీస్తున్నాయని గోల్డ్‌మన్ సాచ్స్, యూబిఎస్ తెలిపాయి. సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు పెరగడం, సంస్థాగత, రిటైల్ పెట్టుబడిదారుల నుంచి డిమాండ్ పెరగడం, పరిమిత సరఫరా సౌలభ్యం బంగారం ధరల పెరుగదలకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.అమెరికా వాణిజ్య సుంకాల చర్యల కారణంగా ఈ నెల ప్రారంభంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టి.. ఆ తర్వాత భారీగా పెరిగాయి. భారతీయ మార్కెట్లో బంగారం ధర లక్ష మార్క్ చేరువగా వచ్చింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఔన్స్ 4,500 డాలర్లు ధర ఉండవచ్చునని గోల్డ్‌మన్ సాచ్స్ చెబుతోంది. ఇదే జరిగితే దేశీయంగా తులం బంగారం ధర రూ.1.25 లక్షలకు చేరడం ఖాయమని అంచనా వేసింది.యూబీఎస్ కూడా బంగారం ధరలపై అంచనాలను వెల్లడించింది. ఈ ఏడాదిలో బంగారం ధరలు ఔన్సుకు 3,500 డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. పెరుగుతున్న సుంకాల అనిశ్చితి, బలహీనమైన ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ నష్టాలు కారణాలుగా తెలిపింది. మార్కెట్లో విస్తృత స్థాయిలో బంగారానికి భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ధరల పెరుగుదలకు ఇంకా అవకాశం ఉందని యూబీఎస్ తెలిపింది.

ట్రేడ్ వార్ మరింత ఉధృతమైతే.. బంగారం ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు మాత్రం అంచనా వేస్తున్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ సైతం బంగారం ధరలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతోంది. ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించడంతో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి.మదుపరులు సైతం పెట్టుబడుల కోసం పసిడి వైపు మొగ్గుచూపుతున్నారు. దాంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు అమాంతం పెరిగిపోయాయి. టారిఫ్‌ల నుంచి చైనా మినహా అన్ని దేశాలకు 90 రోజులపాటు రిలీఫ్ అందించడంతో ఈక్విటీ మార్కెట్లు సైతం నెమ్మదిగా తేరుకుంటున్నాయి.పసిడి ధరలపై 2025లో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనాలను మూడుసార్లు సవరించింది. తొలుత ఔన్స్ 3,300 డాలర్లుగా అంచనా వేయగా ఆపై 3,700 డాలర్లు, ఇప్పుడు 4,500 డాలర్లు అంటూ అంచనా వేసింది.

# ఎవ్వరిని ఎదగనీయకుండా విశ్వరూపం

ఏలూరు, ఏప్రిల్ 17,

మర్రి చెట్టు నీడలో ఏ చెట్టూ ఎదగదంటారు.. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వటవృక్షంతో మాజీ మంత్రి విశ్వరూప్ కుటుంబాన్ని ఆ పార్టీలోనే కొందరు నేతలే ఉదాహరణగా చెప్పుకుంటున్న వేళ.. వైసీపీ అధిష్టానం అందరికీ షాక్ ఇచ్చే న్యూస్ విడుదల చేసింది. వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత మంత్రి పదవిని దక్కించుకున్న విశ్వరూప్.. ఆ తరువాత మంత్రివర్గ విస్తరణలో వైసీపీలో హేమాహేమిలుగా ముద్ర వేసుకున్న పేర్ని నాని, కొడాలి నాని లాంటి వాళ్లే మంత్రి పదవిని కోల్పోయినా విశ్వరూప్ మాత్రం మళ్లీ మంత్రి పదవిని కాపాడుకోవడమే కాకుండా ఇంకా మంచి పోర్టుపోలియో దక్కించుకున్నారు. పార్టీ టిక్కెట్టు విషయంలో టిక్కెట్టు దక్కించుకున్న విశ్వరూప్ ఓటమి తరువాత వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పదవిని సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే తాజాగా వైసీపీ విడుదల చేసిన ఓ ప్రకటనలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా విశ్వరూప్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆయన తనయుడు శ్రీకాంత్‌ను నియమిస్తూ పార్టీ అధినేత జగన్ నిర్ణయం తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది..ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం అయిన అమలాపురంలో విశ్వరూప్ పార్టీలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ద్వితీయశ్రేణి నాయకులను ఎవ్వరినీ ఎదగనీయరన్న ఆరోపణలు ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. రేపన్నాక పార్టీలో టిక్కెట్టు రేసులో అడ్డువస్తారన్న ఆలోచనతోనే ఆర్థికంగా, సామాజికంగా బలం ఉన్నవారు ఎవ్వరైనా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుంటే ఏదోలా వారిని తన అనుచరగణంతో అడ్డుకట్టవేసే ప్రయత్నం చేస్తుంటారన్న విమర్శలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలో చురుగ్గా ఉండే దళిత నాయకులకు పోటీచేసే అవకాశం కల్పించకపోవడం, వారిని కలుపుకోకుండా పక్కనపెట్టడం వంటి చర్యలుతో చేదు అనుభవాన్ని చవిచూసిన వారు చాలా సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేసిన సందర్భాలు నియోజకవర్గంలో కనిపించాయి. ఈ కారణంచేతనే చాలా మంది పార్టీని వీడి వేరే పార్టీల్లోకి వెళ్లిపోయారని చెబుతుంటారు. తాజాగా వైసీపీ ప్రకటించిన పార్టీ పదవుల్లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్త పదవులు దక్కించుకోవడంపై వైసీపీలోనే అసంతృప్తి జ్వాలలు నివురుగప్పిన నిప్పులా మారాయి.కోనసీమలో దళిత వర్గం నుంచి వైసీపీలో కీలక నేతగా ఉన్న పినిపే విశ్వరూప్ ఆపార్టీ చాలా ప్రాధాన్యతనిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే దళిత వర్గంలోనే చాలా మంది ఔత్సాహిక కీలక నాయకులున్నా వారు కేవలం పార్టీ కార్యకర్తలుగానే మిగిలిపోతున్నామన్నది వారి వాదన కాగా తాజా పరిణామాలను పరిశీలిస్తే కోనసీమలో ఎస్సీ వర్గం నుంచి విశ్వరూప్ కుటుంబం తప్ప వేరే ఆప్షన్ లేదన్నట్లుగా రెండు కీలక పదవులు కట్టబెట్టడం చూస్తే ఇదే ఆలోచనలో ఉందా అన్నది స్పష్టం అవుతుంది. అయితే పార్టీ తీసుకున్న ఈనిర్ణయం పట్లా సొంత పార్టీలోనే విమర్శలు ఎదురవుతున్నాయి.. విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ అనే వాలంటీరు హత్యకేసులో అభియోగాలను ఎదుర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్నారు కూడా. అయితే అవేమీ వైసీపీ పట్టించుకోకుండా తాజాగా ప్రకటించిన పదవుల్లో డాక్టర్ శ్రీకాంత్‌కు కీలకమైన అమలాపురం అసెంబ్లీ నియోజవర్గ సమన్వయకర్త పదవిని కట్టబెట్టింది. గత కొన్ని రోజులుగా జిల్లా అధ్యక్షుడ్ని మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగినా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా విశ్వరూప్‌నే కొనసాగిస్తారని, ఆయన తనయుడు శ్రీకాంత్ విషయంలో వాలంటీర్ హత్య కేసు అభియోగాలు అడ్డంకిగా మారతాయని అంతా భావించారు. అయితే వైసీపీ అధిష్టానం నిర్ణయం స్థానికంగా చర్చకు దారితీసింది. మొన్నటి సాధారణ ఎన్నికల్లో అమలాపురం వైసీపీ అసెంబ్లీ టిక్కెట్టు విషయంలో తండ్రీ కొడుకుల మధ్య వార్ నడిచిందని గుసగుసలు వినిపించాయి. ఒక దశలో తన తండ్రి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా టిక్కెటు తనకే కేటాయించాలని శ్రీకాంత్ కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే అమలాపురంలో పోటీచేసేది నేనే అంటూ విశ్వరూప్ ప్రకటించడంతో ఆ వివాదం సద్దుమణిగింది. అయితే ఆ తరువాత శ్రీకాంత్ నియోజకవర్గానికి దూరం అయ్యారు. అయితే దీనిపై కూడా పలు విమర్శలు వచ్చాయి. తండ్రికి అమలాపురం, కుమారునికి పి.గన్నవరం టిక్కెట్టు కేటాయిస్తారనే ఈతరహా మైండ్ గేమ్ ఆడారన్న గుసగుసలు వినిపించాయి..

# ఏబీవీ లెక్కేంటో...

కాకినాడ, ఏప్రిల్ 17,

2019 ఎన్నికలకు ముందు విశాఖ ఎయిర్ పోర్టులో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై జరిగిన కోడికత్తి దాడి కేసుపై కొత్త రాజకీయం ప్రారంభమయింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అమలాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కోడికత్తి శీను కుటుంబాన్ని పరామర్శించారు. శీను తప్పు చేసి ఉండవచ్చు కానీ.. జగన్ మోహన్ రెడ్డి వైఖరి వల్ల ఆ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ అంశంపై వైఎస్ఆర్‌సీపీకి చెందిన పత్రికలో ఓ కథనం వచ్చింది. జగన్ కోడికత్తి శీను దాడి చేసినప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా ఏబీవీనే ఉన్నారు. జగన్ పై కోడికత్తి దాడి వెనుక ఆయన ఉన్నారని ఇదే సాక్ష్యమని.. ఆరోపించింది. వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కూడా అదే ప్రకటన చేశారు. వెంటనే ఏబీ వెంకటేశ్వరరావు సోషల్ మీడియాలో స్పందించారు. జగన్ పై జరిగిన కోడికత్తి దాడి కేసు గురించి, శీనుకు జరిగిన అన్యాయం గురించి, విచారణ గురించి మొత్తం చర్చించడానికి తాను రెడీ అయినా.. అది సాక్షి టీవీలో అయినా సరే సిద్ధమని ప్రకటించారు. జగన్ పై కోడికత్తితో జనపల్లి శ్రీనివాసరావు దాడి చేసినప్పుడు కేసును రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేశారు. అయితే అప్పట్లో పోలీసులపై నమ్మకం లేదని కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని జగన్ , వైసీపీ తరపున హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కేంద్రం తాము నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తో దర్యాప్తు చేయిస్తామని తెలిపింది. దాంతో కేసు ఏపీ పోలీసుల నుంచి ఎన్ఐఏకు బదిలీ అయింది. ఎన్ఐఏ సహజంగా.. జాతీయ భద్రతతో సంబంధం ఉన్న కీలక కేసుల్నే చూస్తుంది. ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు తహవ్వూర్ రాణాను అమెరికా నుంచి తీసుకు వచ్చేలా ఏళ్ల తరబడి ప్రయత్నించి సక్సెస్ అయిన



ఇప్పుడు ప్రశ్నిస్తోంది. అలాంటి ఎన్ఐఏ.. జగన్ పై దాడి కేసును సమగ్రంగా పరిశోధించింది. కోడికత్తి శీను దాడి చేయడానికి ఎవరూ పురికొల్పలేదని తేల్చారు. అయితే ఎనఐఏ లాంటి దిగ్గజ సంస్థ దర్యాప్తులో నిజాలు తేలలేదని వైఎస్ఆర్‌సీపీఆరోపిస్తోంది. జగన్ బాధితుడిగా సాక్ష్యం చెప్పడానికి కూడా కోర్టుకు హాజరు కావడం లేదు. దీనిపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆరేళ్లకుపైగా జనపల్లి శ్రీనివాసరావు జైలుకే పరిమితమయ్యారు. జగన్ వీరాభిమాని అయిన జనపల్లి శీను జగన్ కు భారీ మెజార్టీ రావడానికి.. సానుభూతి వచ్చేలా దాడి చేశానని చెబుతూ వస్తున్నారు. కానీ ఆయనపై వైసీపీ నేతలకు మాత్రం అభిమానం లేదు. ఆయన టీడీపీ కుట్ర కారణంగా దాడి చేశారని నమ్ముతున్నారు.

# లాంగ్ జర్నీ వెళ్లే డ్రైవర్లు

**ప్రతి 2.5 గంటలకు వాహనాన్ని ఆపి 5-6 నిమిషాలు**

**నడవడం టీ లేదా కాఫీ తాగడం అవసరం**

**ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్**

సిద్దిపేటరహదారి హిప్నాసిస్ అనేది చాలా మంది డ్రైవర్లకు తెలియని శారీరక మరియు మానసిక స్థితి.

డ్రైవింగ్ ప్రారంభించిన 2.5 గంటల తర్వాత రహదారి హిప్నాసిస్ ప్రారంభమవుతుంది. హిప్నటైజ్ అయిన డ్రైవర్‌కు కళ్ళు తెరిచి ఉన్నా, మెదడు దృష్టిలోకి వచ్చే దృశ్యాలను రికార్డ్ చేయదు విశ్లేషించదు.

ఈ హిప్నాసిస్ వలన, ముందున్న వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టే ప్రమాదం పెరుగుతుంది ఇది ప్రధానమైన ప్రమాదకరమైన పరిణామం.

రహదారి హిప్నాసిస్ ఉన్న డ్రైవర్ ఢీకొన్న క్షణానికి ముందు గడిచిన 15 నిమిషాల్లో ఏమీ గుర్తుపట్టలేడు. అతను తన వాహన వేగం, లేదా ముందున్న వాహనం వేగాన్ని గ్రహించలేడు. ఢీకొట్టే వేగం సాధారణంగా 140 కి.మీ. కంటే ఎక్కువగా ఉంటుంది.

దీనిని నివారించాలంటే, ప్రతి 2.5 గంటలకు వాహనాన్ని ఆపి, 5-6 నిమిషాలు నడవడం, టీ లేదా కాఫీ తాగడం అవసరం.

డ్రైవింగ్ సమయంలో చుట్టు పక్కల వాహనాలు, ప్రదేశాలు గమనించడం మరియు గుర్తుంచుకోవడం ముఖ్యం.

గత 15 నిమిషాల నుంచి ఏమీ గుర్తులేక పోతే, అది ప్రమాద సంకేతం మీరే మృత్యు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నారని అర్థం.

రహదారి హిప్నాసిస్ ఎక్కువగా రాత్రిపూట జరుగుతుంది. ప్రయాణీకులు నిద్రలో ఉండగా, డ్రైవర్‌కు నిద్ర వత్తిడి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల డ్రైవర్ తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి.

కళ్లు తెరిచినా, మనసు మూసుకుపోతే ప్రమాదాలు తప్పవు.

కాబట్టి సురక్షితంగా ఉండండి. సురక్షితంగా డ్రైవ్ చెయ్యండి ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ తెలిపారు.

# కరకట్ట గెస్ట్ హౌస్ లలో ఏం జరుగుతున్నాయి...

విజయవాడ, ఏప్రిల్ 17, (

ఆంధ్రప్రదేశ్ అధికార వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పట్టు సాధించే క్రమంలో జరుగుతున్న పరిణామాలు ప్రభుత్వానికి తలవొంపులు తెచ్చేవిగా మారుతున్నాయి. నిఘా వర్గాలకు తెలిసినా పూర్తి స్థాయి సమాచారాన్ని ఉన్నత స్థాయిలో నివేదించక పోవడంతో ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతోందనే విమర్శలు ఉన్నాయి. .ఏపీ ముఖ్యమంత్రి ఉండవల్లి నివాసానికి కూతవేటు దూరంలో. కరకట్ట వెంబడి ఉన్న కొన్ని గెస్ట్‌హౌస్‌ల్లో జరుగుతున్న కార్యకలాపాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సార్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటిలో జరుగుతున్న పార్టీల్లో ఇటీవల ఓ ఉన్నతాధికారిని హనీ ట్రాప్ చేశారనే వార్తల నేపథ్యంలో పార్టీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న కొన్ని గెస్ట్‌హౌస్‌లతో పాటు, మంగళగిరి ప్రాంతంలో వారాంతాల్లో ఉన్నత స్థాయి అధికారుల కోసం ఏర్పాటు చేస్తున్న పార్టీల వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో పనులు చక్కబెట్టే పవర్ బ్రోకర్లు వీటిని నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.కృష్ణానది వెంబడి ఉన్న గెస్ట్‌హౌస్‌లతో పాటు స్విమ్మింగ్ పూల్స్, శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. కొందరు ఉన్నతాధికారులు వ్యాయామం కోసం, విరామ సమయాల్లో ఇక్కడ సేదతీరుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం జరిగిన పార్టీపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.అర్థరాత్రి వరకు సాగిన ఈ పార్టీ వీడియోలను కొందరు సేకరించి ప్రభుత్వానికి చేరవేశారు. ఇదంతా పథకం ప్రకారం జరిగిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కరకట్ట వెంబడి ఉన్న వనంలో జరిగిన పార్టీపై నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో కొందరు అధికారుల బదిలీలు జరిగాయి.మరోవైపు పథకం ప్రకారం పార్టీకి ఆహ్వానించి తనను బలి చేశారని ప్రభుత్వ ఆగ్రహానికి గురైన అధికారి సన్నిహితుల వద్ద వాపోతున్నారు. ఇదంతా కుట్రలో భాగంగా జరిగిందని ఆయన చెబుతున్నారు.కరకట్ట పార్టీలో పాల్గొన్న వారి వ్యవహార శైలిపై ప్రభుత్వం ఆగ్రహంతో ఉన్నా అక్కడ జరిగిన పార్టీ, దాని నిర్వాహకులపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.ముఖ్యమంత్రి నివాసానికి చేరువలో తరచూ ఈ తరహా కార్యక్రమాలు జరుగుతున్నా వాటిని కట్టడి చేయక పోవడం వెనుక గుట్టు అంతు చిక్కడం లేదు. ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న అధికారులకు వల వేసి వారిని ఉచ్చులోకి దించుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ శాఖల్లో త పనులు చక్కబెట్టుకోడానికి వారిని ప్రలోభాలకు గురి చేసి పబ్బం గడుపుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది.ఇటీవల కృష్ణా తీరంలో జరిగిన పార్టీపై ప్రభుత్వం తీవ్రంగానే స్పందించినా అక్కడ ఏమి జరిగిందో బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్త పడ్డారు. పార్టీలో మద్యానికి మాత్రమే పరిమితమయ్యారా, చట్ట విరుద్ధమైన పనులకు పాల్పడ్డారా అనే దానిపై స్పష్టత రాలేదు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు జరిగితే ఘటన జరిగిన ప్రదేశంలో పోలీసులు ఏం చర్యలు చేపట్టారనే దానిపై కూడా స్పష్టత లేదు. ఈ తరహా కార్యక్రమాల నిర్వాహకుల్ని కట్టడి చేస్తున్న దాఖలాలు కూడా లేవు. హై ప్రొఫైల్ వ్యక్తుల కనుసన్నల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.ఏపీలో కొందరు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చినా అవి ముఖ్యమంత్రి వరకు చేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు సన్నిహితులతో కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఇటీవల పత్రికల్లో కథనాలు సైతం వెలువడ్డాయి.ఈ క్రమంలో అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం కూడా చర్చనీయాంశంగా అయ్యింది. కొందరు అధికారుల భార్యలు విజయవాడ నగరంలోని స్టార్ హోటళ్లలో ప్రత్యేకంగా కార్యాలయాలను, బొటిక్‌లు నిర్వహిస్తూ ప్రభుత్వ పనులు చక్కబెడుతున్నారని ప్రతి పనికి రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరిగింది.ఆరేడుగురు అధికారులపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చినా, ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికి క్లీన్ చిట్ ఇచ్చేశారని ఐఏఎస్ అధికారులు గుర్తు చేస్తున్నారు. 2018లో ఓ అధికారి క్రమశిక్షణా రాహిత్యంపై అప్పటి డీజీపీ ఠాకూర్ నివేదిక ఇచ్చినా వాటిపై చర్యలు తీసుకోలేదని, నివేదికలో ఉన్న ఆరోపణల్ని వ్యక్తిగత అంశాలుగా పరిగణించి వదిలేశారని సదరు అధికారి ఇప్పుడు కీలక బాధ్యతల్లో ఉన్నారని, వ్యక్తిగత అలవాట్ల ఆధారంగా కొందరిని టార్గెట్ చేయడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

# అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్

మంథని

అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్ని మాపక కార్యాలయానికి ఈ నెంబర్ ద్వారా 87126 99204 సమాచారం ఇవ్వాలని మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్ సుచించారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా గురువారం మంథని పట్టణంలోని మాత శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి, రేనే ఆసుపత్రి లో సిబ్బందికి, చికిత్స పొందుతున్న పేషంట్లకి మంథని అగ్నిమాపక అధికారి శివశంకర వరప్రసాద్ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనా కల్పించారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలలో అగ్ని మాపక నివారణ కరపత్రాలు పంచుతూ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యాలపై తగు సూచనలు ఇచ్చారు. మంటలు ఎగిసిపాడుతున్న



సమయంలో ఏలా అదుపు చేయాలో ప్రమాదల బారిన పడకుండా తమను తాము ఏలా రక్షించు కోవాలి అనే అంశాలపై పలు సూచనలు చేసారు.

# షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో భూభారతి 2025 చట్టంపై భారీ అవగాహన సదస్సు.

షాద్ నగర్: షాద్ నగర్ ఆర్డీఓ ఎస్ఆర్ సరిత ఆధ్వర్యంలో భూభారతి 2025 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహణ. భూ భారతితో భూముల హక్కులు భద్రం. భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పష్టీకరణ. సదస్సుకు హాజరైన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు, నాయకులు, మీడియా ప్రతినిధులు.

వాయిస్ ఓవర్.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి-2025 చట్టంతో రైతుల భూముల హక్కులు భద్రంగా ఉంటాయని,రైతుల మేలు కోసం భూ సమస్యల సత్వర పరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో స్థానిక ఆర్డీఓ ఎస్ఆర్ సరిత ఆధ్వర్యంలో జరిగిన భూభారతి చట్టం 2025 అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గం లోని ఆయా మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు నాయకులు మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అవగాహన సదస్సును ఉద్దేశించి కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ..

భూభారతి చట్టంపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ వివరించారు. ఏవైన సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. న్యాయ సేవ సంస్థలు, ఇతర సంస్థలు, వ్యవస్థల ద్వారా పేదలకు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి, మహిళలకు ఉచిత న్యాయసహాయం, సలహాలు ఈ చట్టం ద్వారా అందించాలన్నారు. ముఖ్యంగా తహసీల్దార్లు చట్టంలోని ప్రతీ అంశంపై అవగాహన సాధించాలన్నారు. మ్యూటేషన్లు, జారీ చేసిన పాస్‌పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో లేదా కలెక్టర్‌కు అప్పీలు చేసుకునేలా రెండు అంచెల అప్పీలు వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. వారసత్వంగా సంక్రమించే భూముల మ్యుటేషన్ల విషయంలో నోటీసులు జారీ చేయాల్సిన ప్రక్రియపై సూచనలు చేశారు.

# డిజిటల్ తరగతి గదులు ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌కాశ్మీర్ గడ్డ లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్మార్ట్ డిజిటల్ తరగతి గదులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ పాఠాల ద్వారా విద్యాబోధనతో విద్యార్థులకు త్వరగా అవగాహన వస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు మెళకువలతో పాఠాలను బోధించాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు.

# రద్దు చేస్తే... ప్రయాణం సాగేదెలా...

అనంతపురం, ఏప్రిల్ 17

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంతకల్ డివిజన్‌లో ధర్మవరం స్టేషన్ వద్ద యార్డ్ రీ మోడలింగ్ పనులు జరుగుతున్నాయి. దాని కారణంగా కీలక రైళ్లను రోజుల తరబడి దక్షిణ మధ్య రైల్వే శాఖ రద్దు చేసింది. అలాగే మరికొన్ని రైళ్ల రూట్ మార్చింది. కొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు.

1) 57403- తిరుపతి -గుంతకల్ ట్రైన్ 16.04.25 నుంచి 18.05.25 వరకు రద్దు చేశారు.

2) 57404- గుంతకల్ -తిరుపతి ట్రైన్ 15.04.25 నుంచి 19.05.25 వరకు రద్దు చేశారు.

3) 57405 - తిరుపతి - కదిరి దేవరపల్లి ట్రైన్-15.04.25 నుంచి 16.05.25 వరకు రద్దు చేశారు.

4) 57406- కదిరి దేవరపల్లి - తిరుపతి ట్రైన్ 15.04.25 నుంచి 17.05.25 వరకు రద్దు చేశారు.

5) 06595- యాశ్వీ బెంగళూరు -ధర్మవరం ట్రైన్ 05.05.25 నుంచి 17.05.25 వరకు రద్దు చేశారు.

6) 06596- ధర్మవరం -యాశ్వీ బెంగళూరు ట్రైన్ 05.05.25 నుంచి 17.05.25 వరకు రద్దు చేశారు.

7) 77213-గుంతకల్ - హిందూపూర్ ట్రైన్ 04.05.25 నుంచి 17.05.25 వరకు రద్దు చేశారు.

8) 77214- హిందూపూర్ - గుంతకల్ ట్రైన్ 05.05.25 నుంచి 18.05.25 వరకు రద్దు చేశారు.

9) 12765-తిరుపతి -అమరావతి ట్రైన్ మే నెల 06,10,13,17 తేదీల్లో రద్దు చేశారు.

10) 12766-అమరావతి -తిరుపతి ట్రైన్ మే నెల 05,08,12,15 తేదీల్లో రద్దు చేశారు.

11) 16571- యశ్వంత్ పూర్ - బీదర్ ట్రైన్ మే నెల 12,13,15 తేదీల్లో రద్దు చేశారు.

12) 16572-బీదర్ -యశ్వంత్‌పూర్ ట్రైన్ మే నెల 12,13,14,16 తేదీల్లో రద్దు చేశారు.

13) 16583-యశ్వంత్ పూర్ -లాతూర్ ట్రైన్ మే నెల 14,16, 17 తేదీల్లో రద్దు చేశారు.

14) 16584-లాతూర్ -యశ్వంత్‌పూర్ ట్రైన్ మే నెల 15వ తేదీన రద్దు చేశారు.

15) 11311- సోలాపూర్-హస్సన్ ట్రైన్ 11.05.25 నుంచి 16.05.25 వరకు రద్దు చేశారు.

16) 11312-హస్సన్ -సోలాపూర్ ట్రైన్ 12.05.25 నుంచి 17.05.25 వరకు రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు అయిన రైళ్లు

1)17247-నర్సాపూర్ -ధర్మవరం ట్రైన్ 15.04.25 నుంచి 16.05.25 వరకు కదిరి స్టేషన్ వరకే వెళుతుంది

2) 17248 ధర్మవరం- నర్సాపూర్ ట్రైన్ 16.04.25 నుంచి 17.05.25 వరకు- కదిరి నుంచి బయల్దేరుతుంది.

3) 17215- మచిలీపట్నం -ధర్మవరం- ట్రైన్ 01.05.25 నుంచి 16.05.25 వరకు - అనంతపురం స్టేషన్ వరకు మాత్రమే వెళుతుంది.

4) 17216- ధర్మవరం -మచిలీపట్నం ట్రైన్ 02.05.25 నుంచి 17.05.25 వరకు అనంతపురం స్టేషన్ నుంచి బయలుదేరుతుంది

పాక్షికంగా రద్దు అయిన రైళ్లు

1) 17247-నర్సాపూర్ -ధర్మవరం ట్రైన్ 15.04.25 నుంచి 16.05.25 వరకు - కదిరి స్టేషన్ వరకే వెళుతుంది

2) 17248- ధర్మవరం- నర్సాపూర్ ట్రైన్ 16.04.25 నుంచి 17.05.25 వరకు - కదిరి నుంచి బయల్దేరుతుంది.

3) 17215- మచిలీపట్నం -ధర్మవరం ట్రైన్ 01.05.25 నుంచి 16.05.25 వరకు - అనంతపురం స్టేషన్ వరకు మాత్రమే వెళుతుంది.

4) 17216- ధర్మవరం -మచిలీపట్నం ట్రైన్ 02.05.25 నుంచి 17.05.25 వరకు అనంతపురం స్టేషన్ నుంచి బయలుదేరుతుంది

దారి మళ్లించిన ట్రైన్స్ ఇవే

1) 16331 ఊాటు ముంబై -త్రివేండ్రం ట్రైన్ -04.05.25,11.05.25 తేదీల్లో గుంతకల్, అనంతపూర్, ధర్మవరం, హిందూపూర్ బదులుగా గుత్తి, రేణిగుంట మీదుగా వెళుతుంది

2) 07605 తిరుపతి -అకోలా ట్రైన్ 09.05.25,16.05.25 తేదీల్లో తిరుపతి, పాకాల, ధర్మవరం, గుత్తి బదులుగా తిరుపతి,రేణిగుంట, గుత్తి స్టేషన్‌లపై నుంచి వెళుతుంది.

3) 07606- అకోలా -తిరుపతి ట్రైన్ మే 04,11 తేదీల్లో గుత్తి, ధర్మవరం, పాకాల బదులు గుత్తి, రేణిగుంట మీదుగా తిరుపతి వెళుతుంది.

4) 12770- సికింద్రాబాద్ -తిరుపతి ట్రైన్ మే నెల 06,09,13,16 తేదీల్లో గుత్తి, ధర్మవరం,పాకాల బదులు గుత్తి, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుకుంటుంది.

5) 12769-తిరుపతి- సికింద్రాబాద్ -తిరుపతి ట్రైన్ మే నెల 05,09,12,16 తేదీల్లో పాకాల, ధర్మవరం బదులు రేణిగుంట, గుత్తి మీదుగా వెళుతుంది

6)12731-తిరుపతి- సికింద్రాబాద్ -తిరుపతి ట్రైన్ మే నెల 08,11,15 తేదీల్లో పాకాల, ధర్మవరం బదులు రేణిగుంట, గుత్తి మీదుగా వెళుతుంది

7) 12732- సికింద్రాబాద్ -తిరుపతి ట్రైన్ మే నెల 07,10,14 తేదీల్లో గుత్తి, ధర్మవరం,పాకాల బదులు గుత్తి, రేణిగుంట మీదుగా తిరుపతి చేరుకుంటుంది.

8) 07191-కాచిగూడ-మధురై ట్రైన్ మే నెల 5,12 తేదీల్లో గుత్తి, ధర్మవరం, పాకాల, తిరుపతి బదులు గుత్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా వెళుతుంది.

9) 07192- మధురై-కాచిగూడ ట్రైన్ మే నెల 7,14 తేదీల్లో తిరుపతి, పాకాల, ధర్మవరం, గుత్తి బదులు పాకాల, తిరుపతి, రేణిగుంట, గుత్తి మీదుగా వెళుతుంది

10) 16339 ఊాటు ముంబై- నాగర్ కోయిల్ ట్రైన్ మే నెల 6,7,8,10,13,14,15 తేదీల్లో గుంతకల్, అనంతపురం, ధర్మవరం, పాకాల, తిరుపతి బదులు గుంతకల్, గుత్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా వెళుతుంది

11) 16340-నాగర్ కోయిల్-ముంబై ట్రైన్ మే నెల 5,6,7,9,12,13,14,16 తేదీల్లో తిరుపతి,పాకాల, ధర్మవరం, అనంతపురం, గుంతకల్ బదులు తిరుపతి, రేణిగుంట,గుత్తి మీదుగా వెళుతుంది

12) 22715-కాచిగూడ-మధురై ట్రైన్ మే నెల 10,17 తేదీల్లో గుత్తి, ధర్మవరం, పాకాల, తిరుపతి బదులు డోన్, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా వెళుతుంది

13) 22716-మధురై-తిరుపతి ట్రైన్ మే నెల 4,11 తేదీల్లో తిరుపతి, పాకాల, ధర్మవరం, గుత్తి బదులు తిరుపతి, రేణిగుంట, డోన్ మీదుగా వెళుతుంది

14) 16591- హుబ్బిలి-మైసూర్ ట్రైన్ 15.05.25 నుంచి 20.05.25 వరకు గుంతకల్, అనంతపురం, ధర్మవరం బదులు బళ్లారి, రాయదుర్గ్,యశ్వంతపూర్ మీదుగా వెళుతుంది

15) 16592- మైసూర్- హుబ్బిలి ట్రైన్ 11.05.25 నుంచి 17.05.25 వరకు ధర్మవరం, అనంతపురం,గుంతకల్, బదులు యశ్వంతపూర్, రాయదుర్గ్, బళ్లారి మీదుగా వెళుతుంది.

16) 12592-యశ్వంత్ పూర్-గోరఖ్ పూర్ ట్రైన్ మే నెల 12న యశ్వంత్‌పూర్, ఎలహంక,ధర్మవరం, అనంతపురం, గుంతకల్ బదులు యశ్వంత్ పూర్, గుంతకల్,బళ్లారి, రాయచూరు మీదుగా వెళుతుంది.

17) 22831-హౌరా యశ్వంత్ పూర్ ట్రైన్ మే నెల 14న డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం బదులు డోన్, గుంతకల్, బళ్లారి మీదుగా వెళుతుంది.

18) 16532 - యాశ్వీ బెంగుళూరు-అజ్మీర్ ట్రైన్ మే నెల 16న యస్వంత్ పూర్, ధర్మవరం,గుంతకల్, బళ్లారి బదులు యశ్వంత్ పూర్, బళ్లారి, హుబ్బిలి మీదుగా వెళుతుంది.

19) 16531 అజ్మీర్- యాశ్వీ బెంగుళూరు- ట్రైన్ మే నెల 12న బళ్లారి,గుంతకల్, ధర్మవరం, యశ్వంత్ పూర్ బదులు హుబ్బిలి, బళ్లారి, యశ్వంత్ పూర్ మీదుగా వెళుతుంది.

20) 16533- భగత్ కీ కోఠీ - యాశ్వీ బెంగుళూరు ట్రైన్ మే నెల 14న బళ్లారి, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, హిందూపూర్, యశ్వంత్‌పూర్ బదులు హుబ్బిలి, బళ్లారి, రాయిదుర్గ్ మీదుగా వెళుతుంది

21) 22602- సాయి నగర్ షిర్డీ-చెన్నై సెంట్రల్ ట్రైన్ మే నెల 16 న గుంతకల్, అనంతపురం, ధర్మవరం, హిందూపూర్, ఎలహంక, కృష్ణరాజపురం బదులు రేణిగుంట, గుత్తి మీదుగా వెళుతుంది.

22) 16332- త్రివేండ్రమ్ - ఊాటు ముంబై మే నెల 10 కృష్ణ రాజపురం, ధర్మవరం బదులు రేణిగుంట, గుత్తి మీదుగా వెళుతుంది.

# చెల్లెమ్మకు దారేదీ...

కడప, ఏప్రిల్ 17,

వైఎస్ షర్మిల పయనమేటో తెలియడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆమెకు రాజకీయంగా ఎలాంటి పదవి లభించే అవకాశాలు కనిపించడం లేదు. దేశంలో ఇండి కూటమి వచ్చే సంకేతాలు అస్సలు కనిపించడం లేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ ఇక కోలుకునే పరిస్థితి లేదు. నాయకులు లేరు. క్యాడర్ లేని పార్టీని ప్రజలు ఆదరించరన్నది అందరికీ తెలిసిందే. మరొక వైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై ఉన్న నేతల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఆమె మీడియాకు మాత్రమే పరిమితమవుతున్నారని, పీసీసీ చీఫ్ గా పార్టీ బలోపేతానికి ఎలాంటిచర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనేక మంది కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పార్టీని వీడి వెళ్లిపోతున్నారు.. అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు రావడం వైఎస్ జగన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం, చంద్రబాబు ప్రభుత్వంపై నామమాత్రపు ఆరోపణలు దిగుతూ ఆమె మమ అనిపించేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమైన నేతలందరూ పార్టీని వదిలి వెళ్లిపోయారు. సొంత జిల్లాలోనూ ఆమెకు గ్రిప్ దొరకడం లేదు. గత ఎన్నికల్లో జగన్ ను ఓడించగలిగానన్న తృప్తి మినహాయించి ఆమెకు రాజకీయంగా ఒరిగిందేమీ లేదు. కాంగ్రెస్ పార్టీలో తన తెలంగాణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విలీనం చేసినప్పుడు రాజ్యసభ పదవి ఇస్తామని చెప్పారన్న ప్రచారం జరిగింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హామీ మేరకే షర్మిల ఈ స్టెప్ తీసుకున్నారని కూడా చెబుతారు. అయితే ఇప్పుడు వైఎస్ షర్మిలను కేంద్ర నాయకత్వం కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. డీకే శివకుమార్ ను ఇటీవల కలిసినప్పుడు కూడా ఆయన కూడా రాజ్యసభ విషయంలో తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏమీలేని రాష్ట్రంలో చీఫ్ గా ఉన్న నేతకు రాజ్యసభ పదవి ఇవ్వడం అనవసరమని బహుశ కేంద్ర నాయకత్వం భావించి ఉండవచ్చు. కాంగ్రెస్ లో సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. రాహుల్ గాంధీ, సోనియాకు అత్యంత ఆప్తులైన నేతలు అనేక మంది పెద్దల సభలో తమకు స్థానం దక్కుతుందని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వెన్ జన్ పథ్ వైఎస్ షర్మిల వైపు చూసే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పుడు కాదు కదా.. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకునే అవకాశాలు కనిపించడం లేదు. పదిహేనేళ్ల క్రితం నుంచి అంటే 2014 రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కోలుకునే పరిస్థితి లేదు. ఇక కోలుకోనే అవకాశాలు కూడా లేవు. టీడీపీ, వైసీపీ వంటి బలమైన పార్టీలు కూడా కాంగ్రెస్ ను కలుపుకుని పోయేందుకు ప్రయత్నించవు. అందుకే తమకు దగ్గరగా ఉన్న ఏమీ ఓటు బ్యాంకులేని కాలం చెల్లిన సిద్ధాంతాలతో పయనిస్తున్న కమ్యూనిస్టులతోనే ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. అందుకే వైఎస్ షర్మిలకు రాజకీయ భవిష్యత్ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఆమె మరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

## ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలి.. పబ్బతి

- ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలి..

వై.డి.ఆర్ స్వామి

- కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి..
- నైట్ అవుట్ అలవెన్స్ రూ.400 ఇవ్వాలి
- ఆర్టీసీ డిపో ముందు ఎన్ఎంయు కార్మికుల నిరసన

నందికొట్కూరు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల అక్రమ సస్పెన్షన్లు , అక్రమ రిమూవల్స్ ను వెంటనే ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్, ఆర్టీసీ డిపో సెక్రెటరీ వై డి ఆర్ స్వామి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నందికొట్కూరు ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు, వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 యధావిధిగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి 300 నుండి 400 వరకు పాత పద్ధతిలో ఇవ్వాలన్నారు. గ్యారేజ్ కార్మికులకు పనిష్మెంట్లు తగ్గించాలన్నారు. డిపోలో సస్పెన్షన్ లు ఎత్తివేయాలి అన్నారు . నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్ లు వెంటనే కార్మికులకు ఇవ్వాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ గవర్నమెంట్ వారు ఇచ్చిన సిక్కులకు జీతాలు ఇవ్వాలన్నారు.మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అనారోగ్య సేవలకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుదాస్, రత్నం ,జనార్ధన్ , కుమార్ , విజయుడు, గ్యారేజ్ సెక్రెటరీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి వర్సెస్ ధరణి...

హైదరాబాద్, ఏప్రిల్ 17

ధరణిని బంగాళాఖాతంలో కలుపుతూ తెలంగాణలో సరికొత్తగా భూభారతి వచ్చేసింది. ఇన్నాళ్లూ రైతుల సహనాన్ని పరీక్షించిన ధరణికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెల్లుచీటి పలికింది. భూ హక్కుల నిర్వహణలో నవ శకాన్ని మొదలు పెట్టింది. రైతుల భూముల హక్కులకు భద్రత, భరోసా ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం సరికొత్తగా తెచ్చిన భూభారతి చట్టం చాలా లెక్కలను పరిష్కరించేలా వచ్చింది. ఉన్నది ఉన్నట్లు.. లెక్కలు పక్కాగా, సమస్యలు తీర్చేలా భూభారతి ఉండబోతోంది. ఇంతకీఒక్కటేమిటి.. ఇలా ఎన్నెన్నో అవకాశాలను, పారదర్శకతను తీసుకొస్తూ తెలంగాణలో భూ భారతి వచ్చేసింది. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా కొత్త వ్యవస్థ వచ్చింది. ప్రతిదానికి కోర్టుల దాకా వెళ్లాల్సిన పని లేదు. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ ఇలా స్టెప్ బై స్టెప్ పరిష్కార మార్గాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు, ఇతర లావాదేవీలన్నీ భూభారతి పోర్టల్ ద్వారానే జరుగనున్నాయి. గతంలో ధరణి పోర్టల్ అమలులోకి వచ్చినప్పుడు తలెత్తిన సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతులకు అర్థమయ్యేలా 33 మాడ్యూల్స్ ను 6కు కుదించి యూజర్ ఫ్రెండ్లీగా పోర్టల్‌ను రూపొందించారు. భూభారతి చట్టంలోని 23 అంశాలను దశలవారీగా అమలు చేయనున్నారు. మొదటి దశలో భూముల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన అంశాలను అమలు చేస్తారు. పోర్టల్ నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తుతున్నాయా అన్నది తెలుసుకునేందుకు నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాల్లో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద స్టడీ చేస్తోంది. భూభారతి పోర్టల్ ద్వారా రైతులు భూమి రిజిస్ట్రేషన్, యజమాని పేరు మార్పు, వివాదాలపై అప్పీల్, రికార్డ్ ఆఫ్ రైట్స్‌లో తప్పులు సరిచేయడం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చడం వంటి పనులు చేసుకోవచ్చు.అంతేకాకుండా భూమికి సంబంధించిన ఇతర సమాచారం, నిషిద్ధ భూముల వివరాలు, సర్వే నంబర్ లేదా పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో భూమి హక్కుల గురించి తెలుసుకోవచ్చు. భూమి మార్కెట్ విలువ, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, రిజిస్టర్డ్ పత్రాల సమాచారం, భూమి సంబంధిత ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించే ఈ-చలాన్ సౌకర్యం కూడా ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది.హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణలతో పాటు అక్రమంగా పట్టాలైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములను కొత్త భూభారతి చట్టం మోక్షం కల్పించబోతోంది. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఇంటి స్థలాలకు, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక హక్కుల రికార్డు అందుబాటులోకి రానున్నాయి. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు భూసమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థను తీసుకురానున్నారు.భూ రికార్డుల్లో కీలకమైంది, సమస్యాత్మకమైందేంటంటే.. హక్కుల రికార్డులు, రికార్డుల సవరణలే. దీన్ని తాజా చట్టంలో ఈజీ చేశారు. భూరికార్డుల్లో తమ వివరాలు తప్పుగా నమోదైనవారు, భూమి వివరాలు నమోదుకానివారు భూభారతి పోర్టల్‌లో దరఖాస్తు చేసి, సవరించుకోవచ్చు. చట్టం అమల్లోకి వచ్చిననాటి నుంచి ఏడాదిలోపు అప్లై చేసుకోవాలి. దరఖాస్తుదారు సెల్ఫ్ డిక్లరేషన్ తో పాటు పాస్ బుక్, టైటిల్ డీడ్, పహాణీ, ఇతర ఆధారాలను చూపాలి. అధికారులు ఆ భూమితో సంబంధం ఉన్నవారందరికీ నోటీసులు ఇస్తారు.ఎవరైనా వారంలో అభ్యంతరాలు రాతపూర్వకంగా అందించాలి. లేదంటే కేసు మెరిట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అభ్యంతరాలు వస్తే విచారణ చేపట్టి 60 రోజుల్లో పరిష్కరిస్తారు. అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల మీద నెక్స్ట్ తహసీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. అక్కడా న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, ఆపై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. వారు 30 రోజుల వ్యవధిలో సమాధానం ఇవ్వాలి.హక్కుల నమోదు అధికారి ప్రతి గ్రామంలోని అన్ని భూముల వివరాలతో హక్కుల రికార్డు తయారు చేసి, భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలి. ఆబాది, వ్యవసాయేతర భూముల కోసం ప్రత్యేక రిజిస్టర్‌ను గ్రామాల వారీగా తయారు చేసి భూభారతి పోర్టల్‌లో ఇచ్చిన ఫారంలో నమోదు చేయాలి. ఈ భూములపై సర్వే నిర్వహించి మ్యాప్ తయారు చేయాలి. ఇక వివాదాలు లేకుండా, ఆ భూమిపై పూర్తి హక్కులున్న వారికి తహసీల్దార్ తాత్కాలిక భూధార్ కార్డు జారీ చేస్తారు. తర్వాత సర్వే, మ్యాపింగ్ ప్రక్రియలు పూర్తి చేసి శాశ్వత భూధార్ కార్డు ఇస్తారు. ఇక హక్కుల వివరాలు అన్నీ సక్రమంగా ఉంటే.. దరఖాస్తు చేసుకున్నవారికి పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేస్తారు..భూముల క్రయవిక్రయదారులు భూ భారతి పోర్టల్‌లో స్లాట్‌బుక్ చేసుకుని.. వివరాలను నమోదు చేయాలి. స్లాట్ ఉన్న రోజున గిఫ్ట్ డీడ్, సేల్‌డీడ్, పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్, సీసీఎల్ఏ ఇచ్చిన తేదీ నుంచి సర్వే మ్యాప్ తదితర అవసరమైన పత్రాలు అందజేయాలి. రిజిస్ట్రార్ అవన్నీ పరిశీలించి.. హక్కుల రికార్డులోని వివరాలతో సరిపోల్చుతారు. అన్నీ సక్రమంగా ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్ అయిపోతుంది.తహసీల్దార్ రికార్డులో కొనుగోలుదారు పేరు చేర్చుతారు. కొత్త పాస్ పుస్తకం ఇస్తారు. ఇవే కాదు.. రైతులకు ఉచిత న్యాయ సహాయం, పాస్ బుక్ లలో భూమి పటం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు ట్యాంపర్ చేస్తే రద్దు చేసే అధికారం, భూమి హక్కులు ఏ రూపంలో వచ్చినా మ్యుటేషన్ చేసే వెసులుబాటు, భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీలేట్ వ్యవస్థ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కు ముందు భూముల సర్వే ఇలాంటివెన్నో ఇప్పుడు భూభారతితో అందుబాటులోకి వచ్చాయి.

## తెలంగాణ హైకోర్టు... 100 పర్సెంట్ క్లియరెన్స్ రేట్..

హైదరాబాద్, ఏప్రిల్ 17,

తెలంగాణ హైకోర్టు అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఇండియా జస్టిస్ రిపోర్ట్ ? 2025 ప్రకారం.. ఇక్కడ నూరు శాతం కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ ఘనతతో తెలంగాణ హైకోర్టు దేశానికే ఆదర్శంగా నిలిచింది.ఈ అద్భుతమైన ఫలితానికి ముఖ్య కారణం ఏమిటంటే.. కోర్టు కార్యకలాపాలు మార్పు చెందడం. ఇదివరకు భౌతికంగా జరిగే విచారణల స్థానంలో ఇప్పుడు వర్చువల్ విధానం (ఆన్‌లైన్ పద్ధతి) అమల్లోకి వచ్చింది. నిపుణులు చెప్పిన దాని ప్రకారం.. కేసులను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పరిష్కరించడం.. అంటే డిజిటలైజేషన్ వైపు తెలంగాణ హైకోర్టు వేగంగా అడుగులు వేయడమే ఈ విజయానికి కారణం.అయితే ఈ విజయం అంత సులువుగా రాలేదు. ప్రారంభం నుండి ఎన్నో సవాళ్లను (అడ్డంకులను) ఎదుర్కోవాల్సి వచ్చింది. మొదట్లో కోర్టు పని ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందని చెప్పగానే చాలామంది అంగీకరించలేదు. దీని వల్ల నిజంగా ఉపయోగం ఉంటుందా అని న్యాయమూర్తులు సందేహించారు. కానీ.. న్యాయవాదులకు ఆన్‌లైన్ విచారణల సామర్థ్యం.. వాటిని సులువుగా ఎలా ఉపయోగించవచ్చో తెలిసిన తర్వాత.. వారు దీనిని స్వీకరించడమే కాకుండా.. వినియోగించడంలో కూడా ముందుండటానికి సిద్ధమయ్యారు. కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలనే సంకల్పంతో చేపట్టిన పరిపాలనా చర్యలు ఈ డిజిటల్ మార్పును మరింత బలోపేతం చేశాయి.ఇంకా.. ప్రతిరోజు నమోదయ్యే కేసుల కంటే కూడా ముందుగా ఉన్న పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలనే నియమం కూడా అమల్లోకి వచ్చింది. హైకోర్టు , జిల్లా స్థాయిల న్యాయమూర్తులు ప్రతిరోజూ కొత్తగా దాఖలైన కేసుల కంటే ఎక్కువ కేసులను పరిష్కరించాలనే ఆదేశాన్ని కచ్చితంగా అనుసరించారు. దీని కోసం కేసుల నమోదు , పరిష్కారాలను రియల్ టైమ్‌లో తెలుసుకునే ఒక వ్యవస్థను అభివృద్ధి చేశారు. దీనితో కేసులు త్వరగా పరిష్కారం అవ్వడమే కాకుండా.. ప్రతి ఒక్కరూ తమ కేసులకు సంబంధించిన సమాచారాన్ని సులువుగా తెలుసుకునే వెసులుబాటు కల్పించడం ఒక అద్భుతమైన చర్యగా పేర్కొనవచ్చు.ఈ డిజిటల్ మార్పునకు ఒక ముఖ్యమైన ప్రేరణ ఏమిటంటే కోవిడ్-19 మహమ్మారి. అప్పటి ప్రధాన న్యాయమూర్తి రఘువేంద్ర సింగ్ చౌహాన్ దీనిని ఒక అవకాశంగా భావించారు. ఆయన కోర్టు వ్యవస్థను కాగితం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానంలోకి మార్చారు. 2020 నుంచే పిటిషన్లు, కౌంటర్లు, విచారణ , తీర్పు ప్రక్రియలు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ప్రారంభమయ్యాయి. ఆయన 15 సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ అప్పీల్స్ వంటి కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యేక బెంచ్‌లకు (ధర్మాసనాలకు) స్వయంగా నాయకత్వం వహిస్తూ.. విచారణలను చాలా వేగంగా పూర్తి చేశారు. నేడు తెలంగాణ హైకోర్టులో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నాటి ఒక్క క్రిమినల్ అప్పీల్ కూడా పెండింగ్‌లో లేదంటే.. ఇది ఆయన నిబద్ధతకు ఒక గొప్ప ఉదాహరణ అని న్యాయ నిపుణులు చెబుతున్నారు.మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, న్యాయమూర్తి చౌహాన్ అన్ని సదుపాయాలతో కూడిన 13 మొబైల్ వాన్ కోర్టులను ప్రారంభించి.. చాలా దుర్భరమైన, గిరిజన ప్రాంతాల్లో కూడా న్యాయం అందేలా చేశారు. న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది తమ అసాధారణమైన నిబద్ధతను చూపిస్తూ.. న్యాయవ్యవస్థ ఎలాంటి ఆటంకం లేకుండా సాగేందుకు తమ వేసవి సెలవులను కూడా స్వచ్ఛందంగా వదులుకున్నారు.తరువాత వచ్చిన ప్రధాన న్యాయమూర్తులు కూడా ఈ విధానాన్ని మరింత బలోపేతం చేస్తూ.. ముందుకు సాగారు. రిజిస్ట్రార్ జనరల్ ఎస్. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. 30 లేదా 20 సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న పాత కేసులకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. వాటిలో చాలా వరకు కేసులు విచారణకు వస్తుండగా.. కొన్ని కేసులను కొట్టేస్తున్నామని అన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రతి నెలా సగటున 400 పాత కేసులను పరిష్కరిస్తోంది.

## పరిశ్రమలో అగ్ని ప్రమాదం

పటాన్ చెరు

పటాన్ చెరు పాశ మైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలోని పాశ మైలారం వెంకర్ కెమికల్ కంపెనీ లో అగ్ని ప్రమాదం సంభవించింది. రియాక్టర్ నుండి మరొక రియాక్టర్ లోకి కెమికల్ పంపించే క్రమంలో మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన పరిశ్రమ కార్మికులు, సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైర్ ఇంజన్ల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు ప్రమాద స్థలంలో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది అగ్ని ప్రమాదంలో రియాక్టర్లు పేలడంతో పరిశ్రమ యాజమాన్యానికి కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు


## కూకట్ పల్లిలో కాంగ్రెస్ నిరసన

హైదరాబాద్‌కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం వారి సొంత లాభాపేక్షకు వాడుతూ ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెడుతుందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నేడు కూకట్ పల్లి నియోజకవర్గం వై జంక్షన్ వద్ద సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరై బిజెపి ప్రభుత్వంతోపాటు రంగ సంస్థ అయినా ఈ డి కి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి నేతలు రా హుల్ గాంధీ, సోనియా గాంధీ పేర్లను ఈ డీ చార్జ్‌షీట్ లో చేర్చడంతో తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు నేడు ఈడి ఆఫీసుల ముందు నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో కూకట్ పల్లి కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసిబిఐ, ఈడీలను కేంద్ర ప్రభుత్వం తమ జేబు సంస్థ ల్లా వాడుకుంటోందని, కేవలం ప్రతిపక్షాల పై అక్రమ కేసులు పెట్టేందుకే ఈడీని బిజెపి ఉపయోగించుకుంటుందని బండి రమేష్ మండిపడ్డారు.సోనియా,

# విజయసాయిరెడ్డికి... వయా బీజేపీనా...

నెల్లూరు, ఏప్రిల్ 17,

ఆంధ్రప్రదేశ్ లో రాజ్యసభ ఎన్నికకు సంబంధించి షెడ్యూల్ విడుదలయింది. వైసీపీ ఎంపీ గా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీగా ఉన్న స్థానాన్ని ఎన్నికల కమిషన్ భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 29వ తేదీ వరకూ ఈ ఎన్నిక కోసం నామినేషన్లను స్వీకరించనున్నారు. 30వ తేదీన నామినేషన్లను పరిశీలించనున్నారు. మే 2వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. మే 9వ తేదీన ఎన్నికను నిర్వహించనున్నారు. అదే రోజు ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఈ స్థానానికి ఎవరు ఎంపిక అవుతారన్న దానిపై పెద్దయెత్తున చర్చ మొదలయింది. ఇప్పటికే అనేక మంది ఆశావహులు మూడు పార్టీల్లోనూ ఉన్నారు. ఇప్పటి వరకూ రాజ్యసభలో జనసేనకు ప్రాధాన్యత లేదు. అయితే ఈసారి జనసేనకు అవకాశమిస్తారా? లేదా టీడీపీ ఈ స్థానం తీసుకుంటుందా? అన్నది చూడాలి. మరోవైపు రాజ్యసభలో తాను సొంతంగా బలం పెంచుకోవడానికి బీజేపీ ఈ రాజ్యసభ స్థానాన్ని కోరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే విజయసాయిరెడ్డిని ఒప్పించి రాజీనామా చేయించింది బీజేపీ కావడంతో ఆ స్థానాన్ని తమకే ఇవ్వాలని బీజేపీ కోరనుంది. అయితే ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు అవకాశం కల్పించాము కాబట్టి ఈ స్థానాన్ని తమకు ఇవ్వాలని టీడీపీ కోరనున్నట్లు తెలిసింది. మరొకవైపు జనసేనకు రాజ్యసభలో అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఆ పార్టీ కూడా ఈ స్థానాన్ని కోరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే చివరకు బీజేపీదే పై చేయి అవుతుందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనాగా వినిపిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు



త్వరిత గతిన పూర్తి కావాలంటే కొన్ని పదవులు త్యాగం చేయాల్సి వస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే బీజేపీకే విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన స్థానాన్ని ఇచ్చే అవకాశముందన్న అంచనాలు కూడా ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈరోజు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు నాయుడు కేంద్ర పెద్దలతో మాట్లాడే అవకాశముందని కూడా చెబుతున్నారు. సాయిరెడ్డి ఒకే అంటే... మరొక వైపు ఈ స్థానంలో తిరిగి విజయసాయిరెడ్డి పోటీ చేసే విషయాన్ని కూడా కొట్టిపారేయాలేమంటున్నారు. గతంలో వైసీపీ రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన ఆర్. కృష్ణయ్య తరహాలోనే విజయసాయిరెడ్డి కూడా తిరిగి బీజేపీలో చేరి రాజ్యసభకు పోటీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరుగుతుంది. అదే జరిగితే విజయసాయిరెడ్డికే తిరిగి బీజేపీ టిక్కెట్ ఇచ్చే అవకాశాలున్నాయి. విజయసాయిరెడ్డికి బీజేపీ ఢిల్లీ పెద్దలతో ఉన్న సంబంధాలతో ఈ ప్రచారం నిజమయ్యే అవకాశాలు లేకపోలేదు. విజయసాయిరెడ్డి కాకుంటే మాత్రం ఆంధ్రప్రదేశ్ నుంచి మరో కీలక నేతను ఈ పదవికి ఎంపిక చేసే అవకాశాలున్నాయన్నది అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

# గంటాకు వార్నింగ్...

విశాఖపట్టణం, ఏప్రిల్ 17,

మ్మెల్యే గంటా శ్రీనివాసరావుపై టీడీపీ అధినాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటా శ్రీనివాసరావు చేసిన ట్వీట్ ఆంధ్రప్రదేశ్ పరువు తీసేలా ఉందని టీడీపీ అధినాయకత్వం అభిప్రాయపడింది. నిన్న గంటా శ్రీనివాసరావు చేసిన ట్వీట్ వైరల్ గా మారింది. “ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధాని అమరావతి చేరాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి రావడం బాధాకరం.ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు వచ్చిన నేను విమానంలో హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు చేరి అక్కడినుంచి విజయవాడ విమానం క్యాచ్ చేసి గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం 1 గంట అయ్యింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో సాయంత్రం సమావేశం కావడానికి విశాఖ నుంచి బయలుదేరిన సీఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా నాలానే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరారు. విశాఖ - విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. దురదృష్టవశాత్తు ఈరోజు మంగళవారం కావడంతో వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విజయవాడ చేరాల్సి వచ్చింది. ఇది విశాఖ విమాన ప్రయాణీకుల దుస్థితి” అంటూ ట్వీట్ చేశారు.అయితే ఈ ట్వీట్ పై టీడీపీ అధినాయకత్వం గుర్రుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న సొంత పార్టీపై ఇలాంటి ట్వీట్లు చేయడం ఏంటని టీడీపీ నాయకత్వం ప్రశ్నిస్తుంది. ఇలా చేయడం పార్టీతో పాటు ప్రభుత్వం పరువు కూడా తీసినట్లవుతుందని అభిప్రాయపడింది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అలాగే పౌర విమానయానశాఖ మంత్రి కూడా కింజారపు రామ్మోహన్ నాయుడు ఉన్నారు. పార్టీ అంతర్గత సమావేశాల్లోనైనా ఈ విషయాలు మాట్లాడాలి. లేకుంటే నేరుగా తెలుగుదేశం పార్టీకి చెందిన రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లాలి. అంతే తప్పించి ఇలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి పరువును బజారు కీడ్చటమేంటని టీడీపీ నాయకత్వం ప్రశ్నిస్తుంది. నిన్న గంటా శ్రీనివాసరావు చేసిన ట్వీట్ పై టీడీపీ నాయకత్వం వివరణ ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది.కావాలనే గంటా శ్రీనివాసరావు ఈ ట్వీట్ చేసినట్లు అర్ధ మవుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ టీడీపీ అధినాయకత్వం గంటా శ్రీనివాసరావుకు గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ట్వీట్ ను చూస్తుంటే కావాలని, ప్రభుత్వాన్ని, పార్టీని ఇరుకున పెట్టాన్న ప్రయత్నమే ఆయనలో కనపడుతుందని చంద్రబాబు నాయుడు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మొత్తం మీద టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేసిన ఈ ట్వీట్ మాత్రం పార్టీలో పెద్దయెత్తున చర్చకు దారితీసింది.

## సిటీ శివార్లలో ఆక్రమణలు..అమ్మకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 17

హైదరాబాద్ నగర శివారుల్లోని జవహర్‌నగర్ ప్రాంతంలో భూ ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది. విలువైన ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు కబ్జా చేసి.. పేద ప్రజలను మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) అధికారులు రంగంలోకి దిగి.. జరిగిన ఆక్రమణలను తొలగించారు. కేవలం కంచెలు వేయడమే కాకుండా.. ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారనే అనుమానంతో వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు.ఈ అక్రమార్కుల వలలో అమాయక పేదలు, మధ్యతరగతి ప్రజలు చిక్కుకుంటున్నారు. తక్కువ ధరకే 80, 100 గజాల స్థలాలు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో స్థలానికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మొదట భూమిని చదును చేసి, తాత్కాలికంగా షెడ్లు వేసి వాటికి తప్పుడు ఇంటి నంబర్లు రాస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి నిజమైన ఇంటి నంబర్ వచ్చిందని నమ్మబలుకుతూ.. నోటరీ ద్వారా అమ్మకాలు జరుపుతున్నారు. అధికారులు కూల్చివేతలు చేపట్టిన సమయంలో.. అప్పటికప్పుడు కోర్టు నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. ఇలా దాదాపు 300 ఎకరాల్లో పక్కా ఇళ్లు వెలిశాయి. మరో 500-600 ఎకరాల్లో ఇదే తరహా కేసులు కోర్టులో నడుస్తున్నాయి.ఈ భూములను రక్షించడానికి హెచ్‌ఎండీఏ అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టు కేసులు లేని 12, 107 సర్వే నంబర్లలోని 750 ఎకరాలకు ఇనుప కంచె వేయడానికి దాదాపు రూ.7 కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. అక్రమార్కులు ఏదో ఒక లొసుగును పట్టుకుని మళ్లీ చొరబడుతూనే ఉన్నారు.భూముల స్వరూపం ఇలా.. మొత్తం 2370 ఎకరాలు ఉండగా.. వివిధ సంస్థలకు కేటాయించినది 600 ఎకరాలు. ఆక్రమించి ఇళ్లు నిర్మించిన భూమి 300 ఎకరాలు ఉండగా.. కోర్టు కేసులు ఉన్న భూమి 720 ఎకరాలు. ప్రస్తుతం 750 ఎకరాల్లో ఇనుప కంచె నిర్మించారు.ఇక్కడ బాధాకరమైన విషయం ఏమిటంటే.. సొంత ఇల్లు అనేది ఎంతో మంది పేద, మధ్యతరగతి ప్రజల కల. తమ జీవితకాలపు సంపాదనను కూడబెట్టుకుని, ఎంతో ఆశతో ఈ చౌక స్థలాల వైపు చూస్తున్నారు. కానీ.. అక్రమార్కుల మాయమాటలు నమ్మి మోసపోతున్నారు. అధికారులు కూల్చివేతలు చేపట్టినప్పుడు వారి ఆశలు ఒక్కసారిగా ఆవిరైపోతున్నాయి. తమ కష్టార్జితం కళ్ల ముందే మట్టిపాలవుతుంటే ఆ కుటుంబాల రోదన వర్ణనాతీతంగా మారుతున్నాయి.హెచ్‌ఎండీఏ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కేవలం ఆక్రమణలు తొలగించడమే కాకుండా.. ఈ అక్రమ దందా వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. అలాగే.. పేద ప్రజలకు చట్టపరమైన విషయాలపై అవగాహన కల్పించాలి. తక్కువ ధరకే వస్తున్న స్థలాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించాలి. అప్పుడే అమాయక ప్రజలు మోసపోకుండా ఉంటారు. ప్రభుత్వ భూములు కూడా రక్షించబడతాయి.

=============

# నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అంతర్జాతీయ చారిత్రిక కట్టడాల దినోత్సవాన్ని (ప్రపంచ వారసత్వ దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితిలోని సభ్యదేశాలు వారసత్వ సంపద పరిరక్షణకోసం ఒకరికొకరు వివిధ అంశాలలో పరస్పరం సహకరించుకోవాలన్న ప్రధానలక్ష్యంతో ఈ ప్రపంచ వారసత్వ దినోత్సవం ఏర్పాటుచేయబడింది.

ప్రపంచ దేశాలలోని వారసత్వ సంపద పరిరక్షణ అనే అంశంపై 'ఐక్యరాజ్య సమితి' (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్), 'అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం' సంయుక్త ఆధ్వర్యంలో ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారసత్వ సంపద పరిరక్షణకు చేయవలసిన పనులు, నిర్వహించవలసిన కార్యక్రమాల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అలా సదస్సు ప్రారంభమైన ఏప్రిల్ 18వ తేదీని 'ప్రపంచ వారసత్వ దినోత్సవం'గా ప్రకటించాలని యునెస్కోకి ప్రతిపాదనలు పంపగా,. 1983లో ఆమోదించి ఏప్రిల్ 18వ తేదిని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించింది.

ప్రపంచ వారసత్వ దినోత్సవం రోజున అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యతను తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 800 ప్రపంచ స్థాయి పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షిస్తున్నారు.

భారతదేశం నుండి ఇప్పటివరకు 40 ప్రదేశాలు యూనెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో భారత్ నుండి స్థానం సంపాదించాయి.

సాంస్కృతిక ప్రదేశాలు మొత్తం 24 అందులో

1.ఆగ్రా కోట (1983)

2.అజంతా గుహలు (1983)

3.ఎల్లోరా గుహలు (1983)

4.తాజ్ మహల్ (1983)

5.కోణార్క సూర్య దేవాలయం (1984)

6.మహాబలిపురం వద్ద గల కట్టడాల సముదాయం (1984)

7.గోవా చర్చులు, కాన్వెంట్లు (1986)

8.ఫతేపూర్ సిక్రీ (1986)

9.హంపి వద్ద గల కట్టడాల సముదాయం (1986)

10.ఖజురహో కట్టడాలు (1986)

11.ఎలిఫెంటా గుహలు గుహలు (1987)

13.గ్రేట్ లివింగ్ చోళా టెంపుల్స్ (1987)

13.పట్టడకళ్ కట్టడాల సముదాయం (1987)

14.సాంచిలోని బౌద్ధ కట్టడాలు (1989)

15.హుమాయూన్ సమాధి (1993)

16.కుతుబ్ మినార్ కట్టడాలు (1993)

17.భారతీయ పర్వత రైల్వేలు (1999)

18.బోధ గయాలోని మహాబోధి ఆలయ సముదాయం (2002)

19.భీమ్‌బేట్కా శిలా గుహలు (2003)

20.చంపానేర్ పవాగాద్ ఆర్కియాలజికల్ పార్క్ (2004)

21.ఛత్రపతి శివాజీ టెర్మినస్ (గతంలో విక్టోరియా టెర్మినస్) (2004)

22.ఎఱ్ఱకోట (2007)

23.జైపూర్ జంతర్ మంతర్ (2010)

24.రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్ (2013)

25.రాణి కీ వావ్ (2014)

26.గ్రేట్ హిమాలయాస్ జాతీయ ఉద్యానవనం (2014)

27.బీహార్ లోని నలంద వద్ద ఉన్న నలంద మహావిహార పురావస్తు ప్రదేశం (2016)

28.ది ఆర్కిటెక్చరల్ వర్క్ ఆఫ్ లే కార్బూసియర్ (2016)

29.చారిత్రాత్మక నగరం అహ్మదాబాద్ (2017)

30.విక్టోరియన్ అండ్ ఆర్ట్ డెకో ఎన్సెంబుల్ (ముంబై) (2018)

31.జైపూర్ (2019)

32.రామప్ప దేవాలయం (2021)

33.ధోలావీరా (2021) ఉండగా

సహజసిద్ధమైన ప్రదేశాలు (6) 1.కాజీరంగా జాతీయవనం (1985)

2.కియోలాడియో జాతీయ ఉద్యానవనం (1985)

3.మానస్ జాతీయ అభయారణ్యం (1985)

4.సుందర్‌బన్స్ జాతీయ ఉద్యానవనం (1987)

5.నందాదేవి, వాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్ (1988)

6.పశ్చిమ కనుమలు (2012)

7.కాంచన్‌జంగ్ జాతీయ ఉద్యానవనం (2016)లు ఉన్నాయి.

## పల్లకిలో.. భద్రేశ్వరుడు..! శోభాయమానంగా ఊరేగింపు

విరజిమ్మిన దివ్వెల వెలుగులు

వికారాబాద్

తాండూరు పట్టణ నడిబొడ్డున వెలసిన శ్రీ భావిగి భద్రేశ్వరుని బ్రహ్మోత్సవాలు మనోరంజకంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న స్వామివారి పల్లకిసేవ కార్యక్రమాలు కన్నుల పండుగలా కొనసాగుతున్నాయి.9 రోజుల పాటు జరిగే ఉత్సవలలో భాగంగా బుదవారం రాత్రి స్వామి వారిని ప్రత్యేక అలంకరణతో ముస్తాబైన స్వామి వారిని పల్లకిలో ఉంచగా ఆలయం నుంచి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో వెలగించిన టపాసుల వెలుగులు విరజిమ్మాయి. ఆతరువాతపురవీదుల్లో భద్రేశ్వరుని పల్లకిసేవ

వెలుగులతో పల్లకిసేవ కొత్త శోభను తీసుకవచ్చాయి. పల్లకిసేవ ముందు భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి ప్రారంభమైన పల్లకిసేవ రాచన్న దేవాలయం వరకు కొనసాగి అక్కడి నుంచి తిరిగి ఆలయానికి చేరుకుంది. పల్లకిసేవ ఊరేగింపులో ఆలయ రెనవేషన్ కమిటి చైర్మన్ పటేల్ కిరణ్ కుమార్, ఈఓ శేఖర్ గౌడ్, వీరశైవ సమాజం సభ్యులు, యువదళ్ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు జాతర ఉత్సవాల్లో పురస్కరించుకొని ఈనెల 19 వ తేదీన భారీ రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు.

========================

## సెహభాష్... పోలీస్...

హైదరాబాద్, ఏప్రిల్ 17,

దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్ గా నిలిచారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి.. ముఖ్యంగా పోలీసులపై భారత రాష్ట్ర సమితి నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. పోలీసులు ప్రభుత్వానికి, ప్రజలకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారిపోయారని ఆరోపిస్తున్నారు.. అయితే భారత రాష్ట్ర సమితి నాయకులు చేస్తున్న ఆరోపణలకు సరైన కౌంటర్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులకు.. ఇప్పుడు బలమైన ఆయుధం లభించింది. ఎందుకంటే దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్ గా నిలిచారు.. ఇండియా జస్టిస్ రిపోర్ట్ -2025 నివేదిక ఈ వివరాలను వెల్లడించింది.. ఆ నివేదిక ప్రకారం తెలంగాణ పోలీసులు న్యాయ వ్యవస్థలో రెండవ స్థానం, న్యాయ సంబంధిత సేవలలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచారు. న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణను కలిపి చూస్తే జాతీయ స్థాయిలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. కెపాసిటీ, పోలీసింగ్ వంటి అంశాలలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక 2, 3 స్థానంలో నిలిచాయి. మొత్తంగా చూసుకుంటే న్యాయవ్యవస్థలు, పోలీసు వంటి విభాగాలలో దక్షిణాది రాష్ట్రాలు మిగతా ప్రాంతాల కంటే మెరుగ్గా ఉన్నాయి.. ఈ జాబితాలో కర్ణాటక ఫస్ట్ ప్లేస్ లో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలున్నాయి. న్యాయ సహాయం, పోలీసు, న్యాయ వ్యవస్థ, జైళ్ల నిర్వహణ ఈ నాలుగు అంశాల ఆధారంగా దేశంలోనే పెద్ద, మధ్యస్థాయిలో రాష్ట్రాలను అధ్యయనం చేశారు. అనే ఆధారంగా నివేదిక రూపొందించారు. పది పాయింట్లు మార్కులుగా కేటాయించగా కేటాయించగా 6.78 స్కోర్ తో కర్ణాటక తొలి స్థానంలో గెలిచింది. 3.63 స్కోర్ తో పశ్చిమ బెంగాల్ చివరి స్థానంలో ఉంది పశ్చిమ బెంగాల్ కంటే జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ కాస్త ముందు స్థానంలో ఉన్నాయి. అయితే గత ఏడాది తెలంగాణ 11వ స్థానంలో ఉండగా.. ఈసారి మూడో స్థానానికి వచ్చింది. ఇక ఐదవ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్.. రెండవ స్థానానికి చేరుకుంది..మనదేశంలో ప్రతి లక్ష జనాభాకు సంఘటన 197.5 మంది పోలీసులు ఉండాలి. మనదేశంలో కేవలం 155 మంది మాత్రమే ఉన్నారు. బీహార్ రాష్ట్రంలో లక్ష జనాభా కు 81 పోలీసులు మాత్రమే ఉన్నారు. దీంతో ఈ రాష్ట్రం చివరి స్థానంలో ఉంది. అయితే గతంతో పోల్చి చూస్తే బీహార్ రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది.. కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు గత మూడేళ్ల వ్యవధిలో న్యాయవ్యవస్థపరంగా ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలు జైళ్ల నిర్వహణలో ముందు వరుసలో ఉన్నాయి. ఇక జైళ్లకు వస్తున్న ఖైదీల సంఖ్య గతంతో పోల్చి చూస్తే 50% పెరిగింది. అయితే వీరిలో అదే విధంగా అండర్ ట్రయల్స్ కావడం విశేషం.. తెలంగాణ రాష్ట్రంలో పట్టణాలలో 51,974 మందికి, గ్రామాలలో 50,373 మందికి ఒక పోలీస్ స్టేషన్ ఉంది. పోలీస్ సిబ్బందిలో 8.7%, జైలు సిబ్బందిలో 6.6 శాతం మంది మహిళలు ఉన్నారు. కింది కోర్టులలో మహిళ న్యాయమూర్తులు 55.3%, హైకోర్టులలో 33.3 శాతమంది ఉన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో 20 ఏళ్లకు పైగా పెండింగ్లో ఉన్న కేసులు 17.7%, పది నుంచి 20 సంవత్సరాల మధ్య ఉన్న కేసులు 32.6 శాతం ఉన్నాయి.

## ఇక్రిశాట్ లో చిక్కిన చిరుత

సంగారెడ్డి

పటాన్ చేరు లోని ఇక్రిశాట్ లో చిరుత చిక్కింది. చిరుత సంచారంతో ఇక్రిశాట్ కార్మికులు రెండు రోజులుగా భయంతో వుండిపోయారు. ఆటవీ శాఖ అధికారులు

బొన్ లు, సీసీ కెమెరాలు బిగించారు. చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్ ల వద్ద రెండు మేకలను ఏర్పాటు చేసారు. వాటిని వేటాడానికి వచ్చిన చిరుత బోనులో చిక్కింది. చిరుతను జూ పార్క్ కు తరలించారు.

## రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ గా జస్టిస్ షమీమ్ అఖ్తర్, సభ్యులుగా శివాది ప్రవీణ, నాన్ జ్యుడిషియల్ సభ్యుడిగా రిటైర్డ్ ఐఏఎస్ డా. బి కిషోర్ గురువారం నాడు కమిషన్ ప్రాంగణంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## షామీర్ పేట పోలీస్ స్టేషన్ లో అగోరిపై జోగిని సంధ్య ఫిర్యాదు

మేడ్చల్ అగోరి పేరు చెప్పుకొని ప్రజలను మోసం చేస్తున్న అగోరి అలియాస్ శ్రీనివాస్ అలియాస్ శివ విష్ణు బ్రహ్మ అల్లూరిపై చర్యలు తీసుకోవాలని జోగిని సంధ్య గురువారం శామీర్పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జోగిని సంధ్య మాట్లాడుతూ సనాతన ధర్మం పేరు చెప్పుకొని ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, హిజ్రాలకు చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అతడు అగోరి కాదని, అసలు హిజ్రానే కాదన్నారు. ఇప్పటికే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకొని వదిలిపెట్టాడని, తాజాగా వర్షిని అని అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని అన్నారు.

దీంతో అతడి బండారం బయటపడిందని, ప్రభుత్వము, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం కాపాడాలంటే ఇలాంటి వాళ్లను సమాజం నుంచి తరిమి కొట్టాలని, బయట ఎక్కడా తిరగనివ్వద్దని ప్రజలకు సంధ్య విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన అతడిని శిక్షించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. నేను మొదటి నుంచి అగోరి అలియాస్ శ్రీనివాస్ పై పోరాటం చేస్తున్నానని, కత్తులతో దాడి చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మనం తెచ్చుకున్నామన్నారు. షామీర్పేట పోలీసులు ఫిర్యాదు తీసుకొని, కేసు నమోదు చేశారని తెలిపారు. త్వరలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సంధ్య తెలిపారు.

## మహిళలను రాణులుగా మారుస్తున్న ముద్ర..

హైదరాబాద్, ఏప్రిల్ 17

ఒక కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం ఎంతో ఉన్నత స్థాయికి చేరుతుంది అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ కుటుంబంతోపాటు సమాజం, దేశం కూడా ప్రగతి నడుస్తాయి. మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగితే మరింత ప్రయోజనాలు కలుగుతాయి. ఆమె ఉన్నత స్థాయికి చేరడంతో పాటు ఆ పారిశ్రామిక రంగంలో ఉన్న మిగిలిన చాలామందికి కూడా ఉపాధి కలుగుతుంది. పొదుపుకు ప్రాధాన్యత లభిస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటివరకు ఎన్నో చర్యలను చేపట్టింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రోత్సాహం అందిస్తుంది. అప్పటి రోజులలో మహిళలు ఎక్కువగా కూలి పనుల మీద ఆధారపడి బతికే వాళ్ళు. చిన్న పరిశ్రమల స్థాపన అనేది అప్పటి వారికి తెలియని అంశంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడి అని చెప్పొచ్చు. అప్పట్లో తినడానికే తిండి లేక ఇబ్బంది పడే కుటుంబాలు పెట్టుబడిని ఎక్కడ నుంచి వస్తాయి. ఇటువంటి పరిస్థితిని పీఎంఎంవై చాలా సుమూలంగా మార్చిందని చెప్పొచ్చు.ఈ పథకం కింద మహిళలు రుణాలు పొంది టైలరింగ్ యూనిట్లు, బ్యూటీ పార్లల్స్, ఫుడ్ స్టాల్స్, అగ్రిపాసెసింగ్ యూనిట్స్ అలాగే దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఇది వారి జీవితంలో ఆర్థిక పరిస్థితులతో పాటు సమాజంలో వాళ్లకు గొప్ప మార్పును కూడా మెరుగుపరిచిందని చెప్పడంలో సందేహం లేదు. మహిళలు ఆర్థికంగా మెరుగుపడినప్పుడు వాళ్ళ పిల్లల చదువు మరియు ఆరోగ్యం కూడా బాగుంటుంది. మహిళలు వాటికి ఖర్చు చేయగలిగితే వారి ఆర్థిక స్తోమత కూడా మెరుగుపడుతుంది. ఈ క్రమంలో రాబోయే భవిష్యత్తు తరాలు ఉన్నతంగా ఎదుగుతాయి. ఈ విధంగా పీఎం ఎం వై సూక్ష్మ వ్యవస్థాపకులను ప్రోత్సహించడంతోపాటు సాధికారత మరియు ఆర్థికంగా చురుకైన మహిళలను తయారు చేస్తుందని చెప్పొచ్చు. ప్రధానమంత్రి ముద్ర యోజన రుణాలు తీసుకున్న వాళ్లలో సుమారు 68% వరకు మహిళలే ఉన్నారు.ఈ పథకం కింద రుణం తీసుకున్న మహిళలకు సిఏజిఆర్ 2016 నుంచి 2025 ఆర్థిక సంవత్సరాల మధ్య 13 % గా ఉంటుంది. ఈ క్రమంలో మహిళల పొదుపులో 14% పెరిగాయి. ఈ పథకం కింద రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ఉపయోగించడం వలన జరిగిన ఆర్థిక ప్రగతిని కూడా ఇవి సూచిస్తున్నాయని తెలుస్తుంది. ప్రస్తుతం పీఎంఎంవై మెరుగైన ఫలితాలు సాధించిన క్రమంలో మహిళల సాధికారత మరియు ప్రగతి కోసం ప్రభుత్వం మరింత కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. అర్హులైన మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం అలాగే వ్యాపార విస్తరణకు అవకాశం కల్పించడం వంటివి చేయాల్సి ఉంది.

## ప్రతిపక్షాలకు లోకేష్..మోడల్

విజయవాడ, ఏప్రిల్ 17,



రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయి. గెలుపోటములు కూడా ఉంటాయి. ఇవన్నీ పార్టీలకు వర్తిస్తాయి. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో అందరికీ తెలిసిందే. 2014 వరకు ఆ పార్టీ హవా నడిచింది. అటు తరువాత బిజెపి శకం ప్రారంభం అయింది. వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ. అయితే ఇప్పటికీ బీజేపీ హవా నడుస్తూనే ఉంది. అయితే ఇది ఎల్లకాలం ఉంటుందని చెప్పలేం. మొన్నటి వరకు తెలంగాణలో అధికారంలో ఉంది బిఆర్ఎస్. కానీ సార్వత్రిక ఎన్నికల్లో బోణీ కొట్టలేకపోయింది. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని బలంతో ఉండేది. కానీ మొన్నటి ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అంతెందుకు మొన్నటి వరకు ఫెయిల్యూర్ నాయకుడిగా ఉన్నారు నారా లోకేష్. అటువంటి నేత ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో యువ నేతలకు ఇన్స్పైర్ చేసే విధంగా మారారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. ఇబ్బందులను అధిగమించి నిలబడగలిగారు.ఒకప్పుడు లోకేష్ ఒక నాయకుడేనా అనే పరిస్థితి ఉండేది. ఆయన సమర్థతపై అందరిలోనూ అపనమ్మకం ఉండేది. సొంత పార్టీ నేతలే అనుమానించేలా ఉండేది. రాజకీయ ప్రత్యర్థులు అయితే అవమానాలతో రెచ్చిపోయేవారు. కానీ ఇప్పుడు ఆయన పరిస్థితి మారింది. తాను ఒక నాయకుడిగా నిరూపించుకున్నారు. పాలకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ పార్టీ భావి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ కు మైనస్ లు కంటే ప్లస్ లే ఎక్కువగా ఉంటున్నాయి.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు నారా లోకేష్ ను ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ. అందుకే ఇప్పుడు ఆ పార్టీని బలోపేతం చేయడానికి కుటుంబ సభ్యులంతా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో కవిత ఇటీవల సంచలన ప్రకటనలు చేస్తున్నారు. పింక్ బుక్ రాసుకుంటున్నానని.. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తేల్చుతానని హెచ్చరిస్తున్నారు. తాను తన తండ్రి కెసిఆర్ మాదిరిగా మంచి దానిని కాదని.. తాను ఒక రౌడీ అని చెబుతున్నారు. అచ్చం 2024 ఎన్నికల కు ముందు నారా లోకేష్ చెప్పిన మాదిరిగానే కవిత కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా కవిత చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. లోకేష్ కు కాపీ కొడుతున్నారు అని కామెంట్స్ వినిపిస్తున్నాయి.2019లో అధికారంలోకి వచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అంతులేని విజయంతో ఆ పార్టీ టిడిపి అంతు చూడాలని భావించింది. కేసులతో భయపెట్టింది. అరెస్టులతో ఉక్కు పాదం మోపింది. ఆ సమయంలోనే నారా లోకేష్ పాదయాత్ర చేశారు. రెడ్ బుక్ అంటూ కొత్త ప్రకటన చేశారు. అన్ని ఆ బుక్ లో రాసుకుంటున్నానని.. తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని చెప్పారు. చెప్పిన మాదిరిగానే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను టార్గెట్ చేస్తున్నారు. తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. గతంలో టిడిపి విషయంలో తప్పులు చేసిన ఏ వైసీపీ నేతను విడిచి పెట్టడం లేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండే వారికి లోకేష్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే కవిత తీవ్రస్థాయిలో లోకేష్ మాదిరిగా హెచ్చరికలు పంపారు. తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ అవుతోంది.

## ఆర్ హెచ్ వి ఎస్ జిల్లా అధ్యక్షులుగా సుందర కుమార్

## మే 14 నుంచి 26 వరకు బద్రీనాథ్ లో సరస్వతీ పుష్కరాలు

## త్వరలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయం తిరుపతిలో ప్రారంభం

తిరుపతి, ఏప్రిల్ 17 :

రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ( ఆర్ హెచ్ వి ఎస్ ) జిల్లా అధ్యక్షులుగా కీర్తిపాటి సుందర్ కుమార్ ను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు తెలిపారు. గురువారం స్థానిక మన తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అయోధ్య ప్రధాన కేంద్రంగా ఏర్పాటైన రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ముఖ్య సంరక్షకులు మహంతు వైదేహి వల్లభ శరన్ దాస్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్ చంద్ర శుక్ల లచే నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. హిందూ సామ్రాజ్యం లో రామ రాజ్య స్థాపన కోసం, సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరాలనే సంకల్పంతో శ్రీవారి పాదాల చెంత తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్రను ఈ ఏడాదిలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రామ రాజ్య స్థాపనే ఎజెండాగా ఏర్పాటైన ఆర్ హెచ్ వి ఎస్ వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ నెలలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభమై అయోధ్య వరకు కొనసాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూపీ ముఖ్యమంత్రి వర్యులు యోగి ఆదిత్యనాథ్ లతోపాటు శ్రీలంక, మారిషస్ ప్రధానులు, నేపాల్ కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపీ అనిత దేవి సాహూ,తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉపసభాపతి రఘురామకృష్ణమ రాజు ( ఆర్ ఆర్ ఆర్) ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ మాట్లాడుతూ హైందవ ధర్మం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం, శ్రీరామ రాజ్య స్థాపన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ మహా యజ్ఞంలో తమకు భాగస్వామ్యం కలగడం దైవ సంకల్పంగా భావిస్తూ తమ వంతు శక్తివంచన లేకుండా ఆర్ హెచ్ వి ఎస్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ హెచ్ వి ఎస్ ఆధ్వర్యంలో సీతా సమేత శ్రీరామ సేవకులను అతి త్వరలో నియమించనున్నట్లు గిరి రాజు తెలిపారు. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్ర విజయవంతా నికి ఇప్పటినుంచి ప్రణాళికాబద్దం గా వ్యవహరించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ బాధ్యులు కృష్ణ కిషోర్, రాష్ట్ర అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు,ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, టీటీడీ కాంట్రాక్టర్ గిరిరాజు లకు అభినందనలు తెలియజేశారు.

## నడ్డా వారసుడి కోసం కసరత్తు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17, (

భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ముందు కీలక రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాల్సి ఉంది ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలకు అధ్యక్షులు ప్రకటించినప్పటికీ సగానికి పైగా రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయితే తప్ప జాతీయ అధ్యక్షుడి ఎన్నిక సాధ్యం కాదు. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ సమర్థత, ఆర్ఎస్ఎస్ అండదండలు ఉండే నేతకు జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నాయి. నూతన అధ్యక్షుడి ఎంపిక పార్టీ సంస్థాగత నిర్మాణానికి కొత్త దిశను ఇవ్వడంతోపాటు రాబోయే శాసనసభ ఎన్నికల వ్యూహంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దక్షిణాదిలో ప్రధానంగా తెలంగాణ, కర్ణాటకలో సొంతంగా పాగా వేయాలని చూస్తున్న అధిష్ఠానం ఆచితూచి అధ్యక్ష ఎంపికపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన సలహాలు సూచనలు ,రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాల ఆధారంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తిచేయనుంది.నూతన జాతీయ అధ్యక్షుడు ఎన్నిక తర్వాత పార్టీలో సంస్థాగత మార్పులు, ఎన్నికల వ్యూహాలపై పెద్ద ప్రభావం చూపవచ్చు. అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరగాల్సి ఉండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఏప్రిల్ సగం గడిచినప్పటికీ ఇంకా ఎన్నిక జరగలేదు. అధ్యక్షుడి ఎంపికలో సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే నాయకుడికి ప్రాధాన్యత ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నూతన అధ్యక్షుడు వచ్చిన తర్వాత 50 శాతం జాతీయ ప్రధాన కార్యదర్శులను తొలగించే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు, కొత్త అధ్యక్షుడి బృందంలో యువ నాయకులకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇవ్వవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం నుంచి కొంతమంది నాయకులను పార్టీ సంస్థాగత వ్యవహారాల్లోకి తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రస్తుతం పలువురు నాయకుల పేర్లు రేసులో ఉన్నాయి. ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్ కుమార్, రఘునందన్ రావు, రామచంద్రరావు, డీకే అరుణ, మురళీధర్ రావు, పాయల శంకర్, చింతల రామచంద్రా రెడ్డి సహా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జి.కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉండగా కేంద్ర మంత్రిగా బిజీగా ఉండటం వల్ల రాష్ట్రంలో పార్టీని నడిపించేందుకు కొత్త నాయకుడి అవసరం ఉందని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ఇప్పటికే అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అధిష్ఠానం పరిశీలకులతో అభిప్రాయాలని సేకరించింది. నాయకుల మధ్య అంతర్గత పోటీ, ఫిర్యాదుల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అధిష్టానం ఒకరిని అధ్యక్షుడిగా నిర్ణయించి మెజారిటీ జిల్లా అధ్యక్షులు చేత నామినేట్ చేయించి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసి అధికారికంగా అధ్యక్షుడు ప్రకటన పూర్తి చేస్తుంది. అధ్యక్ష పదవి ఎంపిక తెలంగాణలో బీజేపీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం. అధిష్ఠానం ఈ విషయంలో రెండు మూడు రోజుల్లో స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.బీసీ సామాజికవర్గం.. తెలంగాణాలో పాపులారిటీ.. సహా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టాలంటే ఈటలరకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రేసులో ఉన్న నేతలు సైతం ఈటల రాజేందర్‌కు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే తమకు అభ్యంతరం లేదని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇప్పటికే అనేక సందర్భాల్లో పక్క పార్టీల నుంచి వచ్చిన వారిని అధ్యక్షులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల తమిననాడు అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. పక్కన ఉన్న ఏపీలో పురంధేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణలను అధ్యక్ష పీఠం ఎక్కించిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సైతం ఎవరిని అధ్యక్షుడు చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం.ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలో మంత్రివర్గంలో స్థానం రాకపోవడంతో ప్రస్తుతం ఉన్న పురంధేశ్వరిని మరోసారి కొనసాగించే అవకాశం ఉంది. పురంధేశ్వరి స్థానంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యేలు పార్ధ సారధి, సుజనా చౌదరి ముందు వరుసలో ఉన్నారు. సామాజిక సమీకరణాలు పార్టీ బలోపేతం లక్ష్యంగా ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఉండబోతున్నట్లు తెలుస్తోంది

## ఈ డి కార్యాలయం వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

హైదరాబాద్

నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ గార్ల ను ఛార్జ్ షీట్ లో చేర్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ నేతలు ధర్నాకు దిగారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. . ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావ్, ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బలమురి వెంకట్, ఎమ్మెల్యేలు శంకరయ్య, రాజ్ ఠాగూర్ కార్పొరేషన్ చైర్మన్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ ఫాసిస్టు పాలన. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఇమేజ్ ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపింది. తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియాలని ధర్నా చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ పెపర్ అయిన నేషనల్ హెరాల్డ్ పేపరు కి 90 కోట్లు రుణం ఇస్తే మనిలాండరింగ్ జరిగినట్లు. ఎలా అవుతుంది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు పెట్టారు. మనిలాండరింగ్ కేసు కక్ష్య సాధింపు చర్యే . మోదీ హవా తగ్గుతున్న క్రమంలో రాహుల్ గాంధీ ఇమెజ్ ను బద్నాం చేసేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు.గాంధీ కుటుంబం ఏనాడూ కేసులకు భయపడింది లేదు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నవారు బీజేపీ పార్టీలో ఒక్కరూ లేరు. మోడీకి కనువిప్పు కలిగేలా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఒక ఫైటర్. దేశ ప్రజా గొంతుక రాహుల్ గాంధీ. రాహుల్ సంకల్పం ముందు ఈ కుట్రలు, అక్రమ కేసులు బలాదూర్. కుల గణన తో రాహుల్ గాంధీ మోడీకి రాజకీయ మరణ శాసనం రాశారు. బీహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ , సోనియా గాంధీ పై అక్రమ కేసులు పెట్టారు. ఎన్నికలు రాగానే ప్రతి పక్షాలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వాడడం మోదీ - అమిత్ షాకి అలవాటుగా మారింది.

# తిరుపతిలో టీడీపీ, వైసీపీ నేతల సవాళ్లు ప్రతిసవాళ్లు

తిరుపతి

తిరుపతిలో టీడీపీ, వైసీపీ నేతల సవాళ్లు ప్రతిసవాళ్లు ఉద్రిక్తతను రేపాయి. గురువారం ఉదయం టీడీపీ ఎమ్మెల్యేలు టీటీడీ గోశాలకు చేరుకున్నారు. గోశాలలో ఆవుల పరిస్థితి సమీక్షించడానికి అక్కడికి వచ్చారు. అయితే కూటమి నేతల శాంతి ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు.

మరోవైపు, గోశాలకు బయల్దేరిన టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. దాంతో భూమన, వైకాపా నేతలు రోడ్డుపై బైఠాయించారు. భూమన సహా వైసీపీ నేతల ఇళ్ల దగ్గర పోలీసులు మోహరించారు.

# మేము మంత్రులమే... వాళ్లకు, మాకు తేడా ఏంటీ...

కరీంనగర్, ఏప్రిల్ 17,

తెలంగాణ మంత్రుల్లో హెలికాప్టర్ ఉపయోగించే విషయంలో భేదాభిప్రాయాలు వచ్చినట్లు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. హైదరాబాద్‌కు దూరంగా ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు మంత్రులు హెలికాప్టర్ ఉపయోగిస్తున్నారు. అయితే కొంత మంది మంత్రులు మాత్రమే హెలికాప్టర్ ఉపయోగించడం, మరికొందరికి హెలికాప్టర్ అందుబాటులో ఉండకపోవడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.సాధారణంగా ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి ప్రభుత్వ హెలికాప్టర్‌ను ఉపయోగిస్తూ జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. సీఎం పర్యటన ఎక్కడా లేనప్పుడు, హెలికాప్టర్ ఖాళీగా ఉంటే మాత్రమే మంత్రులు దానిని ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ అలా ఒక్క మంత్రికే కాకుండా ఇద్దరు ముగ్గురు మంత్రులు, ఉన్నతాధికారులు హైదరాబాద్‌కు దూరంగా ఉండే జిల్లాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు హెలికాప్టర్ ను ఉపయోగించుకునే అవకాశం ఉందని..అందుకు ప్రత్యేకంగా నిబంధనలంటూ ఏమీ లేవని అధికారులు చెబుతున్నారు.అయితే కొన్ని కీలక శాఖలు నిర్వర్తిస్తున్న మంత్రులు తరుచూ హెలికాప్టర్ ను ఉపయోగిస్తున్నారు. దూర ప్రాంతాలకే కాదు దగ్గర్లో ఉన్న జిల్లాలకు కూడా అందులోనే వెళ్తున్నారన్న టాక్ సచివాలయవర్గాల్లో విన్పిస్తోంది. నలుగైదుగురు మంత్రులు మాత్రమే రెగ్యులర్ గా హెలికాప్టర్ ను ఉపయోగించుకోవడం, మిగతా మంత్రులకు ఆ అవకాశం రాకపోవడంతో వారంతా కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.ఓ మంత్రి ఐతే రంగారెడ్డి జిల్లా పర్యటనకు సైతం హెలికాప్టర్ ను వాడుతున్నారంటూ చర్చ నడుస్తోంది. కొంతమంది మంత్రులకు దూరంలో ఉన్న జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్లాల్సి వచ్చినా హెలికాప్టర్ ఇవ్వడం లేదని వాపోతున్నారట. పైగా నల్గొండ జిల్లా మంత్రులు మాత్రమే హెలికాప్టర్ వాడుతున్నారని.. అందులోను ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాత్రమే హెలికాప్టర్‌ను తెగ వాడేస్తున్నారని ఓ సీనియర్ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట.అంతే కాకుండా కొంతమంది మంత్రులు ప్రైవేట్ కార్యక్రమాలకు, విందులకు సైతం హెలికాప్టర్‌ను వాడుతున్నారనే టాక్ సైతం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఈ వ్యవహారం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళుతున్న అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో నల్గొండ మంత్రులకు మాత్రమే హెలికాప్టర్ భాగ్యం ఉందని తాజాగా మంత్రి దామోదర రాజనర్సింహ కామెంట్ చేయడంతో తెలంగాణ క్యాబినెట్‌లో మరోసారి గాలిమోటర్ రచ్చ మొదలైంది.అటు వివక్షాలు సైతం మంత్రుల హెలికాప్టర్ టూర్లపై విమర్శలు గుప్పిస్తున్నారు. కొంతమంది మంత్రులు హెలికాప్టర్‌ను పల్లె వెలుగు బస్సులా మార్చారంటూ విపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మరి ఈ గాలిమోటర్ రచ్చకు సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ స్టాప్ పెడతారా లేక ఇలాగే ఇష్యూ కంటిన్యూ అవుతుందా అనేది చూడాలి.

# పోలవరం ప్రాజెక్టులో రెండో రోజు కొనసాగిన మట్టి నాణ్యత పరీక్షలు

## పాల్గొన్న కేంద్ర బృందం సభ్యులు, జలవనరుల శాఖ అధికారులు

పోలవరం, ఏప్రిల్ 17:పోలవరం ప్రాజెక్టు పరిధిలో మట్టి నాణ్యత పరీక్షలు రెండో రోజు గురువారం కూడా కేంద్ర నిపుణుల బృందం చేసింది. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి. సిద్ధార్థ్ హెడావో, విపుల్ కుమార్ గుప్తా, జలవనరుల శాఖ అధికారి నిర్మల తదితరులు రెండోరోజు దండంగి, పోలవరం జల విద్యుత్ కేంద్రం పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టిని స్థానికంగా లేబరేటరీలో పరీక్షించడం తో పాటు, మరింత సూక్ష్మంగా తమ కేంద్ర కార్యాలయం లో పరీక్షించేందుకు సేకరించారు. స్థానికంగా, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ లో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టులో అవసరమైన ప్రాంతాల్లో అవసరమైన మేర ఈ మట్టిని వినియోగిస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. మట్టి నాణ్యతా పరీక్షల్లో జలవనరుల శాఖ డీఈ వి.నిర్మల, ఈఈ డి.శ్రీనివాసులు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల నిరసన

రంగా రెడ్డిస్లాట్ బుకింగ్ ఆన్లైన్ చేయకుండా పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ బుకింగ్ పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు ధరలు నిర్వహించారు...ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆన్లైన్ స్లాట్ బుకింగ్ నూతన విధానం వల్ల డాక్యుమెంట్ రైటర్ లు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ బుకింగ్ కొనసాగించాలని కోరారు...

# సురేష్ హత్య కేసులో నిందితుల అరెస్టు

నల్గొండ ఏప్రిల్ 17,

నల్గొండలో సంచలనం సృష్టించిన మణికంఠ కలర్ ల్యాబ్ యజమాని సురేష్ హత్య కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు.ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐతో సహ నలుగురు నిందితులను నల్గొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఈ హత్యకు గల కారణాలను, నిందితుల వివరాలను మీడియాకు తెలియజేశారు.

ఏప్రిల్ 11వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో నల్లగొండలోని రామగిరి ప్రాంతంలోని గీతాంజలి అపార్ట్మెంట్లో ఉన్న మణికంఠ కలర్ ల్యాబ్లో గడ్డపాటి సురేష్ దారుణ హత్యకు గురయ్యాడు. ఫోటోలు ప్రింట్ కావాలని చెప్పి లోపలికి వెళ్లిన దుండగులు, సురేష్పై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు.

ఈ హత్య కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో ప్రధాన నిందితుడు రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ మాతరి వెంకటయ్య. అతని కుమార్తె సంసారం నాశనం కావడానికి కారణం తన అల్లుడి అన్న గడ్డపాటి సురేష్ అని వెంకటయ్య భావించాడు.దీంతో నరేష్ మామ మరియు నరేష్ భార్య గడ్డపాటి ఉమా మహేశ్వరితో కలిసి సురేష్ను హత్య చేయించాలని పథకం వేశాడు. ఇందుకోసం గతంలో నేవీలో పనిచేసి రిటైర్డ్ అయిన స్పాట్ డిటెక్టివ్ ఏజెన్సీకి చెందిన చిక్కు కిరణ్ కుమార్ ఏ అ.ఐ. కుమార్ మరియు అతని తమ్ముడు ముషం జగదీష్లకు సుపారీ ఇచ్చాడు.

మాతరి వెంకటయ్య అల్లుడు నరేష్ మరో స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయని పోలీసులు ధ్రువీకరించారు.. దీనికి కారణం నరేష్ అన్న అయిన సురేష్ అని వెంకటయ్య నమ్మాడు. సురేష్ను అంతమొందిస్తే తన అల్లుడు మారుతాడని దురాలోచనతో కిరణ్ కుమార్ను సంప్రదించాడు. సురేష్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకున్న వెంకటయ్య, ఉమా మహేశ్వరి ఇద్దరూ కలిసి సురేష్ను హత్య చేయించాలని నిర్ణయించుకున్నారు. కిరణ్ కుమార్ రూ. 15 లక్షలకు సుపారీకి ఒప్పుకొని రూ. 2 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నాడు. తన పథకంలో భాగంగా కిరణ్ కుమార్ తన బంధువు జగదీష్ను రూ. 3 లక్షలకు ఒప్పించి హత్యలో భాగస్వామిని చేశాడు. నెల రోజులుగా నిందితులు నల్లగొండలో సురేష్ కదలికలపై నిఘా ఉంచారు.

ఏప్రిల్ 11వ తేదీ చెరువుగట్టు వద్ద జగదీష్తో కలిసి రాత్రి 10:20 గంటలకు సురేష్ కలర్ ల్యాబ్కు చేరుకున్నారు. ఫోటోలు ప్రింట్ కావాలని అడగగా, సురేష్ రేపు రమ్మనడంతో అర్జెంట్గా కావాలని మాటల్లో పెట్టి పనిలో నిమగ్నమవ్వగానే అతనిపై కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం బైక్పై చెరువుగట్టుకు వెళ్లి రక్తపు మరకలున్న బట్టలు, కత్తులు కారులో పెట్టుకుని మూసి వాగు సమీపంలో పడేసి హైదరాబాద్ పారిపోయారు.

ఈ కేసును నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ 2 టౌన్ సీఐ రాఘవరావు, శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, నల్లగొండ 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి మరియు సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి త్వరితగతిన ఛేదించారు. జిల్లా ఎస్పీ ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు.

# పాదయాత్రకు రెడీ అవుతున్న కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 17, (న్యూస్ పల్స్)




రాజకీయాల్లో ఓ సక్సెస్ ఫార్ములా ఉంటుంది. ఓ ఫార్మాట్ ఉంటుంది. ఆ ఫార్ములా, ఫార్మాట్‌లో ఎవరైనా ప్రయత్నిస్తే.. విజయం సాధిస్తే.. అదే దారిని మరికొందరు ఎంచుకుంటారు. ఏపీలో నారా లోకేష్ అనుసరించిన ఫార్ములా, ఫార్మాట్‌ను ఇప్పుడు తెలంగాణలో కవిత ఎంచుకుంటున్నారు. ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ రెడ్ బుక్ అని ఓ పుస్తకం పట్టుకుని ప్రచారం చేశారు. అందులో చట్టాన్ని ఉల్లంఘించిన వారి పేర్లు రాశానని అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటానని చెప్పేవారు. చర్యలు తీసుకోరేమో అన్న డౌట్ వద్దని చంద్రబాబు మంచి వారే కానీ తాను మాత్రం మూర్ఖుడినని చెప్పేవారు. ఈ మాటలు క్యాడర్ మనసుల్లోకి వెళ్లిపోయాయి. ఆయన ఇమేజ్ పెరిగింది. విజయం కూడా లభించింది. ఇప్పుడు తెలంగాణలో కల్వకుంట్ల కవిత కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇలాంటి రాజకీయమే చేస్తున్నారు. కవిత తమ పార్టీ రంగు అయిన పింక్ బుక్ పేరుతో రాజకీయం చేస్తున్నారు. అలాగే కేసీఆర్ మంచోడే కానీ.. తాను కాస్త రౌడీ టైప్ అని స్వయంగా చెప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాలు ఎన్నికల మూడ్ లోకి వెళ్లిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి. కవిత తమ పార్టీ నేతలకు భరోసా ఇవ్వడానికి, ధైర్యం చెప్పడానికి? కాంగ్రెస్ నేతలను బెదిరించడానికి లోకేష్ చూపిన మార్గాన్ని ఎంచుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కవిత ప్రకటన వైరల్ గా మారింది. బీఆర్ఎస్ సభకు వెళ్లే ఊరుకునేది లేదని హెచ్చరికలు వస్తున్నాయని పార్టీ నేతలు ఆమెకు చెప్పడంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. గతంలో లోకేష్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారని కొంత మంది గుర్తు చేసుకుంటున్నారు. లోకేష్ తరహా రాజకీయం చేస్తున్న కవిత.. పాదయాత్ర ఆలోచన కూడా చేస్తే బాగుంటుందని బీఆర్ఎస్ నేతలు అనుకుంటున్నారు. అయితే ఇప్పటికే కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. వచ్చే ఏడాది ఆయన పాదయాత్ర ఉంటుంది. అందుకే కవిత ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరకూ అంటే తనకు బాధ్యత ఇచ్చిన జిల్లా వరకూ పాదయాత్ర చేసే ఆలోచన చేయవచ్చని అంచనా వేస్తున్నారు. లోకేష్ ఫార్ములా మొత్తానికి అందర్నీ ఆకట్టుకుంటోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ నేతలకు హెచ్చరించారు. తాము పింక్ బుక్ లో అన్ని పేర్లు నమోదు చేసుకుంటున్నామని, అధికారం నుంచి రాజకీయ నేతల పేర్ల వరకూ నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పార్టీ కార్యకర్తలను, నేతలను వేధించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని కవిత హెచ్చరించారు. రజతోత్సవ సభకు... వరంగల్ లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసిందని, ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటామని తెలిపారు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదన్న కవిత బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదని ఎంఎల్సీ కవిత వ్యాఖ్యానించారు

# ఎంపీల్లో చామల ఫస్ట్... రఘువీర్ లాస్ట్

నల్గొండ, ఏప్రిల్ 17

ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సమావేశాలు కీలకమైనవి. ఇవి చట్టాలను రూపొందించడానికి, ప్రభుత్వం జవాబుదారీతనాన్ని కలిగి ఉండటానికి, ప్రజల సమస్యలను చర్చించటానికి పార్లమెంట్ ముఖ్య వేదిక. పార్లమెంట్ సమావేశాలలో దేశంలోని ముఖ్యమైన సమస్యలు, సామాజిక అంశాలు, ఆర్థిక పరిస్థితులు, ఇతర జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై సభ్యుల మధ్య చర్చలు జరుగుతాయి. దీని ద్వారా ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రభుత్వ విధానాలు, చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. పార్లమెంట్ సభ్యులు సభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనటంతో పాటు చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం వంటి ముఖ్యమైన విధులను నిర్వర్తించడం చాలా ముఖ్యం.తెలంగాణ నుంచి 17 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలు, బీజేపీ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఒకరు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలకు తెలంగాణ ఎంపీల హాజరు శాతం, అడిగిన ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనటంపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. జూన్ 2024 నుంచి 4 ఏప్రిల్ 2025 మధ్య పార్లమెంట్ సమావేశాలకు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి 100 శాతం హాజరయ్యారు.ఆ తర్వాత బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి 95 శాతం హాజరు నమోదు చేశారు. మరో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అత్యధికంగా 80 ప్రశ్నలు వేసి 91 శాతం సమావేశాలకు హాజరయ్యారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చర్చల్లో టాప్‌లో ఉన్నారు. ఆయన 21 చర్చల్లో పాల్గొన్నారు. నల్గొండ ఎంపీ రఘువీర్ అతి తక్కువ హాజరుతో పాటుగా.. తక్కువ ప్రశ్నలు, చర్చల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఎంపీల హాజరు శాతం, అడిగిన ప్రశ్నలు, పాల్గొన్న చర్చలు ఇలా..

చామల కిరణ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్): 79 ప్రశ్నలు, 100 శాతం హాజరు, 17 చర్చలు

రఘునందన్ రావు (బీజేపీ)- 46 ప్రశ్నలు, 97.05 శాతం హాజరు, 7 చర్చలు

కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బీజేపీ)- 18 ప్రశ్నలు, 95.58 శాతం హాజరు, 6 చర్చలు

అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం): 54 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 21 చర్చలు

మల్లు రవి (కాంగ్రెస్): 28 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 10 చర్చలు

గోడం నగేష్ (బీజేపీ)- 40 ప్రశ్నలు, 92.64 శాతం హాజరు, 4 చర్చలు

ఈటల రాజేందర్ (బీజేపీ) -80 ప్రశ్నలు 91.17 శాతం హాజరు, 9 చర్చలు

వంశీ కృష్ణ ( కాంగ్రెస్)- 31 ప్రశ్నలు, 89.70 శాతం హాజరు, 7 చర్చలు

డి.కె. అరుణ (బీజేపి)- 73 ప్రశ్నలు 88.23 శాతం హాజరు, 14 చర్చలు

అరవింద్ ధర్మపురి (బీజేపీ)- 59 ప్రశ్నలు, 88.23 శాతం హాజరు, 2 చర్చలు

సురేష్ షెట్కార్ (కాంగ్రెస్) 62 ప్రశ్నలు, 86.76 శాతం హాజరు , 5 చర్చలు

రఘురామ్ రెడ్డి (కాంగ్రెస్)- 56 ప్రశ్నలు, 85.29 శాతం హాజరు, 9 చర్చలు

కడియం కావ్య (కాంగ్రెస్)- 31 ప్రశ్నలు, 83.82 శాతం హాజరు, 5 చర్చలు

బలరాం నాయక్ (కాంగ్రెస్)- 13 ప్రశ్నలు, 72.05 శాతం హాజరు, 3 చర్చలు

కుందూరు రఘువీర్ (కాంగ్రెస్)- 8 ప్రశ్నలు, 72.05 శాతం హాజరు, 0 చర్చలు

# మంటలు పుట్టిస్తున్న కొత్త కామెంట్స్...


మెదక్, ఏప్రిల్ 17,

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ హాట్ కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ పడిపోవాలని కొంతమంది కోరుకుంటున్నారా? మాకొద్దీ కాంగ్రెస్ సర్కార్ అని అంటున్నారా? ఎవరిని ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు? రేవంత్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవసరమైతే సాయం కూడా చేస్తామని ఆ కొందరు అంటున్నారా? మరో మూడున్నరేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగాలని గులాబీ బాస్ కేసీఆర్ కోరుకుంటుంటే.. ఇలాంటి సమయంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ తెలంగాణలో హాట్ టాపిక్ గా మారాయి?బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మంటలు రేపుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ సర్కార్ ను పడగొట్టడానికి అవసరమైతే తాము సాయం చేస్తామని బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు కోరుకుంటున్నారని ప్రభాకర్ రెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో చర్చనీయాంశంగా మారాయి.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటున్న ఆ బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఎవరని ఇటు ప్రభుత్వం పెద్దలు, అటు ప్రతిపక్షాలు కూడా ఆరా తీస్తున్నాయంట. మరో మూడున్నరేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగాలని కొద్దిరోజుల క్రితం కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సమయంలో అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు చాలా ఇంట్రెస్టింగ్‌గా మారాయి.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలోని బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు విసుగు చెందుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో తీవ్ర కలకలమే రేపుతున్నాయి. ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న పారిశ్రామికవేత్తలు, బిల్డర్లు అవసరమైతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని.. అంతేకాదు వాటికయ్యే ఖర్చును కూడా తామే భరిస్తామని వారు తనతో చెప్పినట్లు తొగుట సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పెద్ద బాంబే పేల్చారు.తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అసంతృప్తి తీవ్రంగా ఉందన్నారు. పిల్లల నుండి పెద్దల వరకు ఏ ఒక్క వర్గం కూడా రేవంత్ సర్కార్ పట్ల సంతృప్తిగా లేరని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే దాని గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని.. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన ఈ హాట్ కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. ప్రభాకర్ రెడ్డి చెబుతున్నట్లు నిజంగానే బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అంత కోపంగా ఉన్నారా అన్న చర్చ రాజకీయవర్గాల్లో మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని, దానికి తోడు హైడ్రా వల్ల నిర్మాణ రంగం నీరుగారిపోయిందని వారు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఇదే సమయంలో పారిశ్రామిక రంగం సైతం చతికిలపడిపోయిందని, ప్రభుత్వానికి సరైన ఇండస్ట్రియల్ పాలసీ లేనందువల్ల పారిశ్రామికవేత్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే చర్చ జరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకునే కొత్త ప్రభాకర్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది.అయితే దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన హాట్ కామెంట్స్ పై మండిపడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అధికార దాహంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించిన మంత్రి.. తమ జోలికొస్తే మాత్రం తాట తీస్తామని హెచ్చరించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి అంటే కేసీఆర్ ఆత్మ అని.. కేసీఆర్ మాటలనే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారని ఆరోపించారు. ఎమ్మెల్యే చేసిన కామెంట్స్ పై అవసరమైతే విచారణకు ఆదేశిస్తామన్నారు మంత్రి పొంగులేటి.ఇదిలా ఉంటే రేవంత్ సర్కార్ పై అంతలా కోపం పెంచుకున్న ఆ బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఎవరా అని ఇటు ప్రభుత్వ పెద్దలు, అటు ప్రతిపక్షాలు సైతం ఆరా తీస్తున్నాయంట. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేంత ధైర్యం చేసే బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో ఎవరున్నారంటూ తెగ ఎంక్వైరీ చేస్తున్నారట. వారెవరనేది రాబోయే రోజుల్లో బయటపడుతుందో లేదో చూడాలి.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. ఏడుగురికి గాయాలు

ఏలూరు

జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పరిసర ప్రాంతాల నుండి భక్తులు భద్రాచలం వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏడుగురికి గాయాలు అయ్యాయి. గాయపడినవారిని చికిత్స నిమిత్త జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. బాధితులంతా తాడేపల్లిగూడెం శశి కాలేజీలో చదువుతున్న విద్యార్థులు. పరీక్షలలో పాసైన సందర్భంగా భద్రాచలం వెళుతున్నట్లు యువకులు తెలిపారు. యువకులంతా కారు లో వేగంగా వేతూకా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



# వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):వేసవి సెలవుల దృష్ట్యా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు, బస్సులో ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు.ఈ మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఊరెళ్లేవారు ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్‌లో సురక్షితంగా దాచుకోవాలని సూచించారు. ఇంటి బీరువా తాళాలను తమ వెంట తీసుకువెళ్లాలని, విలువైన వస్తువులు, వ్యక్తిగత విషయాలను ఇతరులతో పంచుకోకూడదని హితవు పలికారు. ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఐపీ సీసీ కెమెరాల ద్వారా ఇంటి పరిసరాలను మొబైల్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చని తెలిపారు. బయట గేటుకు తాళం వేయకుండా లోపలి నుండి గొళ్లెం పెట్టాలని, ఇంటి లోపల, బయట లైట్లు వేసి ఉంచాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే ముందు చుట్టుపక్కల వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, కాలనీలు, అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నివాసితులు సంఘాలుగా ఏర్పడి రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, దొంగతనాలను అరికట్టడానికి 50 నుండి 100 మందితో కూడిన సంఘాలు ఏర్పడి వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే నేరాలను నియంత్రించవచ్చని సీపీ తెలిపారు.ప్రయాణికులు తమ విలువైన వస్తువులైన డబ్బు, ఫోన్, లాప్‌టాప్‌లను తమ ముందు పెట్టుకున్న బ్యాగులో లేదా ఒంటికి దగ్గరగా ఉంచుకోవాలని, బ్యాగులు పూర్తిగా మూసి ఉంచాలని సూచించారు. వెనుక జేబుల్లో వస్తువులు పెట్టుకోకూడదని, అపరిచితులను నమ్మవద్దని హెచ్చరించారు. బ్యాగులను కాళ్ల దగ్గర లేదా ఒడిలో ఉంచుకోవాలని, పైన ర్యాక్‌లపై ఉంచితే వాటిపై నిఘా ఉంచాలని, విలువైన వస్తువులున్న బ్యాగులను పైన ఉంచకపోవడం మంచిదని తెలిపారు. సెల్ ఫోన్ లేదా లాప్‌టాప్‌ను అవసరం లేకపోతే బయటకు తీయవద్దని, పబ్లిక్ ప్లేస్‌లలో వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాటికి పాస్‌వర్డ్ వంటి భద్రతా ఫీచర్లు ఉపయోగించాలని సూచించారు. ఎక్కువ డబ్బు తీసుకెళ్లవద్దని, ఉన్న డబ్బును వేర్వేరు చోట్ల ఉంచాలని, ఏటీఎంల వద్ద డబ్బులు తీసేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రయాణికులు మెలకువగా ఉండాలని, నిద్రపోవడం తగ్గించాలని, బస్సు దిగేటప్పుడు తొందరపడకుండా తమ వస్తువులన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని, ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కండక్టర్ , అధికారులకు తెలియజేయాలని అన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### -వంట గదిని పరిశుభ్రముగా ఉంచాలి

### -ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి: అదనపు కలెక్టర్ పి. రాంబాబు.





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్17: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ నందు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. మునగాల మండలం కేంద్రంలోని ఎస్సి బాలికల హాస్టల్ ను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ నందు బాలికలకు అన్ని వసతులు కల్పిచాలని ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంట గదిని పరిశుభ్రముగా ఉంచుకోవాలని, కూరగాయలు, పాలు ఎప్పుడు తాజాగా ఉండే విధముగా చూసుకోవాలని సరుకులు, కూరగాయలు వెలుతురూ తగిలే ప్రదేశంలో నిల్వ చేసుకోవాలని, మరుగు దొడ్లు పరిశుభ్రముగా వాటికీ తలుపులు ఉండే విధముగా చూసుకోవలని అన్నారు. జడ్.పి యస్ యస్ స్కూల్ ను సందర్శించి పిడిఎస్ బియ్యమును పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన సన్న బియ్యం ద్వారా వండిన అన్నం పెట్టాలన్నారు.

తదుపరి మునగాల మండలం భారఖత్ గూడెం ఐ కే పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సెంటర్ ఇంచార్జిని ప్రతిరోజు ధాన్యం తీసుకువచ్చే రైతుల వివరాలు నమోదు రిజిస్టర్లో నమోదు చేయాలని అదేవిధంగా మ్యాయిచరు పరిశీలించి నమోదు చేయాలని, ఏ రోజు వచ్చిన ధాన్యాన్ని అదే రోజు కాంటావేసి ధాన్యమును మిల్లులకు తరలించాలని సెంటర్ లలో ధాన్యాన్ని ఉంచరాదని, అకాల వర్షాలు ఉన్నందున ధాన్యం రాశులపై తడవకుండా పట్టాలు కట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ శ్వేత, ఏ ఈ ఓ రేష్మ పి ఎస్ ఎస్ సి ఓ బసవయ్య, సెంటర్ ఇంచార్జ్ సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# 18న కరీంనగర్ లో సిపిఐ 11వ మహాసభలు

కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):ఈనెల 18వ తేదీ శుక్రవారం సిపిఐ కరీంనగర్ నగర 11వ మహాసభ నగరంలోని గణేష్ నగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నామని పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు చెప్పారు. ఈ మహాసభకు నగరంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం




చేయాలని కోరారు. మహాసభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నగర మహాసభలో కరీంనగర్ నగరంలోని 60 డివిజన్ లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని చెప్పారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయుటకు కార్యకర్తలను సంసిద్ధం చేయడం జరుగుతుందన్నారు.నగరంలో గత రెండు సంవత్సరాలుగా అభివృద్ధి పనులు అటకెక్కాయని, గత ప్రభుత్వం ఆగమేఘాల మీద అనేక పనులను శంకుస్థాపనలు చేసి వదిలేసిందని, చాలా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పి పూర్తిగా మరిచిపోయారని ఆరోపించారు. స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి అక్రమాలు జరిగాయని, మానేర్ రివర్ ఫ్రంట్ తీగల వంతెన పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించి రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతుందని, గత మున్సిపల్ పాలక వర్గం పూర్తిగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డందని భూ కబ్జాలు, ఇండ్లు కడితే కమిషన్లు, ఇంటి నెంబర్ కు డబ్బులు తీసుకుని నానా రకాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టారని ఈ సమస్యలతో పాటు నగరంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం రేషన్ కార్డుల కోసం అర్హులైన వారికి పెన్షన్ల కోసం రానున్న కాలంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్ళుటకు ఈ మహాసభ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం, ఆరు గ్యారెంటీలు అర్హులైన వారికి అందే వరకు ఉద్యమాలతో ఒత్తిడి తీసుకువచ్చి పేద ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందే వరకు పోరాట కార్యాచరణ చేస్తామని తెలిపారు. ఈ మహాసభ నగర ప్రజల దశ దిశ మార్చేందుకు ఉపయోగ పడుతుందన్నారు.

# నూతన కార్యవర్గాన్ని సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్

### -మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):కరీంనగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో హుస్నాబాద్ లోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ బార్ నూతన అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజును మంత్రి పొన్నం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని, కరీంనగర్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి, ఎల్లవేళలా తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కన్వీనర్లు కొత్తకొండ శంకర్, ఎం ఏ నవాజ్, లింగంపల్లి శ్రీకాంత్, జాయింట్ కన్వీనర్లు బొడ్డు రాజు, ఐతు సృజన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెంద రమేష్, జాయింట్ సెక్రెటరీ సిరికొండ శ్రీధర్ రావు, సీనియర్ ఈసీ మెంబర్ గుంటి మధు, జూనియర్ ఈసీ మెంబర్ ఏనుగుల సంతోష్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు మెలకువలతో పాఠాలు బోధించాలి

### -డిజిటల్ తరగతి గదులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి






కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):కాశ్మీర్ గడ్డ లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్మార్ట్ డిజిటల్ తరగతి గదులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ పాఠాల ద్వారా విద్యాబోధనతో విద్యార్థులకు త్వరగా అవగాహన వస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు మెళకువలతో పాఠాలను బోధించాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, జిమ్నాస్టిక్స్, కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చదువు, ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు హసీనా ఫాతిమా పాల్గొన్నారు.

# ఆధార్ పేర్లు, అడ్రస్లు మార్పు చేసి 278చ. గ.లు అమ్మకం చేసిన భూమాఫియా

### -అసలు పట్టాదారు రంగంలో దిగడంతో బట్టబయలైన భూభాగోతం

### -మధ్య వ్యక్తి ద్వారా అట్టి స్థలాన్ని అమ్మకానికి పెట్టించడంతో నిండు ప్రాణం బలి

### -తనకు న్యాయం చేయాలని మరణించిన వ్యక్తి భార్య పోరాటం






సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి)ఏప్రిల్ 17:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఖాళీ స్థలం కనబడితే కబ్జా చేయటమే కాకుండా అట్టి స్థలంపై ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ద్వారా అమ్మకాలు చేయాలని పక్కా క్రిమినల్ తెలివి తేటలను ప్రదర్శిస్తూ స్థలం ఎవరి పేరు మీద ఉందో తెలుసుకొన్నారు. అట్టి పేరుని, చిరునామాను ఆధార్ కార్డులో మార్పులు చేసి రామాపురం ఎక్స్ రోడ్డు నుండి కోదాడకు ఆటోలో వస్తుండగా ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినట్లుగా కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అట్టి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ కాపీని పొంది సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి సర్టిఫైడ్ డాక్యుమెంట్ కాపీని తీసుకొని అట్టి డాక్యుమెంట్ ద్వారా 278 చ.గ స్థలాన్ని అమ్మి లక్షలు సంపాదించాలని పక్కా ప్రణాళిక రచించారు.కోదాడ మండలం రామలక్ష్మి పురం గ్రామనికి చెందిన వ్యక్తులు మఠంపల్లి మండలానికి చెందిన మహిళ ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్సులు మార్పులు చేయించి అట్టి ఆధార్ ద్వారా హుజూర్ నగర్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో 278చ. గ.లు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన వ్యక్తి పేరున మార్పు చేయడం జరిగింది. అనంతరం 278 చ.గ.లలో రామలక్ష్మి పురానికి చెందిన వ్యక్తికి 78 చ.గ రిజిస్ట్రేషన్ చేసి మిగిలిన 200 చ.గజాల స్థలాన్ని అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని 20 లక్షలు కావాలని చెప్పి రియల్ ఎస్టేట్ చేసే వ్యక్తిని సంప్రదించడంతో( మరణించిన వ్యక్తి) ఆయన డాక్యుమెంట్స్ అన్ని వెరిఫికేషన్ చేసుకొని హుజూర్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తనిఖీ చేసుకొని అన్ని సక్రమంగా ఉన్నాయని అందరూ చెప్పడంతో ఒరిజినల్ డాక్యుమెంట్ పోయిందని సీసీ కాపీ ఉండడంతో ఈసీ క్లియర్ ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగిని సంప్రదించి 200 చ.గజాలు సేల్ కమ్ డీల్ చేసే ఖరారుతో 20 లక్షల రూపాయలు వడ్డీతో సహా తిరిగి ఇచ్చిననపుడు రిజిస్ట్రేషన్ చేసే ఒప్పందం మేరకు 200 చదరపు గజాలు 2023 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. అన్ని సక్రమంగా ఉన్నాయనుకున్న సమయాన ప్రభుత్వ ఉద్యోగి డబ్బులు వడ్డీ అడుగుతుండడంతో, రామలక్ష్మి పురం వ్యక్తులు గుడిబండ గ్రామానికి చెందిన వ్యక్తులను అడుగుతూ ఉండడంతో అట్టి స్థలాన్ని అమ్మి వాటిపై వచ్చిన డబ్బులు అసలు వడ్డీ చెల్లించి మిగిలిన సొమ్ము ఇప్పించేలా పార్టీని చూడమని మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కోరడంతో హుజూర్ నగర్ కు చెందిన ముస్లిం కుటుంబానికి అమ్మకం చేయగా ముస్లిం కుటుంబ సభ్యులు ఇరువురు చెరో 100 చ.గజాల చొప్పున 2025 ఫిబ్రవరి లోనే రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది.కొనుగోలు చేసిన ముస్లిం వ్యక్తి అట్టి స్థలాన్ని బిల్డర్ కు అప్పచెప్పి ఇంటి నిర్మాణం చేసి అమ్మి పెట్టే క్రమంలో అడ్వకేట్ ఇల్లు కావాలనడంతో మరల మరణించిన వ్యక్తి బిల్డర్ కు పరిచయం చేసి అడ్వాన్స్ గా కొంత సొమ్ము అప్పజెప్పిన పది పదిహేను రోజులలోపే నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చెరుకుపల్లి కి చెందిన అసలు పట్టాదారుని కుటుంబ సభ్యులు వచ్చి నిజమైన డాక్యుమెంట్స్ చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాదోపవాదాలు జరిగాయి. ముస్లిం వ్యక్తి ఉద్యోగిని, ఉద్యోగి రామలక్ష్మి పురం వ్యక్తులను ఒత్తిడి చేయడం వారి మధ్య ఒప్పందాలు జరగటం అన్ని ఒక వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి తన ద్వారానే అమ్మకాలు చేయించి తనను ఇబ్బందులకు గురి చేశారన్న ఒత్తిళ్లతో, ఇతర బెదిరింపులతో తన భర్త ఆత్మహత్యకు కారణం అంటూ మరణించిన వ్యక్తి భార్య ఇద్దరు మైనర్ పిల్లలతో న్యాయం కోసం పోరాడుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా ఆమె కుటుంబానికి ఆమెకు న్యాయం చేస్తారో లేదో వేచి చూడాలి.

# ఆన్లైన్ ఆప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసిన చిత్తూరు 2వ పట్టణ పోలీసులు

-బెట్టింగ్ వలలో చిక్కుకోవద్దు... మీ ప్రాణాలను పోగొట్టుకోవద్దు

-"జీవితం చాలా విలువైనది... దాన్ని ఆన్లైన్ బెట్టింగ్‌లో పెట్టి కుటుంబాన్ని నాశనం చేసుకోవద్దు."

- చిత్తూరు జిల్లా ఎస్పీ శ్రీ వి.ఎన్.మణికంఠ చందోలు, ఐపీఎస్



తిరుపతి జిల్లా ప్రతి నిధి/చిత్తూరు ఏప్రిల్ 17, (భారత శక్తి ):ఇప్పుడు సాంకేతికత అభివృద్ధితో పాటు మోసపూరిత చర్యలకు దారితీసే మార్గాలు కూడా విస్తృతమవుతున్నాయి. అందులో భాగంగా, ఇటీవలి కాలంలో యువతను ప్రభావితం చేస్తున్న ఓ ప్రధాన ముప్పు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ క్రికెట్, క్రీడలు, లాటరీలు, కార్డ్ గేమ్స్ పేరిట నడుస్తున్న ఈ బెట్టింగ్ యాప్స్ కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలకు మార్గం అవుతున్నాయి. యువతను మానసికంగా, ఆర్థికంగా పాడుచేసే లేదా కొన్ని సార్లు ప్రాణాలు సైతం బలి తీసుకునే ఈ ఆన్లైన్ ఆటలపై చిత్తూరు జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.ఇందులో బాగంగా నిన్నటి దినం 15-04-2025వ తేదీన చిత్తూరు పట్టణములోని సంతపేట ప్రాంతంలో సాయంత్రం 07:30 గంటలకు చిత్తూరు పట్టణానికి చెందిన నలుగురు యువకులు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ పై బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా ఎస్పీ శ్రీ వి.ఎన్.మణికంఠ చందోలు, ఐపీఎస్ ఆదేశాల మేరకు 2వ పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీ నెట్టికంటయ్య మరియు సిబ్బంది నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.48,000/- నగదు మరియు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడమైనది. విచారణలో బాగంగా ఎ 1 - ఎం. రాజా ను విచారించగా ఇతను "దాఫాబేట్ స్పోర్ట్స్ " అనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా డబ్బులు నష్టపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజుల క్రితం "దాఫాబేట్ స్పోర్ట్స్ " అనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో ఖాతా ఓపెన్ చేసి చిన్న మొత్తాలతో బెట్టింగ్‌లు పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో చిన్న లాభాలు వచ్చాయి. ఆ లాభాలను చూసి ఇంకా ఎక్కువ డబ్బులు పెట్టాలనే ఆశతో అతని భార్య బంగారు ఆభరణాలను కూడా బ్యాంకులో తాకట్టు పెట్టి బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా అతనికి తెలిసిన స్నేహితుల వద్ద నుంచి కూడా లక్షల రూపాయల వరకు అప్పులు తీసుకుని వాటిని కూడా ఆన్లైన్ బెట్టింగ్‌లో పెట్టి నష్టాల పాలయ్యాడు. గత వారం రోజులలోనే సుమారు ఐదు నుండి ఆరు లక్షల రూపాయల వరకు నష్టపోయానని తెలిపాడు.దీనిపై జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ"బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయాజాలం మాత్రమే. ప్రజల కష్టార్జిత సంపదను మోసం చేసేలా తయారైనవి. ఈ యాప్‌లు పూర్తిగా చట్ట విరుద్ధమైనవి. ఎవ్వరూ వాటిలో పాల్గొనరాదు" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.బెట్టింగ్ ద్వారా సంపాదన సాధ్యపడదని, ఇది ఒక అక్రమ కార్యకలాపం అని, ఇది కేవలం ఆర్థిక నష్టమే కాకుండా భవిష్యత్తును నాశనం చేసే విషం అని తెలిపారు. చాలా మంది యువకులు ఎటువైపు వెళ్లాలో తెలియకుండా అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారని, ఈ బెట్టింగ్ ఆటల వలన ఆత్మహత్యలు, కుటుంబ విభేదాలు, నేర ప్రవృత్తి పెరుగుతున్నాయని తెలియజేసారు.2024వ సంవత్సరం అక్టోబర్ నెలలో చిత్తూరు జిల్లా, జి.డి.నెల్లూరు మండలానికి చెందిన దినేష్ అనే యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. పెద్ద మొత్తంలో అప్పులు చేసి కుటుంబ ఆస్తిని తాకట్టు పెట్టాడు. చివరకు ఆర్థిక ఒత్తిడికి లోనై తండ్రి, తల్లి, అక్కతో కలిసి అందరూ పురుగుల మందు తాగి మృతి చెందారు. మన రాష్ట్రంలో బెట్టింగ్ మాయలో చిక్కుకొని మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటనలు పలు చోట్ల నమోదయ్యాయి.ఈ ఘటనలన్నీ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఎలా ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నాయో స్పష్టంగా తెలియపరుస్తున్నాయి. యువతలో పెరుగుతున్న ఆకర్షణను అదుపు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు స్కూల్స్ మరియు కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులతో పాటుగా తల్లిదండ్రులు కూడా ఈ బెట్టింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు తమ వంతు కృషి చేయాలని ఎస్పీ గారు కోరారు.

::ప్రజలకు సూచనలు::

1. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే బెట్టింగ్ లింకులకు తగిన జాగ్రత్త తీసుకోండి.

2. ఎవరైనా బెట్టింగ్ చేయమంటూ డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 లేదా చిత్తూరు పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005 కు సమాచారం ఇవ్వండి.

3. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి 1930 నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్ లేదా %ఒఒ.ఎఎఎతీఎతీఅఎఎ.స్రశీజ.ఱఅ% ని ఉపయోగించండి.

4. యువత, విద్యార్థులు ఈ యాప్‌ల వలన మానసికంగా బలహీనపడడమే కాకుండా కొన్ని సార్లు ఆత్మహత్యలు చేసుకునే అవకాశమున్నందున తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

::ముద్దాయిల వివరాలు::

ఎ 1: ఎం.రాజా, వయస్సు 26, దొంగలభావి వీధి, సంతపేట, చిత్తూరు పట్టణము, వృత్తి: ఆటో డ్రైవర్.

ఎ2: ఇ.దస్తగిరి, వయస్సు 33, మురార్జీ నగర్, ఓబనపల్లి కాలనీ, చిత్తూరు పట్టణము, వృత్తి: చికెన్ షాప్ నిర్వహిస్తాడు.

ఎ3: కె.సర్ఫుద్దీన్, వయస్సు 27, మురార్జీ నగర్, ఓబనపల్లి కాలనీ, చిత్తూరు పట్టణము, వృత్తి: కూలి పని.

ఎ4: %ూ%.ముని, వయస్సు 26, %ూ/శీ ఖ%. ఇసామిల్, మురార్జీ నగర్, ఓబనపల్లి కాలనీ, చిత్తూరు పట్టణము, వృత్తి: కూలి పని. అని తెలిపారు.

# మహిళా హక్కుల సాధనకు పోరాటాలు ఉధృతం :ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి





కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):మహిళా హక్కుల పరిరక్షణ సాధనే లక్ష్యంగా, అంబేద్కర్, పూలే ఆశయాల సాధన దిశగా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర సాగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర ఈరోజు హనుమకొండ, హుజురాబాద్ మీదుగా కరీంనగర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌకు వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి స్త్రీల సమాన హక్కుల గురించి పొందుపరిచిన మహోన్నతమైన వ్యక్తి అని శ్రీ విద్యావంతురాలు అయితే కుటుంబమంతా విజ్ఞానులుగా మారుతారని శీల చదువు కోసం పాఠశాలలను స్థాపించి చదువు నేర్పిన గొప్ప మూర్తి జ్యోతిబాపూలే అని వీరి ఆశయాల సాధన కోసం మహిళా హక్కుల పరిరక్షణ సాధన కోసం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కృషి చేస్తుందని అన్నారు. దేశంలో సగభాగం ఉన్న మహిళలకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయని అన్నారు. పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఇంట్లో వరకట్న వేధింపులు బయట హత్యలు అత్యాచారాలు అధికమయ్యాయని కఠినంగా శిక్షించవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని అన్నారు. మహిళలపై ఆగాయిత్యాలు జరిగినప్పుడే హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నారని మహిళలపై ఆగాయిత్యాలు జరగకుండా కఠిన చట్టాలు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ పోర్టుల ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించాలని బాధ్యులైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికలు మహిళలపై జరుగుతున్న హింసను లైంగిక వేధింపులను అరికట్టి మహిళలకు భద్రత కల్పించాలని అన్నారు. ఓటిపి రేపు సిరీస్ ల వల్ల పిల్లలపై ప్రభావం పడుతుందని పోర్న్ వెబ్సైట్లను మూసివేయాలని అన్నారు. రాష్ట్రంలో దేశంలో గంజాయి మద్యం బెల్ట్ షాపులు మతక ద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో 14 రకాల నిత్యాసర వస్తువులను సరఫరా చేయాలని, కులాంతర వివాహాలకు రక్షణ చట్టం తీసుకురావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని.

మహిళలకు నెలకు 2500 రూపాయలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమస్యలను అధ్యయనం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందిస్తామని పరిష్కరించని యెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. పరిరక్షణ యాత్రకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షులు వర్ణ వెంకటరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సాగర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి .తిరుపతి, నరేష్ పటేల్ సంపూర్ణమద్దతు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణ జ్యోతి, రాష్ట్ర సహాయ కార్య దర్శులు కే.ఎన్ ఆశలత, నల్లిగంటి రత్నమాల, జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ధ్యావా అన్నపూర్ణ,పాంద్రాళ్ల దేవేంద్ర, నగర కార్యదర్శి చేనిరోజా, సహాయ కార్యదర్శి మంచినీళ్ల లావణ్య, జిల్లా కమిటీ, సభ్యులు ఉప్పునూటి లక్ష్మి,మేదర నాగమణి, టి. భవాని, ఎం. రామ, గొలుసుల రజిని, పోతర్ల మానస, తారపాకల మున్న, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి పిల్లల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్

జిన్నారం,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 17: సంగారెడ్డి జిల్లా బొల్లారం, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19 అంగన్వాడి సెంటర్ల గ్రాడ్యుయేషన్ డే ను గడ్డపోతారం మున్సిపాలిటీలో నిర్వహించారు. లక్ష్మీపతి గూడెంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని సిడిపిఓ జైరాం నాయక్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ మీరా బాయి తో కలిసి మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన నేర్చుకోవడం వల్ల మరింత జ్ఞానాన్ని పెంచుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆడుకోవడానికి పరికరాలు డ్రాయింగ్స్ పెయింటింగ్స్ అనేకమైన విషయాలు పిల్లలు నేర్చుకోవడం చాలా సంతోషకరమని రాబోయే రోజుల్లో ఈ పిల్లలకు ఉన్నత చదువులకు ఇలాంటి వాతావరణం చాలా తోడ్పడుతుందని అన్నారు.ఈ



కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్య,అశోక్. కృష్ణ రమేష్ ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన

## ఆరేండ్ల లోపు పిల్లల్ని చేర్పించాలి :జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరంలో ఆరేండ్లలోపు పిల్లలందరినీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఐసిడిఎస్ కరీంనగర్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ఉపయోగించే బోధన ఉపకరణాలను ఎల్ ఎం డి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీల్లో ప్రతి నెలా ఏ సిలబస్ బోధించాలో నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటుందని అన్నారు.

చిన్నారుల మానసిక పరిపక్వత కోసం ప్రత్యేకంగా సిలబస్ తయారు చేశామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లకు నూతన సిలబస్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని అన్నారు. ఆటపాటలతో కూడిన అంగన్వాడీ కేంద్రాల్లో ఆరు సంవత్సరాల లో పిల్లలందరినీ చేర్పించాలని కోరారు. ఈ ప్రదర్శనశాలలో బోధించే పరికరాలు, నెలవారీగా సిలబస్ వివరాలు, కిచెన్ గార్డెన్ ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన చిన్నారులకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, సిడిపిఓ శ్రీమతి, ప్రాంగణం మేనేజర్ సుధారాణి, డిసిపిఓ ఫర్వీన్ పాల్గొన్నారు.

# రెవిన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, ఏప్రిల్ 17(భారత శక్తి): రెవిన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకుని.. తమ పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా, జవాబుదారి తనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని సభా భవన్ లో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వో, మండల సర్వేయర్ల తో వివిధ రకాల రెవెన్యూ అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం (వర్క్ షాప్) జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యులుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ%ో% రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారిగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందన్నారు.అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే మన బాధ్యత అని తెలియజేశారు. సమస్యలపైన అవగాహన పెంపొందించడానికి తహశీల్దార్లు ప్రతి రోజు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని, ఆ గ్రామంలోని సమస్యలపై దృష్టిసారించి పరిష్కార మార్గాలను వెదుకుతూ విజయవంతంగా మండల స్థాయిలో రెవెన్యూ సేవల పనితీరును మెరుగు పరచడం జరుగుతోందన్నారు. వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని అర్జీలను నాణ్యతగా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల అంశంలో నిబంధనలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.గ్రామస్థాయిలో గుర్తించిన అర్జీలను పరిష్కరించడానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వారంలో నాలుగు రోజులు విజిట్ చేసి పూర్తి అవగాహనతో పరిష్కరించాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ ఎంక్వయిరీలు నిర్వహించేటప్పుడు సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. 1142 జీవో ప్రకారం ఎలాంటి భూములను ఎవరికి అసైన్ చేయాలి అనే అంశానికి సంబంధించి విధివిధానాలపై, రీ సర్వే, వెబ్ లాండింగ్, మ్యుటేషన్స్ మొదలైన అంశాల్లో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు ఎదురయ్యే సమస్యలు, అనుభవాలపై సమీక్ష నిర్వహించి, ఆయా రెవెన్యూ డివిజన్ అధికారులకు, తహసీల్దార్లకు పునశ్చరణ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, ల్యాండ్స్ సర్వే ఎడి మురళీకృష్ణ, నాలుగు రెవిన్యూ డివిజన్ల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వో లు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ఉమ్ము’ గేమ్ ఛేంజరా? నేనైతే వాడను: మిచెల్ స్టార్క్

రాజస్థాన్‌పై ‘సూపర్’ విక్టరీ సాధించడంలో ఢిల్లీ పేసర్ మిచెల్ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. తొలుత నాలుగు ఓవర్ల కోటాలో వికెట్ తీసి 36 పరుగులు ఇచ్చాడు. ఆఖరి ఓవర్‌లో రాజస్థాన్ విజయానికి కేవలం 9 పరుగులే అవసరం. స్టార్క్ అద్భుతంగా బంతులేసి ఒక్క బౌండరీ ఇవ్వలేదు. ఈ ఓవర్‌లో 8 పరుగులే రావడంతో మ్యాచ్ ‘సూపర్’ ఓవర్‌కు చేరింది. అక్కడా సత్తా చాటిన స్టార్క్ 10 పరుగులే ఇచ్చాడు. దీంతో ఢిల్లీ నాలుగు బంతుల్లోనే విజయం సాధించింది. ఈ క్రమంలో ‘ఉమ్ము’ కీలక పాత్ర పోషించిందనే వాదనను మిచెల్ స్టార్క్ కొట్టిపడేశాడు. తాను అసలు సెలీవాను (లాలాజలం) వాడేది ఉండదని.. చెమటను ఎక్కువగా బంతికి పూసేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. కరోనా కారణంగా ఐదేళ్ల కిందట బీసీసీఐ ఐపీఎల్‌లో నిషేధం విధించింది. ఇప్పుడు మళ్లీ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.



“నేను ఉమ్మి వాడను. దీనివల్ల ఏదో ప్రయోజనం ఉంటుందని అనుకోవడం లేదు. అసలు ఉమ్మికి, చెమటకు పెద్ద తేడా ఏముండదు. అది ఎర్ర బంతిపై ప్రభావం చూపిస్తుందేమో కానీ.. తెల్ల బంతిపై కాదు. కీలకమైన మ్యాచ్‌లో విజయం సాధించడం ఆనందంగా ఉంది. పక్కా ప్రణాళికతోనే బరిలోకి దిగా. నేను ఎలా అమలుచేయాలని అనుకుంటానో అదే చేస్తా. ఇప్పటివరకు నేను ఏం చేశాననేది అందరికీ తెలుసు. సూపర్ ఓవర్‌కు వెళ్లడం భలేగా ఉంది. అయితే, నో బాల్ వేసినా వెంటనే పుంజుకొన్నాం. రనౌట్ల రూపంలో రెండు వికెట్లు దక్కాయి. మా బ్యాటర్లు అలవోకగా బాదేశారు” అని స్టార్క్ తెలిపాడు.



# ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదం.. ఢిల్లీ బౌలింగ్ కోచ్‌కు భారీ జరిమానా

ఐపీఎల్ 2025 సీజన్‌లో మరో ఉత్కంఠ పోరు జరిగింది. ఈ లీగ్ టోర్నీ )లో నాలుగేళ్ల తర్వాత మళ్లీ సూపర్ ఓవర్ అవసరం కాగా.. ఆ రసవత్తర సమరంలో రాజస్థాన్‌ను ఓడించి అద్భుత విజయాన్ని అందుకుంది ఢిల్లీ క్యాపిటల్స్ అయితే, ఈ మ్యాచ్ సమయంలో ఢిల్లీ బౌలింగ్ కోచ్, మాజీ క్రికెటర్ మునాఫ్ పటేల్ ఫోర్త్ అంపైర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ప్రవర్తనకు గానూ మునాఫ్‌పై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది.

క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినందుకు గానూ ఢిల్లీ బౌలింగ్ కోచ్‌కు జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ (ఓ ప్రకటనలో వెల్లడించింది. మ్యాచ్ ఫీజులో 25శాతం కోతతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తున్నట్లు తెలిపింది. దీన్ని లెవల్-1 నేరంగా పరిగణించింది. ఈ ఉల్లంఘనలపై మ్యాచ్ రిఫరీదే తుది నిర్ణయమని చెప్పింది. ఈ జరిమానాకు కారణమేంటో బీసీసీఐ పేర్కొనలేదు కానీ.. అంపైర్‌తో వాగ్వాదం వల్లే బోర్డు ఈ చర్యలు తీసుకుని ఉండొచ్చని తెలుస్తోంది. తన తప్పిదాన్ని మునాఫ్ ఒప్పుకొని మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్ని అంగీకరించినట్లు బీసీసీఐ తమ ప్రకటనలో పేర్కొంది.

ఏం జరిగిందంటే..?

బుధవారం రాత్రి రాజస్థాన్ (తో జరిగిన మ్యాచ్ మధ్యలో డ్రింక్స్ బ్రేక్‌లో తమ ఆటగాళ్లకు మెసేజ్ ఇచ్చేందుకు ఢిల్లీ రిజర్వ్ ఆటగాడిని మైదానంలోకి వెళ్లమని మునాఫ్ పటేల్ చెప్పాడు. అయితే అతడిని బౌండరీ లైన్ వద్ద ఉన్న ఫోర్త్ అంపైర్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలోనే అక్కడి అంపైర్‌తో మునాఫ్ వాగ్వాదానికి దిగాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ కారణం వల్లే బీసీసీఐ జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

# సురుచి ధమాకా

లిమా (పెరూ) సురుచి ఇందర్‌సింగ్ అదరగొట్టింది. ఇటీవల బ్యూనస్‌ఎయిర్స్ షూటింగ్ ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో స్వర్ణం, కాంస్యంతో వెలుగులోకి వచ్చిన ఈ టీనేజర్.. లిమాలో జరుగుతున్న ప్రపంచకప్ స్టేజ్-2 పోటీల్లో పసిడి ధమాకా మోగించింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ సింగిల్స్‌లో పసిడి నెగ్గిన ఆమె.. ఇదే ఈవెంట్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సౌరభ్ చౌదరితో కలిసి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. బుధవారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ సింగిల్స్ ఫైనల్లో సురుచి 243.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 24 షాట్ల తుది పోరులో సురుచి 1.3 పాయింట్లతో ఫేవరెట్ మను బాకర్ (242.3)పై పైచేయి సాధించింది. చివరి రెండు షాట్ల వరకు బాకర్ నుంచి సురుచికి గట్టిపోటీ ఎదురైంది. కానీ ఒత్తిడిని అధిగమించిన ఈ టీనేజర్ స్వర్ణాన్ని ముద్దాడింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన మను.. రజతంతో




సరిపెట్టుకుంది. యావో కియాన్‌యున్ (చైనా, 219.5) కాంస్యం గెలుచుకుంది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ ఫైనల్లో సురుచి-సౌరభ్ జంట 17-9తో కియాన్‌గ్జున్-హుకయ్ (చైనా) ద్వయాన్ని ఓడించింది. ఒక దశలో 2-8తో వెనుకబడినా.. భారత జంట పుంజుకుని విజేతగా నిలవడం విశేషం.




# 5: ఐపీఎల్ 2025: ఇప్పుడొచ్చింది అసలు మజా.. ఇలానే కొనసాగితే...

ఐపీఎల్ అనగానే వీరబాదుడే గుర్తుకు వస్తుంది. అయితే దీని గురించి కొంతమంది మాజీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. బౌలర్ బంతి వేయడం బ్యాటర్ సిక్స్ బాదడం వల్ల అభిమానులకు ఆనందం ఏం ఉంటుందంటూ ప్రశ్నించారు. కట్ చేస్తే ఐపీఎల్‌లో పరిస్థితి మారింది. కొన్ని మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. స్వల్ప స్కోర్లను కూడా కాపాడుకోవడం, సూపర్ ఓవర్ వరకు మ్యాచ్ మళ్లడం లాంటివి జరిగాయి. దీంతో ఐపీఎల్ (%ూూ%)కు అసలు మజా ఇప్పుడే వచ్చింది అనిపిస్తోంది.

ఆ మ్యాచ్ అదరహో

ఐపీఎల్-18లోకెల్లా సిసలైన మజా ఇచ్చిన మ్యాచ్‌గా పంజాబ్ కింగ్స్ - కోల్‌కతా నైట్‌రైడర్స్ పోరే. 200 స్కోర్లు అలవోకగా నమోదవుతున్న ఈ సీజన్లో 111 పరుగుల స్కోరు చేసి కూడా మ్యాచ్‌ను కాపాడుకోవడం పంజాబ్‌కే చెల్లింది. 10 ఓవర్లలోనే లక్ష్యాన్ని కోల్‌కతా ఊదేస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఫలితాన్ని చూసి ఆశ్చర్యపోయారు. విజయానికి ఏ మాత్రం అవకాశం లేని పరిస్థితి నుంచి.. పంజాబ్ మ్యాచ్‌ను చేజిక్కించుకున్న తీరు అద్భుతం. ఒక మాటలో చెప్పాలంటే బంతి మాయ చేసింది. కోల్‌కతాకు పరాజయాన్ని రుచి చూపించింది. 112 పరుగుల ఛేదనలో 9 ఓవర్లకు 3 వికెట్లకు 72 పరుగులు చేసిన జట్టు ఓడిపోతుందని ఎవరూ ఊహించి ఉండరు. 95 పరుగులకే కోల్‌కతా ఇన్నింగ్స్ ముగిసిపోవడం ఆశ్చర్యకరం. అందుకే మ్యాచ్ ఆఫ్ ద ఐపీఎల్‌గా నిలిచిపోయింది. లీగ్ చరిత్రలో స్వల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా పంజాజ్ ఘనత సాధించింది. లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, పేసర్ యాన్సెన్ ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేసిన తీరు చూసి తీరాల్సిందే.

ధోనీ ఇచ్చిన కిక్

చెన్నై సూపర్‌కింగ్స్ - లఖ్‌నవూ పోరు కూడా అభిమానులను అలరించింది. రెండు జట్ల మధ్య విజయం దోబూచులాడుతూ చివరికి చెన్నైని వరించింది. బ్యాటింగ్ విషయంలో గత కొన్ని మ్యాచ్‌లుగా విమర్శలు ఎదుర్కొన్న మహేంద్ర సింగ్ ధోని మునుపటిలా మెరుపు ఇన్నింగ్స్‌తో చెన్నైను గెలిపించడం అభిమానులకు కిక్ ఇచ్చింది. ఈ సీజన్లో గెలిచే మ్యాచ్‌లను కూడా అధ్వాన్న బ్యాటింగ్‌తో దూరం చేసుకున్న సీఎస్కే.. లఖ్‌నవూపై కూడా అలాగే ఆడింది. దాదాపు ఓడిపోయే పరిస్థితికి వెళ్లింది. కానీ ధోని అనూహ్యంగా చెలరేగి ఆ జట్టు అభిమానుల్లో చాలారోజుల తర్వాత ఆనందాన్ని తెచ్చాడు.

సూపరో.. సూపర్

నాలుగేళ్ల తర్వాత ఓ సూపర్ ఓవర్! ఇది చాలు.. గత కొన్ని సంవత్సరాల నుంచి ఐపీఎల్‌లో బ్యాటర్లు ఎంతగా ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారో చెప్పడానికి. కానీ ఆ లోటును తీరుస్తూ చాన్నాళ్ల తర్వాత ఈ సీజన్లో ఓ సూపర్ ఓవర్ మ్యాచ్ జరిగింది. ఢిల్లీ క్యాపిటల్స్ - రాజస్థాన్ రాయల్స్ మధ్య పోరు అభిమానులను ఉర్రూతలూగించింది. పోయిందనుకున్న మ్యాచ్‌ను ఢిల్లీ నిలబెట్టుకున్న తీరు అద్భుతం. ఒక దశలో రాజస్థాన్ తేలిగ్గా మ్యాచ్ గెలిచేలా కనిపించింది. అయితే కట్టుదిట్టంగా బంతులు వేసిన పేసర్ మిచెల్ స్టార్క్ కళ్లెం వేశాడు. మ్యాచ్‌ను సూపర్ ఓవర్‌కు మళ్లించాడు. సూపర్ ఓవర్‌లోనూ గొప్పగా బౌలింగ్ చేసిన స్టార్క్. రాజస్థాన్ బ్యాటర్లు చెలరేగకుండా అడ్డుకట్ట వేశాడు. ఇదే ఢిల్లీ తేలిగ్గా గెలిచేందుకు కారణమైంది.

మూడు రనౌట్లు

రెండు ఓవర్లలో 23 పరుగులు చేయాలి. క్రీజులో అశుతోష్ శర్మ లాంటి విధ్వంసక బ్యాటర్. మ్యాచ్ ఢిల్లీ క్యాపిటల్స్‌దే అనుకుంటారు అంతా. అలాంటి పోరు వరుస రనౌట్ల కారణంగా ముంబయి వైపునకు తిరిగిపోయింది అంటే నమ్ముతారా? ఇది ఈ ఐపీఎల్‌లో జరిగింది. 19వ ఓవర్‌లో ముంబయి ఫీల్డర్లు చురుకుగా కదిలి మూడు రనౌట్లు చేశారు. వికెట్లు పడగొట్టి టెన్షన్ పెట్టడం ఒకెత్తు అయితే.. ఇలా రనౌట్లు చేసి గెలిపించడం మరో ఎత్తు. దానిని ముంబయి భలేగా చేసింది. ఏ జట్టు నెగ్గినా అభిమానులకు మాత్రం 100 శాతం టీ20 వినోదం అందింది. బ్యాటింగ్, బౌలింగ్‌కు మధ్య సమతూకం ఉంటే ఆట ఎలా ఉంటుందో చూపించిన మరో పోరు ఇది. అంత ఒత్తిడిలోనూ స్టార్క్ అద్భుత బౌలింగ్ ఫలితాన్నే మార్చింది. ఈ మూడు మ్యాచ్‌ల మాదిరిగానే రాబోయే రోజుల్లోనూ మరింత రంజుగా, ఆసక్తికరంగా జరిగితే అభిమానులకు అంతకుమించిన ఆనందం



# ఇంగ్లాండ్ పర్యటనకు ముందే ప్రక్షాళన... గంభీర్ బృందంలో ముగ్గురిపై వేటు

: జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా ( వెళ్లనుంది. దీనికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. అయినా, జట్టు కోచింగ్ బృందంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్, కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌పై వేటువేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని టీమ్‌ఇండియా 1-3 తేడాతో కోల్పోయిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలోనే భారత్‌కు చుక్కెదురైంది. పేలవ ప్రదర్శనను కారణంగా చూపిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, భారీ పరాభవాలను తట్టుకొని మరీ టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడంలో గంభీర్ బృందం పాత్ర కీలకమైందే.

కానీ, ఇంగ్లాండ్‌తో టెస్టు పర్యటనకు జంబో కోచింగ్ బృందం అవసరం లేదని బీసీసీఐ భావిస్తోంది. అందుకోసమే అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌ను పక్కనపెట్టిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టుకు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఉన్నాడు. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇక టెన్ దస్కతే రూపంలో మరో అసిస్టెంట్ కోచ్ గంభీర్‌కు సాయంగా ఉన్నాడు. ఈక్రమంలోనే అభిషేక్‌ను తప్పించారు. అయితే, ఆటగాళ్ల ఫీల్డింగ్ మెరుపుల వెనక దిలీప్‌ది కీలకపాత్ర అని మాజీలే చెబుతారు. ద్రవిడ్ ప్రధాన కోచ్ పదవికి వీడ్కోలు పలికినప్పటికీ.. దిలీప్‌పై నమ్మకంతో బీసీసీఐ అతన్ని కొనసాగించింది.

# సెన్సెక్స్ 1500 పాయింట్లు జంప్.. ర్యాలీకి ఐదు కారణాలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా, చైనా మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా.. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలను ముందుండి నడిపించాయి. దేశీయంగా కనిష్ఠ స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణ చేరడం, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ 1500 పాయింట్ల మేర లాభపడి మళ్లీ 78 వేల మార్కును దాటగా.. నిఫ్టీ దాదాపు 400 పాయింట్ల మేర లాభపడి 23,800 ఎగువన ముగిసింది. మదుపర్ల సంపదగా వ్యవహరించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.419 లక్షల కోట్లకు చేరింది.

బీఎస్‌ఈ సెన్సెక్స్ ఉదయం 76,968.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,044.29) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత క్రమంగా లాభాల్లోకి వెళ్లిన సూచీ.. ఇంట్రాడేలో 78,616.77 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1508.91 పాయింట్ల లాభంతో 78,553.20 వద్ద ముగిసింది. నిఫ్టీ 414.45 పాయింట్ల లాభంతో 23,851.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.85.35గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు మినహా మిగిలిన షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎటర్నెల్ (జొమాటో), ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 3,324 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

బ్యాంకింగ్ స్టాక్స్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ కలిసి సెన్సెక్స్‌ను దాదాపు 600 పాయింట్లు పెరగడంలో దోహదపడ్డాయి.

విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం రూ.3,936 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. రెండు సెషన్లలో ఈ మొత్తం దాదాపు రూ.10 వేల కోట్లుగా ఉంది. ఇది మన దేశీ ఈక్విటీ మార్కెట్లపై నమ్మకాన్ని పెంచింది.

అమెరికా కరెన్సీ అయిన డాలరు విలువ బలహీన పడడం మన మార్కెట్లకు సానుకూల పరిణామం అని అనలిస్టులు చెబుతున్నారు.

టారిఫ్‌ల విషయంలో అమెరికా, జపాన్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఇది సెంటిమెంట్‌ను బలపరిచింది. ఇదే తరహాలో భారత్‌తో కూడా సానుకూల ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందన్న అంచనాలు దీనికి తోడయ్యాయి.

దీంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ 66 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే భారత్‌కు ఎంతకాలం తక్కువ ధరల వద్ద క్రూడ్ లభిస్తే ఆ మేర ద్రవ్యలోటు తగ్గుతుంది.

FONT SIZE




# కంపెనీ నిధులతో విలాసాలు.. ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి జెన్సోల్ స్టాక్ 90% పతనం

నిధుల మళ్లింపు కేసులో కంపెనీ, ప్రమోటర్లు అన్మోల్, పునీత్ సింగ్ జగ్గీలపై సెబీ నిషేధం విధించడంతో జెన్సోల్ ఇంజినీరింగ్ షేర్లలో పతనం కొనసాగుతోంది. వరుసగా రెండోరోజూ ఆ కంపెనీ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. గురువారం కంపెనీ షేర్లు 5 శాతం క్షీణించి 116.54 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి కంపెనీ షేర్లు దాదాపు 90 శాతం మేర పతనం అయ్యాయి. గతంలో ఈ కంపెనీ షేర్లు గరిష్ఠంగా రూ.1,124.90 వద్ద ట్రేడయ్యాయి. సంస్థపై గత కొన్ని రోజులుగా వస్తున్న అభియోగాల నేపథ్యంలో ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలోనే 84 శాతం మేర పతనం కావడం గమనార్హం.

ఐఆర్ఈడీఏ, పీఎఫ్‌సీ నుంచి జెన్సోల్ ఇంజినీరింగ్ మొత్తంగా రూ.977.75 కోట్ల రుణం తీసుకుంది. ఇందులో రూ.663.89 కోట్లను ప్రత్యేకంగా 6,400 విద్యుత్తు వాహనాల (ఈవీ) కొనుగోలు కోసం కంపెనీ వెచ్చించాలి. కొనుగోలు చేసిన వాహనాలను బ్లూస్మార్ట్‌కు లీజ్‌కు ఇవ్వాలి. ఇప్పటివరకు 4,704 ఈవీలను రూ.567.74 కోట్లతో కొనుగోలు చేశామని ఫిబ్రవరిలో సెబీకి జెన్సోల్ తెలిపింది. జెన్సోల్‌కు ఆ వాహనాలు సరఫరా చేసినట్లు గో-ఆటో ప్రైవేట్ లిమిటెడ్ ధ్రువీకరించింది. జెన్సోల్ తన వాటా కింద మరో 20% చెల్లించాలి కనుక, రుణాలతో కలిపి ఈవీల కొనుగోలుకు కేటాయించాల్సిన మొత్తం రూ.829.86 కోట్లు అవుతుంది. ఇందులో 4,704 ఈవీలకు వెచ్చించిన రూ.567.74 కోట్లను మినహాయిస్తే.. రూ.262.13 కోట్లకు లెక్క తేలలేదు.

నిధుల గోల్‌మాల్

ఈ నిధులు ఏమయ్యాయో తెలుసుకునేందుకు జెన్సోల్, గో-ఆటోల బ్యాంకు స్టేట్‌మెంట్‌లను సెబీ విశ్లేషించింది. పలు సందర్భాల్లో ఈవీ కొనుగోళ్ల కోసం గో-ఆటోకు బదిలీ చేసిన నిధులు తిరిగి ప్రత్యక్షంగా, పరోక్షంగా జెన్సోల్/అన్మోల్/పునీత్ ఖాతాల్లోకి వచ్చినట్లు సెబీ గుర్తించింది. ఇందులో కొంత మొత్తాన్ని ఇతర అవసరాల కోసం వారు వినియోగించారు. విలాసవంత అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు, బంధువులకు డబ్బుల బదిలీ, తమ సొంత సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు వినియోగించుకున్నారు.

సొంతానికి వాడేశారు

డీఎల్ఎఫ్ కేమ్‌లియాస్‌లో విలాసవంత ఫ్లాట్ కొనుగోలుకు అన్మోల్ సింగ్ జగ్గీకి చెందిన కేప్‌బ్రిడ్జి వెంచర్స్ ద్వారా రూ.42.94 కోట్ల మళ్లింపు

అశ్నీర్ గ్రోవర్‌కు చెందిన అంకురం థర్డ్ యూనికార్న్‌లో రూ.50 లక్షల పెట్టుబడి

అన్మోల్ తల్లి జస్మిందర్ కౌర్‌కు రూ.6.20 కోట్లు, భార్య ముగ్దా కౌర్‌జగ్గీకి రూ.2.98 కోట్ల బదిలీ

గోల్ఫ్ సెట్‌పై రూ.26 లక్షలు, ప్రయాణాల కోసం మేక్‌మై ట్రిప్ ద్వారా రూ.3 లక్షలు వెచ్చింపు

పునీత్ తన భార్య శాల్మాలి కౌర్ జగ్గీకి రూ.1.13 కోట్లుబీ తల్లికి రూ.87.52 కోట్లు బదిలీ

క్రెడిట్ కార్డుల చెల్లింపుల కోసమూ కంపెనీ నిధుల వాడకం




# 60: మోటో నుంచి తొలి ల్యాపీ.. ధర, డిస్‌ప్లే, ఇతర వివరాలు ఇవే

లెనోవోకు చెందిన సబ్‌బ్రాండ్ అయిన మోటోరొలా తన తొలి ల్యాప్‌టాప్‌ను విడుదల చేసింది. మోటో బుక్ 60ని దేశీయ మార్కెట్లో లాంచ్ చేసింది. 14 అంగుళాల ఈ ల్యాపీ రెండు రంగుల్లో లభిస్తుంది. ఇంటెల్ కోర్ 5 సిరీస్ ప్రాసెసర్‌తో వస్తున్న మోటో 60 ల్యాపీ 16జీబీ ర్యామ్ం512 జీబీ వెర్షన్ ధరను రూ.69,999గా కంపెనీ నిర్ణయించింది. ఆఫర్ కింద దీన్ని రూ.61,999కు విక్రయిస్తోంది. ఇంటెల్ కోర్ 7 సిరీస్ ప్రాసెసర్‌లో రెండు వేరియంట్లు ఉన్నాయి. 16జీబీం512జీబీ వేరియంట్ ధర రూ.74,990గానూ, 16జీబీం1టీబీ వేరియంట్ ధరను రూ.78,990గానూ కంపెనీ నిర్ణయించింది. వీటిపైనా ఆఫర్లు అందిస్తోంది. బ్రాంజ్ గ్రీన్, వెడ్జ్ వుడ్ రంగుల్లో లభిస్తుంది. ఏప్రిల్ 23 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

మోటో బుక్ 60 విండోస్ 11 హోమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. ఇందులో 14 అంగుళాల 2.8%ఖ% ఓఎల్ఈడీ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120%ఎ్‌% రిఫ్రెష్ రేటు, 500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. డాల్బీ విజన్, హెచ్‌డీఆర్‌కు సపోర్ట్ చేస్తుంది. బటన్‌లెస్ మైలార్ టచ్‌ప్యాడ్ ఇచ్చారు. గ్రాఫిక్ కార్డుతో కూడిన ఇంటెల్ కోర్ 7 240%ఎ%, ఇంటెల్ కోర్ 5 210%ఎ% ప్రాసెసర్ ఆప్షన్‌తో ఈ ల్యాపీ వస్తోంది. ర్యామ్‌ను 32జీబీ వరకు, 1టీబీ వరకు ఎస్ఎస్‌డీ స్టోరేజీని పెంచుకోవచ్చు.

1080%జు% వెబ్‌క్యామ్ ఇచ్చారు. ప్రైవసీ షట్టర్, ఫేస్ రికగ్నిషన్ కోసం ఐఆర్ కెమెరా ఉన్నాయి. డాల్బీ అట్మాస్‌తో కూడిన డ్యూయల్ స్టీరియో స్పీకర్స్, 2%ష% ఆడియో ఔట్‌పుట్ ఉంది. బ్లూటూత్ 5.4, వైఫై 7తో వస్తోంది. ఇందులో రెండు యూఎస్‌బీ టైప్-ఏ 3.2 జనరేషన్ పోర్టులుబీ రెండు యూఎస్‌బీ టైప్-సి 3.2 జనరేషన్ 1 పోర్టులుబీ ఒక డిస్‌ప్లే పోర్టు 1.4బీ హెచ్‌డీఎంఐ పోర్ట్‌బీ మైక్రోఎస్‌డీ కార్డ్ స్లాట్‌బీ 3.5 ఎంఎం ఆడియో జాక్ వంటివి ఉన్నాయి. ఇందులో కొన్ని ఏఐ ఫీచర్లను కూడా కంపెనీ జోడించింది. స్మార్ట్ కనెక్ట్, స్మార్ట్ క్లిప్‌బోర్డ్, ఫైల్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్లు ఉన్నాయి. మోటో బుక్ 60లో 60%ఔష్ట్ర% బ్యాటరీ ఉంది. ఇది 65%ఔ% ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. దీని బరువు 1.39 కేజీలు.

# నష్టాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్ సూచీలు..




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండోరోజూ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 180 పాయింట్ల నష్టంతో ప్రారంభం కాగా.. నిఫ్టీ 23,400 కింద ట్రేడింగ్ మొదలుపెట్టింది.

ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ (341 పాయింట్లు నష్టంతో 76,717 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 117 పాయింట్ల నష్టంతో 23,317 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్, ఎంఅండ్ఎం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

అమెరికా మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. డోజోన్స్ 1.73 శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 2.24 శాతం, నాస్‌డాక్ 3.07 శాతం నష్టపోయాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో కదలాడుతున్నాయి. హాంగ్‌సెంగ్ 1.34 శాతం లాభంతో ట్రేడవుతుండగా.. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ 0.46 శాతం, జపాన్ నిక్కీ 0.86 శాతం, హాంకాంగ్, షాంఘై 0.14 శాతం ఫ్లాట్‌గా ట్రేడవుతోంది.

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,354 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు (%ఖీ××ం%) క్రమంగా రెండోరోజూ కొనుగోలుదారులుగా నిలిచారు. బుధవారం నికరంగా రూ.3,936 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు (%ఱ××ం%) నికరంగా రూ.2,513 కోట్ల షేర్లు విక్రయించారు.

# ఫోన్‌పేలోనూ యూపీఐ సర్కిల్.. ఎలా వినియోగించాలంటే?

బ్యాంక్ ఖాతా వివరాలు అందించకుండా ఒకరి యూపీఐ అకౌంట్‌ను వేరొకరు వాడుకునేలా తీసుకొచ్చిన యూపీఐ సర్కిల్ ఫీచర్లను ఫిన్‌టెక్ సంస్థలు అందిపుచ్చుకుంటున్నాయి. ఇప్పటికే గూగుల్‌కు చెందిన చెల్లింపు సేవల సంస్థ గూగుల్ పే ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ( సైతం ఇదే సదుపాయాన్ని ప్రారంభించింది. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో తమ యూపీఐ అకౌంట్‌ను వాడుకునే సదుపాయం కల్పిస్తోంది.




యూపీఐ అకౌంట్ ఉన్న ప్రైమరీ యూజర్ తన కుటుంబసభ్యులు, ఫ్రెండ్స్ సర్కిల్‌లో వ్యక్తులను వారి యూపీఐ ఐడీ లేదా క్యూఆర్ కోడ్‌తో తన సర్కిల్‌లో యాడ్ చేయొచ్చు. దీంతో ఇలా సెకండరీ యూజర్లు ఎక్కడినుంచైనా ప్రైమరీ యూజర్ ఖాతా నుంచి సులువుగా చెల్లింపులు జరపొచ్చు. అయితే సెకండరీ యూజర్ చెల్లింపు అభ్యర్థనలను సమీక్షించడం, ఖర్చులను ట్రాక్ చేయడం, అవసరమైతే సర్కిల్ నుంచి యాక్సెస్‌ను డీలింక్ చేయడంతో పాటు వినియోగంపై ప్రాథమిక వినియోగదారులు పూర్తి నియంత్రణ కలిగిఉంటారు.

ఎలా అంటే?

సర్కిల్‌ను వినియోగించేందుకు అనుమతించాలంటే ముందుగా సెకండరీ యూజర్‌ను మీ సర్కిల్‌లో యాడ్ చేయాలి. దీనికోసం ముందుగా ఫోన్‌పే యాప్ ఓపెన్ చేయగానే కాస్త కిందకు స్క్రోల్ చేస్తే %మీఖఋస్త్రవ ్రాఋఎవవత్ం% సెక్షన్‌లో ఆప్షన్ దర్శనమిస్తుంది. దాన్ని ఎంచుకోండి.

వెంటనే ఆప్షన్ కింద %×అజత్‌వ ఖ =వనబవర్‌వతీ% పై క్లిక్ చేసి సెకండరీ యూజర్‌కి చెందిన యూపీఐ ఐడీ లేదా క్యూఆర్ కోడ్ సాయంతో రిక్వెస్ట్ పంపాలి.

ఆ రిక్వెస్ట్ యాక్సెప్ట్‌ను సెకండరీ యూజర్ యాక్సెప్ట్ చేస్తే చాలు.

# లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ కడప, ఏప్రిల్ 17(భారత శక్తి) : ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ప్రత్యేక డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో.. జిల్లాలోని అన్ని బ్యాంకులకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలపై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి కార్పొరేషన్ ద్వారా అర్హులైన నిరుద్యోగులకు వివిధ రకాల సెక్టార్ల ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తోందన్నారు. అందులో భాగంగా పరిశ్రమల రంగం, ట్రాన్స్పోర్ట్ సెక్టార్, వ్యవసాయ రంగం విభాగాలలో 828 యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం యూనిట్లకు రూ 34.40 కోట్లు లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో లబ్ది దారుల పెట్టుబడి 1.72 కోట్లు కాగా, బ్యాంకు రుణాల సాయం 19.11 కోట్లు, ప్రభుత్వం సబ్సిడీ రూ13.57 కోట్లు అందించనుందని తెలిపారు. గ్రౌండింగ్ కానున్న ఈ యూనిట్లపై బ్యాంకర్లు, సంబందిత ఫైనాన్స్ కార్పొరేషన్ల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. %ఓబీఎంఎంఎస్% పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, వారికి ఆర్థిక చేయుతనివ్వడంలో, ప్రభుత్వ ఆశయం నెరవేర్చడంలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేసిన బ్యాంకర్లను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు.అలాగే ప్రస్తుత ఆర్థిక సం లో జిల్లా ఆర్థిక వృద్ధిరేటు 15.2 శాతం సాధించడానికి పశుసంవర్ధక,హార్టికల్చర్, పరిశ్రమ, సర్వీసుల రంగాలలో రైతులు అభివృద్ధి చెందేందుకు బ్యాంకర్స్ సహకరించాలని కోరారు.ఈనెల 29వ తేదీన కడప హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు ఇందులో బ్యాంకర్లు పాల్గొనాలని సూచించారు.అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్దిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. రైతులకు ఆయా బ్యాంకు శాఖలు పంట రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు.

కార్యక్రమంలో ముందుగా.. ... డిసిసి, సమావేశం కు సంబంధించిన అజెండా, వివరాలను జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం వివరించగా..అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి ఎస్సీ కార్పొరేషన్ కు సంబంధించి అజెండా వివరాలను కలెక్టర్ కి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం, నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, కెనరా బ్యాంకు డి ఎం విలియమ్స్, ఎస్బిఐ ఎజిఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, ఏపీజిబి ఎజిఎం శ్రీనివాస ప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి,డిఆర్డీఏ, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్,మైనారిటీ కార్పొరేషన్ ఈడీ డా. వి.బ్రహ్మయ్య, వ్యవసాయ శాఖ జేడి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారిణి సుభాషిణి,పరిశ్రమల శాఖ జీఎం చంద్ బాషా,పశు సంవర్ధక శాఖ జేడి శారదమ్మ,వివిధ బ్యాంకుల ప్రతినిధులైన జిల్లా మేనేజర్లు, ఆర్.ఎం.లు, తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ సేవలు గ్రామస్థాయిలో విస్తృతపరచడమే లక్ష్యంగా పనిచేయాలి:ఎంపీలు రఘురాం రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర.



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, ఏప్రిల్ 17: బిఎస్ఎన్ఎల్ సేవలు మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని ఖమ్మం ఎంపీ గ్ర రఘురాంరెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కోరారు. భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) నల్లగొండ రీజినల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. నల్లగొండ పానగల్ రోడ్డులో ఉన్న బీఏస్ఏన్ఏల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సంస్థను బలోపేతం చేసి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రైవేటు సంస్థలకు దీటుగా బిఎస్ఎన్ఎల్ సంస్థను అగ్రభాగాన నిలపాలని మారుమూల ఏజెన్సీ, కొండ ప్రాంతాలకు వారికి కూడా సేవలను విస్తరించాల్సి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. అవసరమైన చోట కొత్త టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అదేవిధంగా 2జి, 3జి, 4జి మరియు 5జి సేవలను ప్రజల్లోకి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బిఎస్ఎన్ఎల్ సంస్థను మరింత విస్తృతపరచటానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి అడ్వైజరీ కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా ఏ డి ఎం జి శ్రీనివాసరావు దృష్టికి బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాలని 22 గ్రామాలకు గాను కేవలం నాలుగు గ్రామాల్లోనే బిఎస్ఎన్ఎల్ సేవలు అందుతున్నాయని టి ఏ సి సభ్యులు కృష్ణ వారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎడియం బోనకల్ మండలం పై ప్రత్యేక దృష్టి సారించి అన్ని గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు అందేలా తన వంతు కృషి చేస్తానని నా సొంత మండలం కూడా బోనకల్ లేనని ఆయన సభలో తెలిపారు. ఈ కార్యక్రమంలో , ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాశ్యం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ గురువయ్య, అధికారులు రవి ప్రసాద్, మురళీ కుమార్ టీఏసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఎస్ కె ఇమామ్ సాహెబ్, యసా వేంకటేశ్వర్లు, అమరవాది సత్యనారాయణ రెడ్డి, మచ్చా రామారావు, బానోత్ రంజిత్ నాయక్, పల్లెల రామ లక్ష్మయ్య, , బడసు కనకరాజు, పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగానికి అభినందనలు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, ఏప్రిల్ 17(భారత శక్తి) : ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను ప్రణాళికాబద్ధంగా, బాధ్యతాయుతంగా, నిబద్ధతతో కల్యాణ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా అధికారులు, అధికార యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభినందనలు తెలియజేశారు.తితిదే యంత్రాంగ సమన్వయంతో.. ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణోత్సవ విజయవంతంలో కీలక పాత్ర పోషించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందిస్తూ బుధవారం సాయంత్రం శిల్పారామంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభినందన సభను ఏర్పాటు చేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీన ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను ప్రణాళికాబద్ధంగా, బాధ్యతాయుతంగా, నిబద్ధతతో నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర వహించారని చెప్పుకోవడం గర్వంగా వుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దంపతులు ప్రత్యక్షంగా కళ్యాణోత్సవంలో పాల్గొనడం, వేలాది మంది భక్త జనానికి ఎలాంటి కొరత లేకుండా సౌకర్యాలు కల్పించడంలో తితిదే అధికారులను సమన్వయం చేసుకుంటూ.. కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కృషి అభినందనీయం అన్నారు. ఇదంతా ఒక్కరి వల్ల మాత్రమే పొందిన విజయం కాదని, అన్ని శాఖల ఉమ్మడి సహకారంతో సాధ్యం అయిందన్నారు.అంతే కాకుండా.. కళ్యాణోత్సవం విజయవంతం చేయడంలో విజయవంతం అయ్యామని సంతోషిస్తూనే.. ఏవైనా చిన్న పొరపాట్లు కూడా జరిగి ఉంటే ఆ అనుభవాలను కూడా గుర్తుంచుకొని.. భవిష్యత్ కార్యక్రమాల్లో వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.కళ్యాణోత్సవంలో భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయడంలో.. అధికారులు, సిబ్బంది కృషి ప్రశంసనీయం అన్నారు. ముఖ్యంగా జేసీ అదితిసింగ్, జిల్లాకు చెందిన నలుగురు ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, మరికొందరు ఉన్నతాధికారులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు.జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ... అన్ని శాఖల సమన్వయ సహకారాలను అందిపుచ్చుకుంటూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థాయిలో అంగరంగ వైభవంగా జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో ఎలాంటి చిన్నపాటి పొరపాట్లు లేకుండా చక్కగా నిర్వహించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ, అతితక్కువ భద్రతా బలగాలు నిర్వహణలో.. కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం గర్వాంగా ఉందన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, భక్తులకు అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు, కంట్రోల్ రూం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, మెడికల్ వంటి అత్యవసర సేవలు.. మొదలైన అన్ని అంశాల్లో జిల్లా యంత్రాంగం చేపట్టిన కృషి అభినందనీయం అన్నారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు కళ్యాణోత్సవంలో వారి అనుభవాలను పంచుకోవడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు వారి కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని.. ఉల్లాసంగా గడిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, కెఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీలోకి వరలక్ష్మి శరత్ కుమార్ 'శివంగి'..

FONT SIZE



: వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తుంటారు నటి వరలక్ష్మి శరత్ కుమార్ ఆమె నటించిన తాజా చిత్రం 'శివంగి' పవర్‌ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చి ఆకట్టుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. నేటినుంచి తెలుగు వెర్షన్ అందుబాటులోకి రాగా.. రేపటినుంచి తమిళ వెర్షన్ స్ట్రీమింగ్ కానుంది. ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు దేవరాజ్ భరణి దర్శకత్వం వహించారు. వీరిద్దరి నటన, స్క్రీన్‌ప్లే సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. చిత్రమంతా సింగిల్ లోకేషన్స్‌లో రూపొందించడం విశేషం.

# అందం కారణంగా అవకాశాలు.. అలా చెప్పడం నాకు నచ్చదు: తమన్నా

FONT SIZE



: 'ఓదెల2'లో శివ శక్తిగా నటించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు నటి తమన్నా (. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈసందర్భంగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ 'మిల్కీ బ్యూటీ' ట్యాగ్‌పై మరోసారి స్పందించారు.

"నేను ఎప్పుడూ ఒకేతరహా పాత్రలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. అందంగా ఉన్నాను కాబట్టి నాకు అవకాశాలు వస్తున్నాయి అని చెప్పడం నాకు నచ్చదు. అలా చెబితే వింతగా ఉంటుంది. మేము సినీ రంగంలో ఉంటున్నాం. ఈ పరిశ్రమలో ఉన్నవాళ్లకు అందం మీద శ్రద్ధ ఉండాలి.. కానీ, కథను ఎంచుకునేటప్పుడు పాత్ర గ్లామరస్‌గా ఉందా, లేదా అనేదానితో పాటు ఎన్నో విషయాలు చూసి ఎంపిక చేసుకుంటాం. 'మిల్కీ బ్యూటీ' అనే ట్యాగ్ నాకు అభిమానులు ఇచ్చారు. క్రమంగా అది వాడుకలోకి వచ్చింది. మీడియా దాన్ని మరింత ప్రచారం చేసింది. ఈ ట్యాగ్ నా సినిమాల ఎంపికలపై ప్రభావం చూపలేదు" అని చెప్పారు.

ఇటీవల కూడా తమన్నా దీనిపై మాట్లాడిన విషయం తెలిసిందే. అలా పిలవడం వల్ల తనకేం ఇబ్బందిగా లేదని.. అయితే తన అందం వల్ల కాకుండా పాత్రలతో నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడం తన లక్ష్యమని చెప్పారు. తన పనితనాన్ని చూడాలని కోరారు.

# ఎన్టీఆర్‌పై ప్రశంసలు కురిపించిన రాజమౌళి



స్టార్ హీరో ఎన్టీఆర్‌పై (దర్శక ధీరుడు రాజమౌళి ప్రశంసలు కురిపించారు. 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ జపాన్‌లో విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా జపాన్ వెళ్లిన రాజమౌళి అక్కడి మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ నటనపై ప్రశంసలు కురిపించారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'కొమురం భీముడో' పాట గురించి ప్రస్తావించారు.

"కొమురం భీముడోలాంటి కష్టమైన పాటను చిత్రీకరించడం నాకు చాలా సులభమైందంటే దానికి కారణం ఎన్టీఆర్. అతడు గొప్ప నటుడని అందరికీ తెలుసు. కానీ, ప్రత్యేకించి ఆ పాటలో తారక్ నటన మరో స్థాయిలో ఉంటుంది. అతడి శరీరంలోని అణువణువుతోనూ హావభావాలు పలికించాడు. నేను ఆ పాట చిత్రీకరణలో అతడి ముఖంపై కెమెరా పెట్టి పాట ప్లే చేశాను అంతే. అది ఎంతో గొప్పగా వచ్చింది. ఈ పాట వెనక కొరియోగ్రాఫర్ ప్రతిభ కూడా ఉంది. తారక్‌ను ఎలా కట్టాలి, ఎలా వేలాడదీయాలో బాగా ఆలోచించి కొరియోగ్రఫీ చేశారు'' అని రాజమౌళి (చెప్పారు. ఇక ఈ సినిమా తెర వెనక సంగతులతో రూపొందించిన 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' (డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై మంచి ఆదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

ఇక ప్రస్తుతం ఎన్టీఆర్ బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్2లో నటిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. దాదాపు చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది.

# సీక్వెల్‌కు సిద్ధమైన తాజా హిట్ చిత్రం



: సన్నీ దేవోల్ , రణ్‌దీప్ హుడా ప్రధాన పాత్రల్లో తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'జాట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా టాలీవుడ్‌లో పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకొని బాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్ రానున్నట్లు టీమ్ ప్రకటించింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై పార్ట్ 2 రానున్నట్లు తెలిపింది.

"బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న తర్వాత జాట్ విశ్రాంతి తీసుకోవాలనుకోవడం లేదు. ఈసారి మరో పెద్ద మిషన్‌తో అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో మీ ముందుకువస్తాడు" అంటూ పోస్టర్ విడుదల చేశారు. సీక్వెల్‌కు కూడా గోపీచంద్ మలినేని దర్శకత్వం వహించనున్నట్లు తెలిపారు. త్వరలోనే దీని పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

# భూ భారతి-2025 చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్17:భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం హుజూర్ నగర్ డివిజన్ పరిధిలోని గరిడేపల్లి మండల కేంద్రంలోని రామకోటయ్య పంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని తదుపరి రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయి లో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని ఇప్పుడు మండల స్థాయి లో ప్రజలకి చట్టం పై అవగాహన తెచ్చేందుకు 23 మండలాలలో ప్రజలకి సమస్యలు ఎలా పరిష్కరించాలో అవగాహన సదస్సు లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయని ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గానీ కోర్టు ద్వారా గానీ పరిష్కరించే విధంగా ఉండేదని ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేట వచ్చి సమస్య పై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్ డి ఓ, కలెక్టర్ స్థాయి లో పరిష్కరించవచ్చు అని త్వరలో గ్రామ స్థాయి లో భూ సమస్యలు పరిష్కరించేందుకుగ్రామ పరిపాలన అధికారి(జిపిఓ)నియమించబోతున్నారని తెలిపారు.భూ భారతి చట్టం ఏప్రిల్ 14 న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని తదుపరి ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారని అక్కడ ఏమైనా సమస్యలు పరిస్కారం కాకపోతే భూ భారతి చట్టంలో మార్పులు తెచ్చి భూ సమస్యలు తీర్చుతారని తదుపరి జూన్ 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు.భూమిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తారని చాలా మందికి బ్రతకడానికి భూమినే ఆధారం ఆ భూమి తమదని నిరూపించు కునేందుకు పట్టాదారు పాస్ బుక్ ఉండాలని భూ భారతి చట్టం ద్వారా 13 (బి) లకు పాస్ బుక్ నందు అలాగే 2020 అక్టోబర్ లో ధరఖాస్తు చేసుకున్న సాధాబైనామా ధరఖాస్తులు పరిశీలించి వాటిని పట్టాదార్ పాస్ బుక్ నందు అప్డేట్ చేస్తామని ఈ అవకాశం ధరణిలో లేదు అని తెలిపారు.గరిడేపల్లి మండలం లో సాగర్ ఎడమ కాల్వల ద్వారా నీరు పారించి అత్యధికంగా వరి పడించి నాణ్యమైన బియ్యం తయారు అవుతుందని చాలా మంది చదువుకొని ఉన్నత స్థితిలో ఉన్నారని మొదటి సదస్సు గరిడేపల్లి మండలంలో ప్రారంభించటం చాలా సంతోషగా ఉందని, రైతులు కూడా చాలా ఎక్కువ మంది రావటంతో సదస్సు విజయవంతం అయిందని తెలిపారు.భూ భారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం /పౌతి అమలు చేసేటప్పుడు గ్రామం లో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు అని ఈ అవకాశం ధరణి లో లేదని తెలిపారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి



గ్రామంలో ప్రతి రైతు కి 1 బి అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తామని తెలిపారు. భూమిలకు ఆధార్ వల్లే భూధార్ అనే యూనిక్యూ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూ భారతి పోర్టల్ లో అప్డేట్ చేస్తామని తదుపరి ప్రజలు పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలి పారు.రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు.సెక్షన్ ల వారీగా భూ భారతి చట్టం పై పిపిటి ద్వారా ప్రజలకి కలెక్టర్ వివరించారు.సదస్సుకు వచ్చిన రైతులు నూతన చట్టం పట్ల తమ హర్షం చప్పట్లతో వేలుబుచ్చారు. తమ భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయనే నమ్మకం కలుగుతుందన్నారు జిల్లా ఎస్పి నరసింహ మాట్లాడుతూ భూ భారతి చట్టం ప్రజలకి గ్రామ స్థాయి లో అవగాహన కల్పించేందుకు సదస్సు లు నిర్వహించటం జరుగుతుందని భూ పరిపాలన లో సమస్యలు పరిష్కరించేందుకు సమగ్రమైన చట్టం రూపొందించటం చాలా అద్భుతం అని తెలిపారు.ప్రజలు భూమి హద్దులు వద్ద ఘర్షణ పడి కొట్లాట కి పోయి ప్రాణాలు కోల్పోయి అనవసరంగా రౌడీ షీట్, పి డి యాక్ట్ నమోదు అవుతాయని ఎ సమస్య ఉన్న రెవిన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ధరణిలో చాలా సమస్యలు ఉన్నాయని ప్రజలు కలెక్టర్ కార్యాలయ చుట్టూ తిరిగారని గౌరవ ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా భూ భారతి చట్టం ఏప్రియల్ 14 నాడు ప్రారంభం జరిగిందని సాధాబైనామా ధరఖాస్తులు ధరణిలో పరిస్కారం కాలేదని భూ భారతిలో సాధాబైనామ అమలు, విస్తీర్ణం లో మార్పులు చేర్పులు,సర్వే నెంబర్ మార్పులు లాంటివి అమలు చేయవచ్చు అని తెలిపారు. రెవిన్యూ ప్రక్షాళన లో భాగంగా జిల్లాలో 279 మంది గ్రామ పరిపాలన అధికారులు రాబోతున్నారని వారితో పలు సమస్య లు గ్రామ స్థాయి లో పరిస్కారం అవుతాయని తెలిపారు. ఈ చట్టంలో. రైతుల భూమి రికార్డులలో భద్రంగా ఉంటుందని, రైతులకి భూమినే ప్రధానమైనదని ధరణి పై 15 నెలలు కష్టపడి కమిటీ పటిష్టమైన చట్టం రూపొందించారాని రైతులకి భూ భారతి అప్త మిత్రుడిగా ఉంటుందని తెలిపారు.ఈ సమావేశం లో ఆర్ డి ఓ శ్రీనివాసులు,తహసీల్దార్లు కవిత, నాగార్జున రెడ్డి, సైదులు, కమలాకర్, మంగా, జ్యోతి, సురేందర్ రెడ్డి, పి ఎ సి ఎస్ చైర్మన్లు సత్యనారాయణ, సుధాకర్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనాధ వృద్దురాలి ని అక్కున చేర్చుకున్న కల్వారి కుమార్

## -సొంత డబ్బులతో గత పది సంవత్సరాలుగా సేవ



మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 17,(భారత శక్తి):పట్టణం లోని జాఫర్ నగర్ సాయి బాబా టెంపుల్ దగ్గర గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేని వృద్దురాలిని రామగుండం పోలీస్ కమీషనర్ ఆఫీస్ లో సూపరింటెంట్ గా విధులు నిర్వహిస్తున్న సంధ్య, చూసి కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమం, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. కల్వరి కుమార్ కు చరవాణి ద్వారా సమాచారం అందించినారు. స్పందించిన కుమార్ మంచిర్యాల పట్టణ సీఐ. ప్రమోద్ రావు కు చరవాణి ద్వారా సమాచారం అందించినారు. అందుబాటులో లేకపోవడం తో పట్టణ ఎస్సై . కిరణ్ కుమార్ చెప్పడం వెంటనే స్పందించి వారి సిబ్బంది అయినా కానిస్టేబుల్స్ సత్యనారాయణ,రాజు కుమార్ లను వెంటనే సంఘటన స్థలానికి పంపించి ఆ అనాధ మతిస్థిమితం సరిగ్గా లేని వృద్దురాలిని జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులోని, (పాత ) శిశు మందిర్ స్కూల్ దగ్గరలోని కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమం లో చేర్పించ్చినారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. కల్వరి కుమార్ మాట్లాడుతూ మీకు ఇలాంటి వారు అంటే నా అనే వారి ఆదరణ కోల్పోయి నిస్సహాయ స్థితి లో అత్యంత దూర్భారమైన జీవితాలు గడుపుతున్న అనాధ వృద్ధులు కానీ మతిస్థిమితం సరిగ్గా లేని వారు మీకు కనబడుతే నేరుగా నా సెల్ నంబర్స్ 9701973636,9381018678 కు గాని స్థానిక పోలీస్ స్టేషన్ ల్లో కానీ సమాచారం అందించండి. ఇలాంటి వారికి నేను గత 10 సంవత్సరాలనుండి నా సొంత డబ్బులతో సేవ చేస్తున్నాను. మీరు కూడా నేను చేస్తున్న సేవ కార్యక్రమంలో మీరు కూడా భాగస్తులై మీ పెళ్లిరోజు, మీ పిల్లల పుట్టినరోజు, మీ పెద్దల జ్ఞాపకార్ధంగా నైనా సరే సంవత్సరంలో ఒక్కరోజు ఆశ్రమం లో ఆశ్రయం పొందుతున్న అనాధ వృద్దులకు మతిస్థిమితం సరిగ్గా లేని వారికి ఒక్క రోజు భోజనాలు అందించి మాకు చేయూతనందిస్తే మేము ఇంకా ఎక్కువ మందికి సేవలను అందించగలం అని అన్నారు ఈ కార్యక్రమం లో కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాజు కుమార్ లు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే భూ భారతి

## = సాదాబైనమా దరఖాస్తులకు మోక్షం

## -భూచట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ

## -అవగాహన కలిపిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఏప్రిల్ 17(భారత శక్తి):భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భూ భారతితో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూసమస్యలు పరిష్కారం కానున్నాయని అన్నారు.గురువారం తిమ్మాపూర్ మండలంలోని రైతు వేదికలో, గన్నేరువరంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ తో కలిసి పాల్గొన్నారు.భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు ఒక్కొక్క సెక్షన్, అంశం వారీగా ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్)





చట్టం 2025 అమల్లోకి వచ్చిందని అన్నారు. ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కరీంనగర్ జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ఏ సమస్యను ఏ అధికారి... ఎన్ని రోజులలో పరిష్కరించాలి.... అది పరిష్కారం కాకుంటే ఎవరికి అప్పీల్ చేయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని తెలిపారు. సీసీఎల్ఏ కు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు.భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని అన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు ఉండడంవల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల చిన్న సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని అన్నారు. దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. భూ భారతి పోర్టల్ లో ఎకరం భూమి మ్యూటేషన్ కోసం 2500 రూపాయల ఫీజు చెల్లించాలని, దరఖాస్తు తో పాటు వారసత్వ ఒప్పంద పత్రం లేదా వీలునామా కాపీ, నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం జత చేయాలని, ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గడువు తర్వాత ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు , 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని అన్నారు. హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. 300 రూపాయల ఫీజుతో పాస్ బుక్ జారీ చేస్తారని అన్నారు.భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు.

# వక్ఫ్ బిల్ చట్టం చట్టబద్ధతపై సుప్రీం కోర్టులో విచారణ



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 17: కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఈ కేసును వాదిస్తున్న సల్మాన్ ఖుర్షీద్ బృందం.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,వక్ఫ్ (సవరణ)చట్టం-2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ప్రారంభించింది అన్నారు.సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టింది అన్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసింది.విచారణకు ముందు సుప్రీంకోర్టు తమ ఎదుట రెండు ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంది.మొదటిది కేసును విచారించాలా? లేదంటే హైకోర్టుకు అప్పగించాలా? అని,రెండోది న్యాయవాదులు వాదించాలనుకుంటున్న అంశాలపై తెలిపింది. ఓ పిటిషనర్ తరఫున తమ సీనియర్ న్యాయవాదుల బృందం వాదనలు వినిపించారు.పార్లమెంట్ చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాల్లో తలదూర్చడమే అన్నారు.ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపాము అన్నారు.చట్టం ప్రకారం' అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని,ఈ పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని పేర్కొన్నారు.వక్ఫ్-అలాల్-ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదని.. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదన్నారు.ఎవరైనా వక్ఫ్‌ను స్థాపించాలనుకుంటే అతను ఐదేళ్ల ఇస్లాంను పాటిస్తున్నాడని నిరూపించుకోవాల్సి ఉందని అన్నారు.ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్‌కు ఇచ్చారని ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు.గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని.. స్వర్ణ తర్వాత హిందువులు కూడా భాగం కావొచ్చని.. ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనన్నారు.భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై మాకు పూర్తి స్థాయి నమ్మకం ఉందని తప్పకుండా మాకు న్యాయం జరుగుతుందన్నారు.

# మంథని తహసిల్దార్ గా కుమారస్వామి బాధ్యతల స్వీకరణ

మంథని : మంథని తహసిల్దార్ గా బదిలీపై వచ్చిన జీ. కుమారస్వామి గురువారం మంథని తహసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. రామగుండం తహసిల్దార్ గా పనిచేస్తున్న కుమారస్వామి ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో తహసిల్దార్ గా విధులు నిర్వహించిన రాజయ్య ను పెద్దపల్లికి బదిలీ చేయగా, పెద్దపల్లి తహసిల్దార్ రాజ్ కుమార్ ను మంథనికి కలెక్టర్ బదిలీ చేశారు. రాజ్ కుమార్ విధుల్లో చేరకపోవడంతో గత కొన్ని రోజులుగా మంథని నాయబ్ తహసిల్దార్ సిరిపురం గిరి ఇంచార్జ్ తహసిల్దారుగా బాధ్యతలు నిర్వహించారు. మంథని తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామిని డిప్యూటీ తహసిల్దార్ సిరిపురం గిరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు అనిల్ రెడ్డి, సదయ్య ఇతర కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No: APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy